Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 264 మేడ్చల్ మల్కాజ్‌గిరి 13 అక్టోబర్ 2023 శుక్రవారం పేజీలు : 4

### 'మేరా యువ భారత్'కు కేంద్రం ఆమోదం

న్యూఢిల్లీ : దేశ యువత కోసం మోదీ సర్కారు 'మేరా యువ భారత్ (మై భారత్)' పేరిట స్వయంప్రతిపత్తి కలిగిన సంస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. యువత అభివృద్ధి కోసం టెక్నాలజీ ఆధారిత వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడం, యువత నేతృత్వంలో అభివృద్ధే లక్ష్యంగా మేరా యువ భారత్‌ను ఏర్పాటు చేస్తోంది. దీనికి ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశం ఆమోదముద్ర వేసింది. యువతీయువకులు తమ ఆకాంక్షలను నెరవేర్చుకునే ప్రయత్నంలో ఈ సంస్థ వారికి సమాన అవకాశాలను కల్పిస్తుందని కేంద్ర మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ చెప్పారు. ఈ నెల 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా మేరా యువ భారత్‌ను జాతికి అంకితం చేయనున్నట్లు వెల్లడించారు.




# దసరా తర్వాతే బస్సు యాత్ర!

**అభ్యర్థుల ఎంపిక కాకుండా క్షేత్రస్థాయికి వెళ్లి ఉపయోగం లేదనే భావనలో కాంగ్రెస్**
**టికెట్లురాని నేతల అసమ్మతి కార్యకలాపాలు సద్దుమణిగాక యాత్ర చేయడమే మేలనే యోచన..**
**విజయ దశమి తర్వాత మొదలుపెట్టి ఎన్నికల వరకు కొనసాగించాలని నిర్ణయం**
**ఆ సమయంలో అగ్రనేతల ప్రచారం కూడా కలసి వస్తుందనే వ్యూహం**
**అంతా ఐక్యంగా ఉన్నామనే భావన కలిగించడమే లక్ష్యంగా ప్రణాళిక**

హైదరాబాద్: రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేతలంతా కలసి నిర్వహించ తలపెట్టిన బస్సుయాత్రకు బ్రేకులు పడ్డాయి.

ఈ యాత్రను ముందుగా అనుకు న్నట్టు ఈ నెల 15 నుంచి కాకుండా దసరా పండుగ తర్వాత ప్రారంభించాలని పీసీసీ నేతలు నిర్ణయించారు. ఎన్నికల ప్రచారం ముగిసేదాకా బస్సు యాత్రను కొనసాగించడం ద్వారా అప్పటివరకు పార్టీ కేడర్‌లో ఉత్సాహాన్ని కొనసాగించవచ్చన్న వ్యూహంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. మరోవైపు అభ్యర్థుల ఖరారు ప్రక్రియ ఓ కొలిక్కిరాకపోవడంతో అసమ్మతి బెడద నుంచి బయటపడేందుకే యాత్రను వాయిదా వేసినట్టు పలువురు నేతలు పేర్కొంటున్నారు.

**రెండు ప్రతిపాదనలు :** వాస్తవానికి ఈనెల 15వ తేదీ నుంచి రోజుకు మూడు నియోజకవర్గాల చొప్పున అన్ని జిల్లాలను చుట్టివచ్చేలా బస్సుయాత్ర చేపట్టాలని కాంగ్రెస్ సూత్రప్రాయంగా నిర్ణయించింది. రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో చర్చించి దీనిపై తుది నిర్ణయం తీసుకోవాలని భావించింది. ఈ మేరకు పీఏసీలో బస్సుయాత్రపై చర్చించిన నేతలు రెండు ప్రతిపాదనలు చేశారు. ఈ నెల 15 నుంచి 22 వరకు యాత్ర చేయాలని.. లేదంటే దసరా తర్వాతి నుంచి ఎన్నికలదాకా నిర్వహించాలని.. ఈ రెండింటిలో జాతీయ నాయకత్వం సూచన మేరకు ఏదో ఒక షెడ్యూల్‌ను ఖరారు చేయాలని మంగళవారం జరిగిన సమావేశంలో నిర్ణయించారు. ఇదే విషయాన్ని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మీడియాకూ చెప్పారు. ఇందులో రెండో ప్రతిపాదనకే అధిష్టానం మొగ్గు చూపిందని, దసరా తర్వాతే యాత్రకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందని తెలిసింది.

**ఐక్యంగా ఉన్నామని చాటేందుకే..** బస్సు యాత్ర వాయిదా వెనుక పలు కారణాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా అభ్యర్థుల ప్రకటన ఈ నెల 16న లేదా 18న ఉండే అవకాశముంది.

ఈ నేపథ్యంలో అభ్యర్థులు తేలకుండానే క్షేత్రస్థాయికి వెళ్లి ప్రయోజనం ఉండదన్న ఆలోచన వచ్చినట్టు తెలిసింది.

అంతేగాకుండా ఈనెల 15 నుంచి ప్రారంభిస్తే యాత్ర మధ్యలో ఉండగానే అభ్య ర్థులను ప్రకటించాల్సి ఉంటుందని, టికెట్లు రాని వారి అసమ్మతి ప్రభావం యాత్రపై పడుతుందన్న భావన వ్యక్తమైనట్టు సమాచారం. ఎఈ మేరకు గొడవల మధ్య యాత్ర నిర్వహించడం ద్వారా ప్రయోజనం ఉండదనే భావనకు అధిష్టానం వచ్చినట్టు గాంధీభవన్ వర్గాలు చెప్తున్నాయి. మరోవైపు దసరా తర్వాత యాత్ర చేపట్టడం ద్వారా.. ఆ సమయంలో సోనియా, రాహుల్, ప్రియాంక, ఖర్గే వంటి అగ్రనేతలు హాజరయ్యేలా షెడ్యూల్ రూపొందించి.. ఎన్నికల ప్రచారానికి ఊపు తేవచ్చనే ప్రణా ళికతో వాయిదాకే మొగ్గుచూపినట్టు వివరిస్తు న్నాయి. రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలంతా ఐక్యంగా ఉన్నారని ప్రజల్లో భావన కలిగించే ఉద్దేశమూ దెబ్బ తినదన్న ఆలోచన చేసినట్టు పేర్కొంటున్నాయి.




## ఎన్నికల గుర్తుపై ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్..

ఢిల్లీ : ఎన్నికల గుర్తులపై ఢిల్లీ హైకోర్టును బీఆర్ఎస్ ఆశ్రయించింది. కారును పోలి ఉన్న గుర్తులను ఏ గుర్తింపు పార్టీకి కేటాయించ వద్దు అని బీఆర్ఎస్ ఢిల్లీ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసింది. బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్ పై నేడు విచారణ చేపట్టనుంది. ఎన్నికల గుర్తు కారును పోలి ఉన్న గుర్తులు మరొక పార్టీకి కేటాయించడం వల్ల తమకు నష్టం జరుగుతోందని రిట్ పిటిషన్ లో బీఆర్ఎస్ పేర్కొంది. బీఆర్ఎస్ తరపున ఢిల్లీ హైకోర్టులో న్యాయవాది మోహిత్ రిట్ పిటిషన్ దాఖలు చేశారు.

ప్రస్తుతం బీఆర్ఎస్ జాతీయ పార్టీగా అవతరించింది. ఈ క్రమంలోనే పలు రాష్ట్రాల్లో పోటీకి సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాల్లో కారును పోలిన గుర్తులుంటే పార్టీకి ఇబ్బంది కలిగే అవకాశం ఉంది. దీంతో బీఆర్ఎస్ కారును పోలిన గుర్తును ఏ పార్టీకి కేటాయించవద్దని ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది.

# కంటోన్మెంట్‌లో వారసురాళ్ల కదన కుతూహలం

హైదరాబాద్: కంటోన్మెంట్ శాసనసభా నియోజకవర్గంలో వారసురాళ్లు కదన భేరికి సంసిద్ధులవుతున్నారు. మూడు ప్రధాన పార్టీల నుంచి మహిళా అభ్యర్థులు పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే సాయన్న హఠాన్మరణంతో అధికార బీఆర్ఎస్ పార్టీ తమ అభ్యర్థిగా ఆయన కుమార్తె లాస్యను ప్రకటించింది. దీంతో ప్రధాన ప్రతిపక్షాలైన కాంగ్రెస్, బీజేపీలు సైతం మహిళా అభ్యర్థుల వైపే మొగ్గు చూపే పరిస్థితులు ఎదురయ్యాయి. పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశపెట్టి, ఆ వర్గం ఓటర్లపై దృష్టిపెట్టిన బీజేపీ.. ఈ ఎన్నికల్లోనే అధిక సంఖ్యలో అతివలకు టికెట్ ఇవ్వనుందనే ప్రచారం జరుగుతోంది. ఇక కాంగ్రెస్ సైతం తమ పార్టీ తరఫున మహిళనే రంగంలోకి దింపే సూచనలు కనిపిస్తున్నాయి. బీజేపీ నుంచి ఇద్దరు మహిళా అభ్యర్థులు సుష్మిత శంకర్‌రావు, రజని ప్రధానంగా పోటీ పడుతుండగా, అధిష్టానం సుష్మితకే టికెట్ కేటాయించే అవకాశముందనే ప్రచారం జరుగుతోంది. దివంగత ప్రజా గాయకుడు గద్దర్ కుమార్తె వెన్నెలను కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థిగా దాదాపు ఖరారు చేసిందని తెలుస్తోంది. దీంతో కంటోన్మెంట్‌లో వారసురాళ్ల పోటీ అనివార్యం కానుంది. సుష్మిత తండ్రి శంకర్‌రావు 2009–14 మధ్య కాలంలో కంటోన్మెంట్‌లో ఎమ్మెల్యేగా పనిచేశారు. సాయన్న





1994 నుంచి 2009లో ఒక్కసారి మినహా అయిదుసార్లు ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. గద్దర్ కుటుంబం కంటోన్మెంట్‌ను ఆనుకుని ఉండే అల్వాల్‌లో నివాసముంటోంది.

**బీజేపీ నుంచి సుష్మిత..** బీజేపీ నుంచి కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉద్యోగి పరశురామ్, ఆర్ఎస్ఎస్ మద్దతు ఉన్న కపిల్ బరాబరి టికెట్ కోసం తీవ్రంగానే ప్రయత్నిస్తున్నారు. అయితే మాజీ ఎమ్మెల్యే శంకర్‌రావు కుమార్తె సుష్మితకు టికెట్ ఇప్పించడంలో ఆమె మామ వివేక్ కీలక పాత్ర పోషిస్తున్నారు. అధిష్టానం తీరుపై అసహనంతో ఉన్న వివేక్‌ను ఒప్పించే క్రమంలో బీజేపీ పెద్దలు ఆయన మేనకోడలు సుష్మితకు టికెట్ ఖరారు చేయొచ్చనే అంచనాలున్నాయి.

**కాంగ్రెస్ ఆశావహుల్లో టెన్షన్..** కాంగ్రెస్ నుంచి స్థానిక నేతలు డీబీ దేవేందర్, నర్సింహతో పాటు పొంగులేటి అనుచరుడు పిడమర్తి, అల్వాల్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ జీవక పోటీ పడుతున్నారు.

కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ సైతం తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలంటూ కాంగ్రెస్ అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు సమర్పణకు వెళ్తూ అట్టహాసంగా ర్యాలీ నిర్వహించిన సర్వే ఆ తర్వాత సైలెంటయ్యారు.

తాజా సమీకరణాల నేపథ్యంలో పార్టీ అధిష్టానం గద్దర్ కుమార్తె వెన్నెల వైపు మొగ్గు చూపినట్లు సంకేతాలు అందుతున్నాయి.

**తొలి మహిళా ఎమ్మెల్యే మంకమ్మ :** 1957లో ఏర్పడిన కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి తొలిసారిగా బీవీ గురుమూర్తి ఎమ్మెల్యేగా గెలిచారు. 1967లో ఈ స్థానం ఎస్సీ రిజర్వ్‌డ్ కావడంతో వి. రామారావు ఎమ్మెల్యేగా గెలిచారు.

ఏడాదిలోనే ఈయన మరణించడంతో ఉపఎన్నికల్లో ఆయన సతీమణి మంకమ్మ ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. తిరిగి 1962లో జరిగిన సాధారణ ఎన్నికల్లో మళ్లీ పోటీ చేసి గెలిచారు. కంటోన్మెంట్ తొలి, ఏకైక మహిళా ఎమ్మెల్యేగా రికార్డు ఆమె పేరిటే ఉంది.




# బిజెపి - బిఆర్ఎస్ ఆశలన్నీ డిసెంబర్ 3పైనే

హైదరాబాద్ : 'టార్గెట్ డిసెంబరు–3' –ఇప్పుడు బీజేపీ, తెలంగాణ అధికార పార్టీ బీఆర్ ఎస్‌కు ప్రతిష్టాత్మకంగా మారిపోయింది. ఎన్నికల నగారా మోగడం, రాష్ట్రంలో రాజకీయం మరింత వేడెక్కిన దరిమిలా.. ఎన్నికల ఓట్ల లెక్కింపు జరగనున్న డిసెంబరు 3వ తేదీపై ఇటు బీజేపీ, అటు బీఆర్ ఎస్ పార్టీల ముఖ్య నాయకులు సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. డిసెంబరు 3న తెలంగాణలో బీజేపీ జెండా ఎగురు తుందని తాజాగా కేంద్ర హోం మంత్రి, బీజేపీ అగ్రనాయకుడు అమిత్ షా సంచలన వ్యాఖ్యలు చేశారు. దీనికి కౌంటర్‌గా బీఆర్ ఎస్ ముఖ్య నాయకురాలు, సీఎం కేసీఆర్ తనయ కవిత కూడా షాకింగ్ డైలాగులు పేల్చారు. డిసెంబరు 3న మరోసారి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో కారు పరుగులు పెడుతుందని, హ్యాట్రిక్ సాధించి ముచ్చటగా సీఎం కేసీఆర్ మరోసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారని కవిత వ్యాఖ్యానించారు. మొత్తంగా చూస్తే.. టార్గెట్ డిసెంబరు–3 ఇరు పార్టీలకు ప్రతిష్టాత్మకంగా మారిపోయింది. ఇదిలావుంటే, తాజాగా తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించి.. బహిరంగ సభలో పాల్గొన్న అమిత్ షా.. ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించేశారు. తెలంగాణలో అధికారం సాధించాలనే పట్టుదలతో షా దూకుడు ప్రదర్శించారు. అయితే, తన ప్రసంగంలో పూర్తిగా అమిత్ షా.. సీఎం కేసీఆర్‌ను టార్గెట్ చేయడం గమనార్హం. సీఎం కేసీఆర్ వల్లే గిరిజన యూనివర్సిటీ ఆలస్యమైందని చెప్పారు. అయితే, దీనికి కౌంటర్‌గా ఎమ్మెల్సీ కవిత.. గతంలోనే ఏర్పాటు చేస్తామని చెప్పి ఉంటే తాము ఎందుకు అడ్డుపడేవారమని నిలదీశారు.

అంతేకాదు.. గిరిజనులను అడ్డు పెట్టుకుని రాజకీయాలు చేస్తున్నారంటూ ఆమె మండిపడ్డారు. ఎన్నికల్లో ఓట్ల కోసం గిరిజన యూనివర్సిటీని ప్రకటించారని.. ఇప్పుడు బీజేపీకి రాష్ట్రంలో గిరిజనులు ఉన్నారనే విషయం గుర్తుకు వచ్చిందా? అని కవిత ప్రశ్నించారు. ఇక, కృష్ణా ట్రైబ్యునల్‌లో మార్పులు చేయడం ద్వారా ప్రధాని మోడీ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని అమిత్‌షా చెప్పుకొ చ్చారు. దీనిపైనా కవిత విమర్శలు గుప్పించారు. కృష్ణా ట్రైబ్యునల్‌లో మార్పులు చేయడం ద్వారా తెలంగాణ గొంతు కోస్తున్నారనే విషయం తెలంగాణ సమాజం గుర్తించిందని ఆమె పేర్కొన్నారు. మొత్తంగా చూస్తే.. టార్గెట్ డిసెంబరు 3పై బీజేపీ, బీఆర్ ఎస్ పార్టీలు చాలా వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నాయనే చెప్పాలి. కేంద్రం ఇంకా తీసుకురాని మహిళా రిజర్వేషన్ బిల్లును కూడా అమిత్ షా ప్రధానంగా ఫోకస్ చేయడం గమనార్హం.

# సంపాదకీయం

## యుద్ధం నష్టానికి మించి ఇజ్రాయెల్ పరువు పాయె

ప్రపంచ దేశాల్లో సాంకేతికంగా కానీ.. నిఘా వ్యవస్థకు సంబంధించి పేరున్న దేశాల్లో టాప్ 5లొ ఉంటుంది ఇజ్రాయెల్ నిఘా వ్యవస్థ. ప్రపంచం లోని ఏ టార్గెట్ అయినా సరే.. ఇట్టే ఛేదించే సత్తా ఇజ్రాయెల్ నిఘా వ్యవస్థ కు ఉందన్న పేరుంది. ఇప్పటివరకు ఇజ్రాయెల్ నిఘా సంస్థకున్న పేరు ప్రఖ్యాతులన్ని తుడిచిపెట్టేసేలా చోటు చేసుకున్న హమస్ దాడులు.. ఇజ్రా యెల్ నిఘా వ్యవస్థను కోలుకోలేనంత భారీగా దెబ్బ తీశాయని చెప్పాలి. డజన్ల కొద్దీ సాయుధులు ఇజ్రాయెల్.. గాజా స్ట్రిప్ మధ్యనున్న పటిష్ఠమైన రక్షణ కంచెను బుల్డోజర్ లతో కూల్చేసి ఇజ్రాయెల్ లోకి ప్రవేశించటం ఒక ఎత్తు అయితే.. నిమిషాల వ్యవధిలో వేలాది రాకెట్లను ప్రయోగించటం.. సరిహద్దుల్లోకి ప్రవేశించి.. కనిపించిన వారిని కనిపించినట్లుగా పిట్టల్లా కాల్చేసిన వైనం గురించి తెలిసినప్పటి నుంచి తీవ్రమైన షాక్ కు గురైన దుస్థితి. ఇజ్రాయెల్ అన్నంతనే దాని నిఘా వ్యవస్థ షిన్ బెట్ కానీ.. గూఢా చార సంస్థ అయినా మొసాద్ లు.. ఇంతలా ఎలా ఫెయిల్ అయి ఉ ంటాయి? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది. దాడులకు సంబంధించి సమాచారం ముందే ఉండి ఉన్నప్పటికి దాడుల్ని అడ్డుకోలేకపోవటం అయితే.. అంతకు మించిన దారుణ వైఫల్యం మరొకటి ఉండదు. నిధుల కొరత అన్నదే లేని ఇజ్రాయెల్ నిఘా వ్యవస్థ.. ఇంత భారీ దాడుల్ని ముందస్తుగా ఎందుకు గుర్తించలేకపోయింది? అన్న దిప్పుడు ప్రశ్నగా మారింది. ఇజ్రాయెల్ సీక్రెట్ సంస్థకు సంబంధించిన ఏజెంట్లు పాలస్తీనియన్ మిలిటెంట్ల గ్రూపులతో పాటు లెబనాన్.. సిరియా.. ఇలా పలు దేశాల్లో వారి ఏజెంట్లు ఉన్నారు. పటిష్టమైన నిఘా వ్యవస్థ ఉందన్న పేరు ప్రఖ్యాతులున్నప్పటికి ఇలాంటి పరి స్థితులు ఎందుకు ఏర్పడ్డాయన్నది చర్చ నీయాంశంగా మారింది. డ్రోన్లతోనూ.. ఏజెంట్ల సాయంతో కార్లకు జీపీఎస్ పరికరాల్ని అమర్చి.. వాటిని ట్రాక్ చేసి దాడులు చేపట్టటం.. సెల్ ఫోన్ పేలుళ్లతోనూ దాడులకు పాల్పడే ఇజ్రాయల్ నిఘా వ్యవస్థకు ఏమైంది? శత్రువుల కదలికల్ని ట్రాక్ చేసే విషయంలో చోటు చేసుకున్న వైఫల్యం ఇప్పుడా దేశ వాసుల్ని మాత్రమే కాదు.. ప్రపంచ దేశాలకు మాత్రం నమ్మశక్యం కానిదిగా మారింది.

# సుందరంగా మారేదెన్నడో?




కరీంనగర్ : కరీంనగర్ ఆకర్షణీయ నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు కూడళ్లను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. స్మార్ట్‌సిటీలో భాగంగా రహదారులు, పార్కులు, మురుగునీటి కాల్వలు నిర్మిస్తుండగా అధ్వానంగా మారిన చౌరస్తాలను అదనపు హంగులు జోడించి నిర్మించేందుకు ప్రణాళికలు చేసి పనులు ప్రారంభించారు. ఇప్పటికే కమాన్ చౌరస్తా, శ్రీపాదరావు కూడలి, నాకా చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, పాత ఎంప్లాయ్‌మెంట్ కూడలి, ఆర్‌అండ్‌బీ కూడలి, అంబేడ్కర్ చౌరస్తా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తెచ్చారు. పట్టణ ప్రగతి, స్మార్ట్‌సిటీలో మరిన్ని కూడళ్లను తీసుకొని తీర్చిదిద్దుతున్నారు.

ఆహ్లాదకరంగా.. ఆకట్టుకునేలా..

గతంలో విశాలమైన కూడళ్లు నిర్మించగా ఆ ప్రాంతంలో ఎలాంటి ట్రాఫిక్ ఆంక్షలు ఉండేవి కావు. వెడల్పుగా ఉండటంతో వాహనాలు ఆగకుండా నెమ్మదిగా వెళ్లే విధంగా అప్పటి అవసరాలకు తగ్గట్లుగా నిర్మించారు. వాహనాల సంఖ్య పెరగడం, వేగంగా రాకపోకలు సాగిస్తుండటం, పాదచారులు రోడ్డు దాటేందుకు ఇబ్బందులు ఎదురు కావడంతో ఆ విధానానికి స్వస్తి పలికారు. ఇప్పుడున్న కూడళ్లను కుదించి ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసేలా ప్రణాళికలు చేశారు. ఆయా చౌరస్తాలలో అధునాతన డిజైన్లతో గ్రీనరీ, వాటర్‌ఫౌంటెయిన్, లైటింగ్స్, విభిన్న ఆకృతులు ఉండేలా మారుస్తున్నారు. శ్రీపాద కూడలిని ముట్టుకోకుండా, నాకాచౌరస్తా, ఆర్‌అండ్‌బీ జంక్షన్లకు మరింత అందాలు మెరుగు పర్చాలని భావిస్తున్నారు.

ఆరు నెలలుగా నత్తనడకన

నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం, ప్రజలందరికీ అడ్డాగా ఉండే తెలంగాణ, ఇందిరాచౌక్ ప్రాంతంలోని కూడలి సుందరీకరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఆరు నెలల కిందట ప్రారంభించగా మూడు నెలలుగా ఎలాంటి పనులు చేయకుండా తవ్వి పెట్టారు. ఇందులోని ఎర్రమట్టి కూడా ఎక్కడ పడితే అక్కడికీ తరలించగా ఇప్పటికీ లెక్క తేల్చలేదు. బిల్లు రికార్డు చేసే సమయంలో ఆ మొత్తాన్ని మినహాయింపు ఇస్తామని చెబుతుండగా అదీ సాధ్యమయ్యే పనేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఓల్డ్ పవర్ హౌజ్ కూడలిని గత నెల 19న ప్రారంభించడం, ఆ పనులు శరవేగంగా సాగుతుండటంతో గత్యంతరం లేక అప్పటి నుంచి వన్‌టౌన్, ఇందిరాచౌక్ కూడలిలో పనుల పురోగతి కొంతమేర కనిపిస్తోంది.

నెలాఖరులోగా పూర్తి చేస్తారా?

ఈనెలాఖరులోగా 13 జంక్షన్లను పూర్తి చేసేలా కార్యాచరణ తీసుకున్నట్లు ప్రకటించగా ఇప్పటికీ కొన్ని చోట్ల పనులే ప్రారంభం కాలేదు. మరో పది రోజులైతే ప్రకటించిన గడువు కూడా ముగియనుంది. ఆలోగా కనీసం మూడు కూడళ్లు కూడా పూర్తి చేసేలా కనిపించడం లేదు. మారుతీనగర్-ఓల్డ్ పవర్‌హౌజ్ జంక్షన్‌తో పాటు మరో మూడు కూడళ్లకు సంబంధించి అభివృద్ధి పనులు రూ.2.68 కోట్లతో నెల రోజుల కిందట ప్రారంభించారు. కాగా రామగుండం బైపాసు రోడ్డు, తీగల వంతెన, సదాశివపల్లి ప్రధాన రహదారి కూడలి నిర్మించేందుకు మార్కింగ్ ఇవ్వాల్సి ఉంది. ఒకచోట విద్యుత్తు టవర్ అడ్డుగా ఉండటంతో దానిని తొలగించేందుకు సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. కనీసం మొదటగా ప్రారంభించిన చౌరస్తాల పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాల్సిన అవసరముంది.

త్వరితగతిన పూర్తిజంక్షన్ల అభివృద్ధి పనుల్లో వేగం అందుకుంది. వీటిని త్వరితగతిన పూర్తి చేసేలా నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాం. కొన్ని చోట్ల ఇబ్బందులు రాగా పరిష్కారానికి చర్యలు చేపట్టాం.

నాగమల్లేశ్వరరావు, ఎస్‌ఈ, నగరపాలిక

# అతివలకు అండగా ఆరోగ్య మహిళ



జగిత్యాల : ఆధునిక జీవన విధానంలో పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్న మహిళలు తమ ఆరోగ్యంపై దృష్టి సారించక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని మహిళలకు సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా 'ఆరోగ్య మహిళ' కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. రాష్ట్రంలోని 100 ఆసుపత్రుల్లో కార్యక్రమం ప్రారంభం కానుండగా జగిత్యాల జిల్లాలోని ఐదు ఆసుపత్రులలో సేవలు ప్రారంభించనున్నారు.

జిల్లాలో ఇలా..జిల్లాలోని ఐదు నియోజకవర్గాల పరిధిలోని ఐదు ఆసుపత్రుల్లో మహిళలకు ప్రతీ ప్రత్యేక సేవలు అందించడానికి వైద్యులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మహిళలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు చేసి మందులు ఇవ్వనున్నారు. తొలి విడతలో జగిత్యాల గాంధీనగర్ పట్టణ ఆరోగ్య కేంద్రం, కొడిమ్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ధర్మపురి మండలంలో నేరేళ్ల ఆరోగ్య కేంద్రం, కథలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, అయిలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవలు ప్రారంభించనున్నారు.

మహిళా సిబ్బందితో పరీక్షలు

ఆరోగ్య మహిళ కార్యక్రమంలో భాగంగా మహిళలకు ప్రత్యేక వైద్య సేవలు అందించడానికి ఆయా ఆసుపత్రులలో వైద్యులు, పారమెడికల్, ఇతర సిబ్బందిని పూర్తిగా మహిళలనే నియమించారు. మహిళలు తమ అనారోగ్య సమస్యలు తెలపడానికి, సత్వర చికిత్సలు అందించ డానికి, అవగాహన కల్పించడానికి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మహిళల్లో రక్తహీనత, థైరాయిడ్ చికిత్స, పలు క్యాన్సర్ల లక్షణాలుంటే నిర్ధారణ, గైనకాలజీ వ్యాధుల నిర్ధారణ, మందులు, రక్త పరీక్షలు, స్కానింగ్‌తోపాటు అవసరమైన శస్త్ర చికిత్సలు నిర్వహిస్తారు. ప్రతీ మహిళలు సేవలు పొందడానికి గ్రామాల్లో ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బందిచే అవగాహన కల్పిస్తున్నారు.

మహిళలు సేవలను వినియోగించుకోవాలి- పుప్పాల శ్రీధర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖధికారిజిల్లాలోని ఐదు ఆసుపత్రులలో ఆరోగ్య మహిళ సేవలు అందించడానికి వైద్యులు, సిబ్బందికి శిక్షణ పూర్తి చేశాం. ప్రతి ఐదు ఆసుపత్రులలో మహిళలకు ప్రత్యేకంగా సేవలు అందిస్తారు. మహిళలు సమీపంలోని ఎంపిక చేసిన ఆసుపత్రుల్లో ఆరోగ్య సమస్యలకు చికిత్సతో పాటు మందులు పొందవచ్చు. మహిళలకు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తాం. గ్రామాల్లో మహిళలకు ఆరోగ్య మహిళ కార్యక్రమంపై అవగాహన కల్పించి పకడ్బందీగా అమలు చేస్తాం. ఆసుపత్రులలో సేవలను మహిళలు వినియోగిం చుకోవాలి.

# సాగు తగ్గే.. ధర పెరిగే

సూర్యాపేట : ఉమ్మడి జిల్లాలో పప్పు ధాన్యాల సాగు ఏటా తగ్గిపోతోంది. దీంతో పప్పు ధర పెరుగుతోంది.ఫలితంగా పేద, మధ్య తరగతి ప్రజలు పప్పు కొనలేని పరిస్థితి నెలకొంది. నీరు సమృద్ధిగా లభించడంతో పాటు వరి ధాన్యానికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుండటంతో అన్నదాతలు వరిసాగు వైపు మొగ్గు చూపుతున్నారు. అంతేకాకుండా పత్తి, మిర్చి పంటకు ధర బాగుండటంతో వాటిపై కూడా దృష్టి సారిస్తున్నారు. మెట్ట ప్రాంతాల్లో కంది, పెసర, మినుముల పంటలు సాగు చేసినా.. వర్షాకాలంలో పంట నష్టపోవాల్సిన పరిస్థితి. వేసవిలో సాగు చేస్తే ఎండల కారణంగా, అకాల వర్షాల కారణంగా పంట చేతికొచ్చే పరిస్థితి లేదని రైతులు చెబుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. పెసర, మినుము పంటకు కోతులు నష్టం చేస్తుండటంతో అన్నదాతలు వెనకడుగు వేస్తున్నారు.

ప్రచారం కల్పించినా..వ్యవసాయ అధికారులు పంట నమోదు వివరాల ప్రకారం ఉమ్మడి జిల్లాలో కంది 6,564, పెసర 258, మినుము 153 ఎకరాల్లో సాగు చేశారు. పప్పు ధాన్యాల సాగు గణనీయంగా పడిపోవడంతో ఆ ప్రభావం పప్పు ధరలపై పడుతోంది. గతంలో సూర్యాపేట జిల్లా కంది, పెసర పంటలకు నిలయంగా ఉండేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. గతసారి వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పప్పు, చిరు ధాన్యాలపై సాగుపై అవగాహన కార్యక్రమాలు సైతం ఏర్పాటు చేసినా.. ఆ దిశగా అన్నదాతలు దృష్టి సారించలేదు. గత యాసంగి వరి కొనుగోళ్ల సమయంలో అధికారులు నేరుగా రైతుల వద్దకు వచ్చి పప్పు, చిరు ధాన్యాలపై దృష్టి సారించాలని, ఆశించిన స్థాయిలో ధర ఉంటుందని ప్రచారం కల్పించినా.. సాగులో అన్నదాతలు వెనకడుగు వేశారు. ప్రస్తుతం మార్కెట్లో పప్పు ధాన్యాలకు ధర బాగానే ఉన్నా.. ధాన్యం ఆశించిన స్థాయిలో రావడం లేదు. కంది, పెసర క్వింటాకు రూ.6,500 నుంచి రూ.8,500 వరకు ధర పలుకుతోంది. పప్పు ధరలపై ప్రభావంకంది, పెసర పంటలు ఇప్పటికే మార్కెట్లోకి రావాల్సి ఉంది. అయినా నేటికీ ధాన్యం రాక అంతంత మాత్రంగానే ఉండటంతో.. ఆ ప్రభావంతో పప్పు ధరలు పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో కందిపప్పు, మినపగుండ్లు కిలో ధర రూ.150 చేరువవుతోంది. పెసర పప్పు కూడా అదే దారిన ఉంది. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం పప్పు ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రభుత్వం స్పందించి పప్పు ధాన్యాల వైపు రైతులను ప్రోత్సహించాలని ప్రజలు కోరుతున్నారు.

# వస్త్రోత్పత్తులకు నవశకం

సిరిసిల్ల: కార్మికులను యజమానులుగా మార్చేందుకు వడివడిగా అడుగులు పడుతున్నాయి. సిరిసిల్ల పట్టణ శివారులోని పెద్దూరులోని వీవింగ్ పార్కులో షెడ్ల నిర్మాణం చివరి దశకు చేరింది. ఇటీవల మరమగ్గాల ఎంపికపై కార్మికులు, వాటి తయారీ కంపెనీలతో వర్క్‌షాప్ జరిగింది. దీనిలో 4/1 అండర్ పిక్‌లో సెమీ ఆటోమెటిక్ మరమగ్గాలకు కార్మికులు ఆసక్తి చూపారు. వారి అభిప్రాయాలు, ఆయా కంపెనీల ధరల నివేదికను రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ఉన్నతాధికారులకు పంపారు. తుది పరిశీలన తర్వాత మరమగ్గాల కొనుగోలుకు టెండర్లు పిలిచే అవకాశం ఉంది. తొలి విడత 1,104 మంది కార్మికులకు 4,416 మరమగ్గాలను ఇవ్వనున్నారు. 2016-17లో రూ.370 కోట్ల అంచనా వ్యయంతో ఈ పథకాన్ని రూపొందించారు. ఒక కార్మికుడు, నాలుగు మగ్గాలతో యూనిట్‌గా తీసుకుని రూ.8 లక్షలుగా అంచనా వేశారు. దీనిలో రెండు మగ్గాలకు డాబీ, రెండు మగ్గాలకు జకార్డు అమర్చి ఇవ్వాలని నిర్ణయించారు. మగ్గాల తయారీలో ముడిసరకు ధరలు పెరగడంతో యూనిట్ విలువ రూ.10 లక్షలు దాటే అవకాశం ఉంది. ఇప్పటికే టెక్స్‌టైల్ పార్కు, పట్టణంలో కలిపి 30 వేల మరమగ్గాలున్నాయి. కొత్తగా పంపిణీ చేసే మగ్గాలపై ఎలాంటి ఉత్పత్తులు చేయవచ్చు అనే దానిపై కార్మికుల్లో ఆసక్తి నెలకొంది. జిల్లా వస్త్రపరిశ్రమలో టెక్స్‌టైల్ పార్కులో ర్యాపియర్, పట్టణంలోని పురాతన సాధారణ మరమగ్గాలు ఉన్నాయి. మొత్తంగా వీటిపై అయిదు వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. ర్యాపియర్ మగ్గంపై ఒక షిఫ్టునకు సగటున 50 మీటర్లు, సాధారణ మగ్గాలపై 25 మీటర్ల ఉత్పత్తి చేయగలరు. టెక్స్‌టైల్ పార్కులోని వాటిపై షూటింగ్, షర్టింగ్‌లకే పరిమితం. అవి కూడా సాధారణ రకాలే. డిజైన్లు, చెక్స్ వంటివి రావు. వీటిపై చీరల ఉత్పత్తి సాధ్యం కాదు. సాధారణ మగ్గాలపై ముతకరకం పాలిస్టర్, కాటన్ ఉత్పత్తులకే పరిమితం. వీటికి డాబీ, జకార్డులు అమర్చితే చీరల ఉత్పత్తికి అవకాశం ఉంది. ఎగుమతి రకాల ఉత్పత్తులు లేక ప్రైవేటు వస్త్రోత్పత్తుల ఆర్డర్లు రావడం లేదు. వర్కర్ టు ఓనర్ పథకంలో అందజేసే మరమగ్గాలు సెమీ ఆటోమెటిక్ మగ్గాలు. ఎలక్ట్రానిక్ డాబీ, జకార్డు అమర్చి ఉండటంతో నాణ్యతలో ఎగుమతి రకాలకు తీసిపోవు. వీటిపై కాటన్, పాలిస్టర్, సిల్క్ వస్త్రాలతో చేతి రుమాలు, లుంగీలు, తువ్వాలు మొదలుకొని పట్టుచీరల వరకు ఉత్పత్తి చేయొచ్చు. కంప్యూటర్‌లో డిజైన్లు రూపొందించి చిప్ ద్వారా వీటికి అనుసంధానించవచ్చు. ప్రస్తుతం పట్టణంలో ఉత్పత్తి చేస్తున్న బతుకమ్మ చీరల అంచుల డిజైన్లను చేతితో తయారు చేస్తున్నారు. సుమారు 16 వేల మగ్గాలపై కోటి మీటర్ల ఉత్పత్తికి ఎనిమిది నెలల సమయం పడుతుంది. కార్మికులకు ఇవ్వబోయే మగ్గాలపై డిజైన్ల ఎంపిక సులభమవుతుంది. నాణ్యతతో తక్కువ సమయంలో ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. ఫలితంగా కార్మికులపై పనిభారం తగ్గుతుంది. వీరి ఉత్పత్తుల నైపుణ్యాల ఆధారంగా ప్రైవేటు సంస్థల ఆర్డర్లు పెరిగే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం పార్కులో 46 షెడ్ల నిర్మాణం పూర్తయింది. ఒక షెడ్డులో ఒక్కో కార్మికుడికి 800 చదరపు గజాల్లో నాలుగు మరమగ్గాలు, కండెలు చుట్టే యంత్రంతోపాటు సామగ్రి భద్రపరచుకునే గదిని కేటాయిస్తారు. వీటితోపాటు పార్కు మొత్తానికి 6 వార్పిన్ యూనిట్లు కూడా ఉంటాయి.

# జలవనరుల్లో ఆక్రమణల పర్వం

సిరిసిల్ల : జలవనరులను అక్రమార్కులు కబ్జా చేస్తున్నారు. నిర్మాణ వ్యర్థాలతో చెరువు శిఖాలను నింపేస్తున్నారు. ఏళ్లుగా ఈ ఆక్రమణలు కొనసాగుతూనే ఉన్నాయి. శిఖం ఆక్రమణలతో కబ్జాదారులు, కొందరు ప్రజాప్రతినిధులు కోట్లాది రూపాయలు సంపాదిస్తుంటే, సిరిసిల్ల పురపాలిక మాత్రం చాలా నష్టపోతోంది. భూగర్భజలాలు అడుగం టుతున్నాయి. వరద నీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. వర్షాకాలమొస్తే కాలనీలు చెరువులను తలపిస్తున్నాయి. నాలాలు కుచించుకుపోతున్నాయి. ఇలాంటి అనేక సమస్యలకు కారణమైన ఆక్రమణలు.. కొన్ని చెరువుల్లో నేటికీ యథాతథంగా జరుగుతుండటం ఆందోళనకు తావిస్తోంది. సిరిసిల్ల పురపాలిక పరిధిలోని చెరువుల పరిరక్షణకు యంత్రాంగం గాలికొదిలేసినట్లుంది. ఆక్రమణల పర్వం సాగుతున్న తీరుపై పరిశీలన కథనం.

ఈదుల చెరువు కనుమరుగు

జిల్లా కేంద్రమైన సిరిసిల్ల పురపాలక సంఘం ఎన్నికలకు ముందు చుట్టూ ఏడు గ్రామాలు విలీనమయ్యాయి. జరుగుతున్న అభివృద్ధితో పట్టణం విస్తరిస్తూ వస్తోంది. సిరిసిల్ల పట్టణం రగుడు నుంచి ఎల్లారెడ్డిపే ట మండలం వెంకటాపూర్ వరకు సిరిసిల్ల-కామారెడ్డి బాహ్యవలయ రహదారి నిర్మించారు. పట్టణంలోపలివైపు ఉన్న ఈదుల చెరువు సామర్థ్యం 26.67 ఎంసీఎఫ్‌టీలు. ఎగువన కోనరావుపేట మండలం నుంచి గొలుసుకట్టు చెరువుల ద్వారా ఇందులోకి వరద నీరు వస్తుంది. ఇది నిండాక కొత్త చెరువులోకి చేరుతాయి. ప్రస్తుతం ఈ చెరువు సగం మేరకు కబ్జా అయింది. నిర్మాణాల వ్యర్థాలతో పూడ్చుతూ తాత్కా లిక కట్టడాలు చేపడుతున్నారు. గతేడాది వరదల సమయంలో నీటిపా రుదల, జలవనరులశాఖ సర్వే చేపట్టింది. ఈ చెరువు ఫుల్ ట్యాంకు లెవల్ (ఎఫ్‌టీఎల్)లో 48ఇంటి నిర్మాణాలు ఉన్నట్లు గుర్తించారు.

రాయిని చెరువులో నిర్మాణాలు

పట్టణంలో చాలా ఏళ్ల క్రితం రాయినిచెరువులో నిరుపేదలు ఇళ్ల నిర్మాణాలు చేసుకున్నారు. కార్మిక వాడలుగా విస్తరించిన ఈ ప్రాంతవా సులకు పట్టాల పంపిణీకి చాలా ఏళ్లుగా అనేక రాజకీయ పార్టీలు ఉ ద్యమాలు చేశాయి. గత ఎన్నికల సమయంలో ప్రభుత్వమే ఇళ్ల పట్టాలు అందజేసింది. ఇదే అదనుగా ముష్టిపల్లి, చిన్నబోనాల, కార్గిల్‌లేక్, చంద్రంపేట ప్రాంతాల్లో రియల్ వ్యాపారులు ప్లాట్ల కోసం నాలాలను ఆక్రమించి విక్రయాలు చేపడుతున్నారు. చెరువుల ఎఫ్‌టీఎల్, నాలాల పరిధిలో స్థలాలు కొనుగోలు చేసిన వారు ఇంటి నిర్మాణాల కోసం దరఖాస్తు చేసిన సమయంలో అసలు విషయం బయటపడుతోంది. పలుకుబడి ఉన్నవారు ఎలాగోలా నిర్మాణాలు చేసుకుంటున్నారు. ఇలాంటి వాటికి అనుమతులు మంజూరు కాక ఇప్పటికీ సిరిసిల్ల పురపాలికలో 75 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో చెరువు శిఖం, వరద నీటి కాల్వలను ఆక్రమించినవి ఉండటం గమనార్హం. గతంలో ఇలా ఇష్టారీతిన అనుమతులు ఇవ్వడంతోనే రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షాలకు పట్టణంలోని కాలనీలు నీటమునిగాయి. వరద సాఫీగా వెళ్లేందుకు నాలాల విస్తరణ పనులు ప్రారంభించారు. నిధుల లేమితో కొత్త చెరువు వరకే పనులు పూర్తి చేశారు. దిగువన శాంతినగర్ ప్రాంతంలో పనులు జరగలేదు. నీటివనరుల ఆక్రమణలపై యంత్రా ంగం దృష్టిసారించాల్సిన అవసరం ఉంది.

కాల్వలు లేని కార్గిల్‌లేక్

పట్టణంలోని కార్గిల్‌లేక్ ఎగువన వరద నీరు వచ్చేందుకు కాల్వలు ఉ న్నాయి. 12.36 ఎంసీఎఫ్‌టీలున్న ఈ చెరువు అలుగు పారితే ఆ నీరంతా దిగువన మానేరువాగులో కలవాలి. వరద వెళ్లే కాల్వను పూడ్చేసి రియల్ వ్యాపారులు ప్లాట్లు పెట్టి విక్రయించారు. గతేడాది వరద నీరు వెళ్లలేని పరిస్థితిలో పురపాలిక, జలవనరులశాఖ అధికారులు మట్టి కాల్వను తవ్వించారు. సమీపంలోని అయ్యప్ప ఆలయం తర్వాత ఈ కాల్వ లేదు. చెరువులోకి వరద పోటెత్తితే ఎగువన ఉన్న తారకరామనగర్, ఇందిరానగర్ కాలనీలు ముంపునకు గురవుతా యి. వరద వెళ్లే కాల్వల కోసం సర్వే పూర్తి కాకుండానే మధ్యలో వదిలేశారు.

అనుమతులు ఇవ్వడం లేదు- అన్సారీ, టీపీవో

పురపాలక సంఘంలో విలీనానికి ముందు నుంచే ఈదుల చెరువు ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు జరుగుతున్నాయి. గతేడాది సర్వే చేసి ఆక్రమణలను గుర్తించాం. కొన్నింటికి దరఖాస్తులు పెట్టుకున్నా వాటికి అనుమతులు ఇవ్వడం లేదు.

# వస్త్రం.. నాణ్యత మారితేనే ప్రయోజనం

సిరిసిల్ల : ప్రభుత్వ వస్త్రోత్పత్తుల ఆర్డర్లు ఈ నెల ముగుస్తాయి. మళ్లీ ఏకరూప దుస్తుల ఆర్డర్లు వరకు వేచిచూడాలి. ఈ లోపు జిల్లా పరిశ్రమలోని మరమగ్గాల ఆధునికీకరణకు అవకాశం ఉంది. చేనేత దినోత్సవంలో మరమగ్గాల ఆధునికీకరణ, కొత్త పరిశ్రమలపై ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ప్రభుత్వం ప్రకటించింది. కానీ దాని అమలుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను విడుదల చేయలేదు. రాష్ట్రంలో మరమగ్గాల వస్త్రోత్పత్తుల్లో సిరిసిల్లలోనే యాభై శాతంపైనే ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యతో జిల్లాలోనే ఎక్కువ ప్రయోజనం కలగనుంది.

జిల్లాలో 30 వేలకు పైగా మరమగ్గాలున్నాయి. ఇవన్నీ పాతవే. వస్త్రోత్పత్తి రంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటున్న తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్రలోని వస్త్రోత్పత్తి పరిశ్రమలోని మరమగ్గాలను ఆధునికీకరించుకుంటూ మారుతున్న కాలానికి అనుగుణంగా వస్త్రాలు తయారు చేస్తూ పోటీ రంగంలో ముందంజలో నిలుస్తున్నారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు వారికి వెన్నుదన్నుగా నిలుస్తుండటం, యజమానులు, కార్మికుల్లో చొరవ కారణంగా మార్కెటింగ్‌లో వస్త్రోత్పత్తి రంగాన్ని ఆయా రాష్ట్రాలు శాసిస్తున్నాయి.



మన దగ్గర ఇవన్నీ లోపించాయి. పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోకుండా ప్రభుత్వం కోట్లాది రూపాయల విలువైన సంక్షేమ పథకాల వస్త్రోత్పత్తుల ఆర్డర్లతో తాత్కాలిక ఉపశమనం కలిగిస్తుంది. శాశ్వత మార్పులకు ప్రయత్నాలు జరగాలి.

నవీకరణతో...

ప్రభుత్వ ప్రకటనతో జిల్లా పరిశ్రమలోని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పలువురు ముందుకొచ్చారు. వాటిలో సిరిసిల్ల పట్టణంలో నలుగురు రాపియర్ మగ్గాల ఏర్పాటుకు, ఒకరు ఎయిర్‌జెట్ మగ్గాలు, ప్రింటింగ్, డైయింగ్, ప్రాసెసింగ్‌తోపాటు గార్మెంట్ యూనిట్లకు జిల్లా చేనేత, జౌళిశాఖకు తమ డీపీఆర్‌ను సమర్పించారు. దీనికి ప్రభుత్వం అందించే ప్రోత్సాహం ఎంత? బ్యాంకులు, సొంత పూచీకత్తు తదితర అంశాలేవీ లేవు. మరమగ్గాల ఆధునికీకరణ, కొత్త యూనిట్ల స్థాపనకు చేనేత, జౌళిశాఖ నుంచి ప్రణాళికలు రాలేదు.

మన దగ్గర ఒక్కొక్కరికి కనీసం ఎనిమిది మర మగ్గాలుంటాయి. ఇళ్లలో, చిన్న షెడ్లలో ఎనిమిది నుంచి నలభై, వంద, రెండు వందల మగ్గాలు నడిపే వారూ ఉన్నారు. ఇవన్నీ పురాతనమైనవి. తంగళ్లపల్లి మండలం మండెపల్లి టెక్స్‌టైల్ పార్కులోనివి రాపియర్ మగ్గాలు. ప్రస్తుతం వీటన్నింటిపైనా పాలిస్టర్ వస్త్రాలు మాత్రమే ఉత్పత్తి జరుగుతోంది. అండర్‌పిక్‌లో డాబీ, జకార్డు ఉన్న మగ్గాలు, ఎయిర్, వాటర్ జెట్ మగ్గాలు కావాలి. ఇలాంటి మరమగ్గాలు విస్తరిస్తే ఇతర రాష్ట్రాల్లో ఉత్పత్తి అవుతున్న దుస్తులకు దీటుగా నాణ్యత వచ్చే అవకాశం ఉంది. ప్రైవేటు ఆర్డర్లు పెరుగుతాయి. ఫలితంగా స్థానికంగా వస్త్రోత్పత్తుల మార్కెటింగ్ విస్తరిస్తుంది. దీంతో యజమానులు పెట్టుబడికి తగిన ప్రతిఫలం, కార్మికులకు చేతినిండా పని దొరికే అవకాశం ఉంటుంది.

ఆసక్తి చూపుతున్నారు

ప్రభుత్వ ప్రకటనతో కొందరు ముందుకొచ్చి తమ డీపీఆర్‌ను సమర్పించారు. వీరిని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం మరమగ్గాల ఆధునికీకరణ, కొత్త పరిశ్రమల స్థాపనకు ప్రణాళికలు రూపొందించాల్సి ఉంది. అప్పుడు ఔత్సాహికుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. త్వరలోనే ప్రకటన వచ్చే అవకాశం ఉంది.సాగర్, సహాయ సంచాలకుడు, చేనేత, జౌళిశాఖ సిరిసిల్ల

# మహిళా సాధికారత దిశగా అడుగులు

మిర్యాలగూడ : చట్ట సభల్లో మహిళలకు ప్రాతినిధ్యం పెంచేలా ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న మహిళా రిజర్వేషన్ బిల్లును ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టింది. దీనిపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ చట్టానికి ఆమోదం లభిస్తే.. శాసనసభ, లోక్‌సభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు కానున్నాయి. దీంతో సామాజిక, రాజకీయ తదితర రంగాల్లో అనాదిగా వెనుకబడి ఉన్న అతివలు.. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించే అవకాశాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్ల కారణంగా పలువురు ప్రజాప్రతినిధులుగా ఎన్నికైనప్పటికీ.. వారి స్థానాల్లో భర్తలు, ఇతర పురుష కుటుంబ సభ్యులు అధికారం చెలాయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి అయితే..చట్టసభల్లో అతివలు అడుగుపెట్టడం వల్ల మహిళా సాధికారత పెరుగుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సమగ్రంగా రూపొందిస్తేనే అమలు

మహిళా బిల్లును గతంలో పలు ప్రభుత్వాలు ప్రవేశ పెట్టినప్పటికీ..వాటికి పార్లమెంటులో ఆమోదం లభించలేదు. దీనికి ప్రధాన కారణం.. చట్టంలో ఉన్న లోపాలేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. బిల్లును సమగ్రంగా రూపొందిస్తేనే రిజర్వేషన్ల అమలుకు ఆటంకాలు కలగవని..ఇందుకు అఖిల పక్ష నాయకులు, మేధావుల సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకోవాలని పలువురు రాజకీయ నాయకులు సూచిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో వారే అధికం

ఉమ్మడి జిల్లాలో మొత్తం 12 నియోజకవర్గాలకు ఆరింట స్త్రీ ఓటర్లే అధికంగా ఉన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమల్లోకి వస్తే మహిళలు అధికంగా ఉన్న నియోజకవర్గాలను వారికే కేటాయించే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల విడుదల చేసిన ఓటరు ముసాయిదా జాబితా ప్రకారం ఉమ్మడి జిల్లాలో మొత్తం ఓటర్లు 27,46,402 మంది ఉండగా.. మహిళలు 13,78,452 మంది, పురుషులు 13,67,795 మంది, ఇతరులు 155 మంది ఉన్నారు. హుజూర్‌నగర్‌లో అత్యధికంగా 1,20,720 మంది మహిళా ఓటర్లు ఉండగా..తర్వాత స్థానాల్లో నల్గొండలో 1,17,097, కోదాడలో 1,17,062, సూర్యాపేటలో 1,14,910, నాగార్జునసాగర్‌లో 1,12,839, మిర్యాలగూడలో 1,10,629 మంది ఉన్నారు. ప్రస్తుత సమావేశాల్లో బిల్లు ఆమోదం పొందినా నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే రిజర్వేషన్లు అమలు కానున్నట్లు సమాచారం. దీంతో రానున్న ఎన్నికల్లో కాకుండా.. తదుపరి వచ్చే ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు కానున్నట్లు విశ్లేషణలు చెబుతున్నాయి.

మహిళా బిల్లును స్వాగతిస్తున్నాంకేసా అభ్యుదయ, మహిళా కన్వీనర్, సత్యసాయి సేవాసంస్థ, మిర్యాలగూడ

చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును కేంద్రం పార్లమెంటులో ప్రవేశపెట్టడం శుభపరిణామం. మహిళా సాధికారతకు ఈ బిల్లు ఉపయోగపడుతుంది. ఈ బిల్లుకు ఆమోద ముద్ర పడితే చట్ట సభల్లో మహిళల సంఖ్య పెరిగి..వారి సమస్యల పరిష్కారానికి అడుగులు పడతాయి. దీంతో మహిళలపై జరుగుతున్న దాడులకు సైతం అడ్డుకట్ట పడే అవకాశం ఏర్పడుతుంది. ప్రస్తుతం సమాజంలో మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. వాటి పరిష్కారానికి మహిళలే కృషి చేసే అవకాశం ఏర్పడుతుంది.

# ఆశ.. నిరాశ



సిరిసిల్ల : ఎన్నికల కోడ్ రావడంతో సర్పంచులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. 15వ ఆర్థిక సంఘం నిధులు రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొంత కాలంగా నిధులు నిలిచిపోగా, కేంద్రం నుంచి గత ఆరు నెలలుగా రావడం లేదు. దీంతో ఏమి చేయాలో తోచక దిక్కులు చూస్తున్నారు. చివరి క్షణంలో అయినా విడుదల అవుతాయన్న ఆశతో ఉండేవారు. ఎన్నికల కోడ్ కూయడంతో ఆశలు వదులుకోవాల్సి వచ్చింది.పాలన సౌలభ్యం కోసం ప్రభుత్వం కొత్త పంచాయతీలను ఏర్పాటు చేసింది. 500 లోపు జనాభా ఉన్న తండాలు, అనుబంధ పల్లెలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. అయితే కొత్త పంచాయతీల్లో ఆదాయ వనరులు లేకపోవడంతో సమస్యగా మారింది. గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రతి నెలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేస్తున్న 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి జిల్లాకు రూ. 4.25 కోట్ల వరకు వచ్చేవి. వీటితో జనాభా ప్రాతిపదికన పెద్ద పంచాయతీలకు ఎక్కువగా, చిన్నవాటికి నెలకు రూ.40 వేల నుంచి రూ. 50 వేల వరకు వచ్చేవి. ఇవి గ్రామ పంచాయతీలకు పెద్ద దిక్కుగా మారేవి. కొద్ది కాలంగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సంఘం నిధులు నిలిచిపోగా, కేంద్రం ఎప్పుడో ఒకసారి విడుదల చేస్తుంది. దీంతో పరిపాలన సౌలభ్యం, పారిశుధ్య నిర్వహణ, ప్రభుత్వం ఇచ్చిన పంచాయతీ ట్రాక్టర్లకు ప్రతి నెలా రుణ వాయిదాల చెల్లింపు, వాటి నిర్వహణ పంచాయతీలకు భారంగా మారింది. ఆరు నెలల నుంచి కేంద్రం నుంచి రాకపోగా, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులు మొత్తానికే మంజూరు చేయడం లేదు. దీంతో జిల్లాలోని 255 గ్రామ పంచాయతీలు నిధుల కొరతతో కొట్టుమిట్టాడుతున్నాయి. పల్లెప్రగతి, రోజువారి పారిశుధ్య పనులు చేపట్టేందుకు ఖాతాల్లో నిధులు లేక సర్పంచులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పంచాయతీలకు ఆస్తి, నల్లా పన్నులు, ఇతర రూపాల్లో సొంతంగా సమకూరిన ఆదాయాన్ని వాడుకునేందుకు వీల్లేకుండా ప్రభుత్వం ఆంక్షలు పెట్టడంతో పంచాయతీలు దిక్కుతోచని స్థితిలో ఉన్నాయి.

తప్పని ఖర్చులు జిల్లాలో చిన్న గ్రామ పంచాయతీల పరిస్థితి చూసినట్లయితే సుమారు 600 జనాభా, 150 కుటుంబాలు ఉన్న గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులు జనాభా ప్రాతిపదికన నెలకు రూ.40 వేల నుంచి రూ. 50 వేల వరకు వస్తున్నాయి. కానీ ఖర్చులు రూ.50 వేల నుంచి రూ. 60 వేల వరకు అవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను చాలా కాలం నుంచి నిలిపివేసింది. ప్రస్తుతం కేంద్రం కూడా సరిగ్గా మంజూరు చేయడం లేదు. ఆరు నెలలుగా పైసా కూడా రావడం లేదని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో నిర్వహణకు సరిపడా వనరులు లేవు. అలాగని ప్రతి నెలా ఖర్చులు తప్పడం లేదు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల పరిస్థితి ఇలాగే ఉంది. ప్రతి నెలా కరెంటు బిల్లు, ట్రాక్టర్ కిస్తీ, గ్రామ పంచాయతీ సిబ్బంది వేతనాలు, ట్రాక్టర్ నిర్వహణ ఖర్చులు తప్పనిసరిగా చెల్లించాల్సి వస్తుందని సర్పంచులు చెబుతున్నారు. ఆరు నెలలుగా నిధులు లేక వాయిదాలు చెల్లించలేకపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీరా నిధులు మంజూరవుతాయన్న ఆశతో ఎదురుచూస్తున్న సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో సర్పంచులు తీవ్ర నిరాశ చెందుతున్నారు.

రూ.7.16 కోట్లు విడుదలయ్యాయి

కేంద్ర ఆర్థిక సంఘం నిధులు ఇటీవల జిల్లాకు రూ.7.16 కోట్లు మంజూరయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం నిధులు రావడం లేదు. మంజూరైన నిధులు టైడ్, అన్ టైడ్ రెండు రకాలుగా ఉంటాయి. టైడ్ నిధులు తాగు నీరు, పారిశుధ్యానికే ఖర్చు చేయాల్సి ఉంటుంది. అన్ టైడ్ నిధులు దేనికైనా వాడుకోవచ్చు. ప్రతి మూడు నెలలకు ఒకసారి విడుదల అవుతున్నాయి.ఎ.రవీందర్, జిల్లా పంచాయతీ అధికారి

# గంజాయి మత్తు..యువత చిత్తు



మల్లాపూర్ : చదువుకునే విద్యార్థులు.. ఉన్నత విద్య, ఉద్యోగాలు సాధించాల్సిన యువత గంజాయి, డ్రగ్స్‌కు అలవాటు పడి బంగారు భవితను చేజేతులా నాశనం చేసుకుంటున్నారు. కుటుంబానికి, గ్రామానికి మంచి పేరు తెస్తాడని తల్లిదండ్రులు కన్న కలలను వమ్ము చేస్తున్నారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి చోరీలకు పాల్పడుతున్నారు. అడిగిన సమయంలో డబ్బులు ఇవ్వకపోతే కుటుంబ సభ్యులపై దాడులకు సైతం వెనకాడటం లేదు. నాడు పట్టణాలకే పరిమితమైన దందా నేడు గ్రామాలకు పాకింది.

యుక్త వయస్సులోనే అనారోగ్యంపాలు..

యువత మాదకద్రవ్యాలకు బానిసలుగా మారడంతో ఉత్సాహంతో ఉరకలెత్తాల్సిన యువత జవసత్వాలు సన్నగిల్లుతున్నాయి. మత్తు, మద్యం, ధూమపానంతో యుక్త వయస్సులోనే అనారోగ్యంపాలవుతున్నారు. బాధితుల్లో దాదాపు 80 శాతం మంది గంజాయి, డ్రగ్స్, మద్యం వంటివి ఎక్కువగా తీసుకుంటున్నట్లు సమాచారం. యువత మొదట సిగరేట్లకు అలవాటుపడి ఆ తర్వాత క్రమంగా గంజాయికి బానిసలవుతున్నారు. గంజాయితోపాటు డ్రగ్స్ వ్యాపారం చేసే వారంతా 30ఏళ్లలోపు యువకులే కావడం గమనార్హం. డ్రగ్స్ ప్రాంతాన్ని బట్టి రూ.200 నుంచి రూ.300 వరకు, గంజాయి రూ.150 నుంచి రూ.250 వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం. మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, ఆంధ్రప్రదేశ్‌తోపాటు పలు ప్రాంతాల నుంచి పొడిగా మార్చి విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. కళాశాల, పాఠశాలలను లక్ష్యంగా చేసుకుని వీటిని విక్రయిస్తుండగా యువత తమ బంగారు జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

నిర్మానుష్య ప్రదేశాల్లో అమ్మకాలు

కొంతకాలంగా గంజాయి, డ్రగ్స్ అమ్మకాలపై నిఘా పెట్టినప్పటికీ స్మగ్లర్లు పోలీసుల కళ్లు గప్పి తమ వ్యక్తిగత వాహనాలపై రవాణా చేస్తూ తప్పించుకుంటున్నారు. డబ్బు సంపాదనే ధ్యేయంగా యువకులు ఈ దందాపై దృష్టిసారిస్తున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉన్న కొండలు, అటవీ ప్రాంతాల్లోని నిర్మానుష్య ప్రదేశాలు, రహస్య ప్రాంతాలను ఎంచుకుని సాయంత్రం నుంచి రాత్రి వరకు అమ్మకాలు సాగిస్తున్నారు. మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాలతోపాటు పలు పట్టణ ప్రాంతాల్లోనూ దందా జోరుగా కొనసాగుతున్నట్లు సమాచారం.

ప్రత్యేక బృందాల ఏర్పాటు

సరిహద్దు ప్రాంతాలతోపాటు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గంజాయి, డ్రగ్స్ నివారణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నాం. కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో ఇటీవల దాడులు చేసి దాదాపు 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నాం. గంజాయి, డ్రగ్స్ వంటి అమ్మకాలు దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు.డీఎస్పీ రవీందర్‌రెడ్డి

# ఈ-సంజీవనిలో ఆరోగ్య వివరాల నమోదు

కరీంనగర్ : ఆయుష్మాన్ భవలో భాగంగా ఈ-సంజీవని పోర్టల్‌లో ఆరోగ్య వివరాలు నమోదు చేస్తున్నారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. అనంతరం వైద్య ఆరోగ్య శాఖ వారు కార్డు ఇస్తారు. దీనిని ఏ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లినా.. అక్కడి వైద్యులకు ఆ వ్యక్తి ఆరోగ్య పరిస్థితిపై అవగాహన వస్తుంది. గత నెల 17వ తేదీ నుంచి ఈ నెల 2 వరకు ఆయుష్మాన్ భవ పేరిట ఉచిత వైద్య శిబిరాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారి వివరాలు నమోదు చేసి 6756 మందికి కార్డులు జారీ చేశారు.ఆధార్‌కార్డు, చరవాణి అవసరం..

ఆయుష్మాన్ భవ డిజిటల్ కార్డును ఈ సంజీవని పోర్టల్ ద్వారా జనరేట్ చేస్తారు. ఇందులో వ్యక్తి పూర్తి ఆరోగ్య వివరాలు నమోదు చేస్తారు. ఇది పొందడానికి ఆధార్ కార్డు అవసరమవుతుంది. ఆన్‌లైన్‌లో ఆధార్ నంబర్ పేరు ద్వారా నమోదు చేయగానే చరవాణికి ఓటీపీ వస్తుంది. ఆ నంబర్ చెప్పగానే ఆ వివరాలతో పేరు, వివరాలు నమోదవుతాయి. కార్డు అందుబాటులోకి వస్తుంది. అన్ని వర్గాల ప్రజలు పొందవచ్చు. వైద్యానికి సంబంధించి ఈ కార్డును అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉపయోగించవచ్చు. ప్రతి ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ, పల్లె దవాఖానాలు, ఆరోగ్య కేంద్రాల్లో వైద్యం పొందే వారి వివరాలు ఈ సంజీవని పోర్టల్‌లో ఉంటాయి. సదరు కార్డు కలిగిన రోగి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్తే తగిన వైద్యం అందిస్తారు. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఆ వ్యాధికి సంబంధించి వైద్యం అందుబాటులో




లేకపోతే జిల్లా దవాఖానాకు రోగి వివరాలు ఆన్‌లైన్‌లో పంపిస్తారు. వీడియోకాల్‌లో మాట్లాడించి తగిన వైద్యం అందేలా చూస్తారు. ఈ అవకాశం ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంటుంది.

సమీప ఆరోగ్య కేంద్రాల్లో సంప్రదించండి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యం పొందే వారికి ఆయుష్మాన్ భవ కార్డు ఉపయోగపడుతుంది. పూర్తి వివరాలకు సమీప ఆరోగ్య కేంద్రాల వైద్యులను సంప్రదించవచ్చు. పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేసే స్టాఫ్ నర్సులు ప్రతి రోజు పది మంది పేర్లను నమోదు చేయాలని లక్ష్యంగా నిర్ణయించాం. ఇది నిరంతర ప్రక్రియ.డాక్టర్ లలితాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

# స్థిరాస్తి వ్యాపారంలో స్తబ్ధత

నల్గొండ: ఉమ్మడి జిల్లాలోని స్థిరాస్తి వ్యాపారంలో కొన్ని రోజులుగా స్తబ్ధత నెలకొంది. ఆస్తుల క్రయ, విక్రయాలు గతేడాదితో పోలిస్తే నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో గణనీయంగా తగ్గాయని రిజిస్ట్రేషన్ శాఖ వర్గాలు వెల్లడించాయి. రానున్న రెండు మూడు నెలల్లో ఎన్నికలు ఉండనున్నాయనే ప్రచారం, అన్ని అనుమతులు తీసుకున్నాకే వెంచర్ల నిర్మాణానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపడం లాంటి కారణాలతో ప్రస్తుతం మార్కెట్లో డబ్బు వినిమయం గణనీయంగా తగ్గిందన్న వాదనలు ఉన్నాయి. ఉదాహరణకు గతంలో ఒక వెంచర్ నిర్మాణానికి గ్రామ పంచాయతీ తీర్మానం సరిపోయేది. దీంతో ప్లాట్లు చేసి విక్రయించేవారు. ప్రస్తుతం ఒక వెంచర్ నిర్మాణం చేయాలంటే ప్రభుత్వ నిబంధనలను పాటించడంతో పాటు డీటీసీపీ అనుమతులు తప్పనిసరి. దీంతో పెట్టుబడి ఎక్కువ కావడంతో వ్యాపారులు ప్లాట్ల ధర పెంచుతున్నారు. ధరలు ఎక్కువగా ఉండటంతో కొనుగోలుదారులు కొనడానికి ఆసక్తి చూపించడం లేదు. ఎన్నికల అనంతరం ఈ ధరలు మరింతగా పెరుగుతాయని చెబుతున్నా పెద్దగా వ్యాపారం జరగకపోవడం గమనార్హం. స్థిరాస్తి వ్యాపారం అంతగా లేదని చెబుతున్నా... ఎవరైనా కొనడానికి సుముఖత చూపితే ధరలు చుక్కలను చూపెడుతున్నాయి. ఒక పక్క మందగమనం అంటూనే ప్లాట్ల ధరల్లో మాత్రం ఏ మాత్రం తగ్గుదల లేదని కొనుగోలుదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పరిస్థితులున్నాయి.

ఎన్నికల హడావుడి

రాష్ట్రంలో ఎన్నికల హడావుడి ఉండటమూ స్థిరాస్తి మందగమనానికి ఓ కారణమని నిపుణులు వెల్లడిస్తున్నారు. ఎన్నికల దృష్ట్యా వ్యాపారులు మార్కెట్లో డబ్బు వినియోగాన్ని గణనీయంగా తగ్గించారు. చాలా చోట్ల స్థిరాస్తి వ్యాపారులంతా ఏదో ఒక పార్టీకి అనుబంధంగానే ఉంటారు. ఎన్నికల నేపథ్యంలో వారంతా డబ్బును నిల్వ చేసుకునే పరిస్థితి. దీంతో వారు ఎక్కడా క్రయ విక్రయాలు చేయడంలేదు. సాధారణ వ్యాపారుల కంటే పెద్ద వ్యాపారులు చేసే క్రయవిక్రయాలే స్థిరాస్తి వ్యాపారంలో ఎక్కువగా ఉంటాయి. కొన్ని రోజులుగా వీరు క్రయవిక్రయాలు చేయకపోవడంతో మార్కెట్లో డబ్బు వినియోగం గణనీయంగా తగ్గింది. మరోవైపు ఎన్నికల తర్వాతనే ఈ రంగంలో బూమ్ నెలకొంటుందన్న వాదనలున్నాయి. “ఎన్నికలతో పాటు డీటీసీపీ లేఅవుట్ అనుమతులు పకడ్బందీగా ఉండటంతో గతంతో పోలిస్తే ప్లాట్ల ధరలు పెరిగాయి. దీంతో మధ్యతరగతి ప్రజలు ప్లాట్ల కొనుగోళ్లకు ఆసక్తి చూపడం లేదు. మా వద్ద గతంలో నిత్యం 100 దస్తావేజుల వరకు రిజిస్ట్రేషన్ అయ్యేవి. ఇప్పుడు రోజూ 50కి మించి రావడం లేదు. మరో నాలుగైదు నెలలూ ఇదే పరిస్థితి ఉండే అవకాశముంద”ని నల్గొండ సబ్ రిజిస్ట్రార్ కోమటిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి ‘ఈనాడు’తో అభిప్రాయపడ్డారు.

సగానికి పడిపోయిన రిజిస్ట్రేషన్లు

ఉమ్మడి జిల్లాలో మొత్తం 15 రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిల్లో గతంలో రోజూ సగటున 1000 నుంచి 1200 వరకు క్రయవిక్రయాలు రిజిస్ట్రేషన్ అయ్యేవి. ప్రస్తుతం అవి 500 నుంచి 700 వరకు పడిపోయినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అయితే రిజిస్ట్రేషన్ ఛార్జీలను ప్రభుత్వం గతేడాది పెంచడంతో సర్కారుకు వచ్చే ఆదాయంలో పెద్దగా తేడా ఉండటం లేదని... డాక్యుమెంట్లు మాత్రం సగానికి సగం తగ్గాయని తెలిసింది. గత ఆర్థిక సంవత్సరం తొలి ఐదు నెలల్లో ప్రభుత్వానికి సుమారు రూ.200 కోట్ల ఆదాయం రిజిస్ట్రేషన్ల ద్వారా రాగా... ఈ ఏడాది అది రూ.162 కోట్లకు పడిపోయిందని తెలిసింది. పెంచిన ధరల ప్రకారమే ప్రభుత్వానికి గతేడాదితో పోలిస్తే సుమారు రూ.38 కోట్ల నష్టం వచ్చింది. గత ధరలతోనే అయితే ఇది సుమారు రూ.80 కోట్ల వరకు ఉండేదని సమాచారం. స్థిరాస్తి వ్యాపారం ఎక్కువగా జరిగే రాజధాని సమీప ప్రాంతాలైన చౌటుప్పల్, బీబీనగర్, భువనగిరి, యాదగిరిగుట్ట కార్యాలయాల్లో గతంలో పోలిస్తే రిజిస్ట్రేషన్లు 30 శాతానికి పైగా పడిపోయాయి.

# అటెండర్లకు అదనపు బాధ్యతలు

కరీంనగర్ : పేరేమో నగరపాలక సంస్థ.. మున్సిపాలిటీ కంటే అధ్వానంగా ఉద్యోగుల భర్తీ.. ఉన్న సిబ్బందికి మాత్రం పదోన్నతులు లేక.. బలవంతంగా బాధ్యతలు అప్పగిస్తుండటం.. చేసేదేమీ లేక అదే జీతానికి పనులు చేస్తుండగా..ఉన్నతాధికారులు హెచ్చరిస్తుండటం.. ఇన్‌ఛార్జి బాధ్యతలతో సతమతం కావడం ఏమిటని ఆందోళన చెందుతు న్నారు. కరీంనగర్ నగర పాలక సంస్థ కార్యాలయంలో రెవెన్యూ, పారిశుద్ధ్యం, పరిపాలన, పట్టణ ప్రణాళిక, మెప్మా, పింఛన్లు, ఇంజినీరిం గ్ విభాగాలు పని చేస్తున్నాయి. ఇందులో కంప్యూటర్ ఆపరేటర్లు మొదలుకొని అటెండర్లు, బిల్ కలెక్టర్లు, జూనియర్, సీనియర్, రికార్డు అసిస్టెంట్లు, సూపరింటెండెంట్లు, ఆయా విభాగాల అధిపతులు, క్షేత్రస్థాయిలో పని చేసే ఉద్యోగులు, అధికారులు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఉన్నతాధికారులు ఉద్యోగులను సర్దుబాటు చేయడం సాధారణం.. కాగా నగరపాలక కార్యాలయంలో మాత్రం పదోన్నతుల విషయమే మర్చిపోయారు. ఏళ్ల తరబడి అదే జీతానికి అదనపు బాధ్యతలు అప్పగించడం, గత్యంతరం లేక విధులు నిర్వర్తిస్తుండగా ఇటీవల ఉన్నతాధికారుల బెదిరింపులు ఎక్కువ కావడంతో వద్దు బాబోయ్ ఈ అదనపు భారం అనే పరిస్థితికి ఉద్యోగులు వచ్చారంటే పరిస్థితి ఎంత ఇబ్బందికరంగా మారిందో అర్థం చేసుకోవచ్చు.

సెలవు రోజుల్లో సర్వేలు మిగతా శాఖల ఉద్యోగులు సెలవుల్లో ఉంటుండగా నగరపాలక సంస్థ ఉద్యోగులు మాత్రం పని చేయడమేమి టని ఆగ్రహిస్తున్నారు. పండుగలు, రెండో శనివారం, ఆదివారాలు వస్తే చాలు సర్వేలు, పన్నుల వసూలు అంటూ విధులు వేస్తున్నారని మండి పడుతున్నారు. ఆగస్టు 15న కూడా గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన విధులు అప్పగించినట్లు ఉద్యోగులు అంటున్నారు. దళితబంధు, గృహలక్ష్మి, బీసీ రుణాలు, పింఛన్ల విచారణ, బీఎల్వోల విధులు అప్పగిస్తున్నారు. అటెండర్ జీతమే వస్తుండగా కనీసం అదనపు ప్రయోజనాలు ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేస్తే ఎలా అంటున్నారు. డిగ్రీలు, పీజీలు చదువుకున్న వారున్నారని వీరికి పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు న్యాయం చేయాలని ఉద్యోగ సంఘం ప్రతినిధులు కోరుతున్నారు.

రెవెన్యూ విభాగంలోనూ వారే..

రెవెన్యూ విభాగం పూర్తిగా పన్నుల వసూలుపై ఆధారపడి ఉంటుంది. ఆర్వో, ఆర్ఐలు, బిల్ కలెక్టర్లు పూర్తిగా ఇన్‌ఛార్జులుగా ఉన్నారు. 60 డివిజన్లలో విలీన కాలనీలు కలుపుకొని మొత్తం 30 మంది బిల్ కలెక్టర్లు పని చేస్తున్నారు. వీరిలో నలుగురు మాత్రమే బిల్‌కలెక్టర్ హోదాలో ఉన్నారు. ఇందులో ఒకరిని ఆర్ఐగా నియమించారు. అంటే ముగ్గురు మాత్రమే, మిగతా 15మంది కార్యాలయంలో అటెండర్లుగా పని చేసే వారే. వీరికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించి బిల్ కలెక్టర్ విధులు అప్పగించారు. ఆరుగురు ఆర్ఐలు అవసరం కాగా ముగ్గురే పని చేస్తున్నారు. మిగతా విభాగాల్లో సైతం పదోన్నతులపై ఉద్యోగులను నియమించాల్సి ఉండగా ప్రజారోగ్యశాఖ కార్మికులుగా ఉన్న వారిలో కొందరిని రికార్డు అసిస్టెంట్లుగా పని చేయించుకుంటున్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు పూర్తిగా ఒప్పంద ప్రాతిపదికనే ఉన్నారు. మెప్మా విభాగం అంతే.

సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు ఎక్కడ?

కార్యాలయంలో ఇటీవల ప్రభుత్వం సీనియర్, జూనియర్ అసిస్టెంట్లను నియమించింది. వీరంతా ఈ పనులు చేయాల్సి ఉండగా.. వారికి అప్పగించడం లేదనే విమర్శలున్నాయి. ఏడాది కిందట వీఆర్వోలు 12 మంది రాగా అందులో ఇద్దరు వార్డు అధికారులుగా కేటాయించారు. ఇటీవల 17 మంది వీఆర్ఏలు అప్పగించగా వీరిని వార్డు అధికారులుగా నియమించారు. వీరికి ఇప్పటికీ బాధ్యతలు అప్పగించలేదు. కొందరైతే చెట్ల కింద కాలయాపన చేస్తుండగా, మరికొందరు ఉదయం వచ్చి వెళ్లి పోతున్నట్లుగా చెబుతున్నారు.

# ఆరుగాల కష్టం.. వరదపాలు

ఖమ్మం : ప్రతిఏటా రెండు, మూడు సార్లు వస్తున్న గోదావరి వరదలు అన్నదాతలను అతలాకుతలం చేస్తున్నాయి. వరదలు తగ్గిన అనంతరం స్థానిక అధికారులతోపాటు కేంద్ర బృందాలు పరిశీలించి నివేదికలు అందిస్తున్నా రైతులకు పైసా పరిహారం అందిన దాఖలాలు లేవంటే అతిశయోక్తి కాదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గోదావరి పరివాహక ప్రాంతంలో వానాకాలం సీజన్‌లో వరద ఉప్పొంగి పంటలు నీట మునుగుతున్నాయి. ఫలితంగా మరోసారి సాగు ప్రారంభించడం మినహా గత్యంతరం లేదు. ఎకరాకు సుమారు రూ.15 వేల వరకు పెట్టుబడులు పెట్టిన రైతులు మళ్లీ దుక్కుల నుంచి ప్రారంభించాల్సి రావడంతో పెట్టుబడుల కోసం డబ్బులు వెతుక్కోవాల్సి వస్తోంది. ప్రధానంగా పినపాక నియోజకవర్గంలోని బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక మండలాలతో పాటు భద్రాచలం నియోజకవర్గంలోని భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో వరద ప్రభావం అధికంగా ఉంటోంది. ఈ సంవత్సరం జులైలో వచ్చిన వరదలతో వేల ఎకరాల్లో పంటలు ముంపునకు గురయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 3,151 ఎకరాల్లో పంటకు నష్టం వాటిల్లినట్లు అధికారులు నిర్ధారించారు. పత్తి పంట ముంపునకు గురవడంతో పాటు వరి నారుమళ్లు దెబ్బతిన్నాయి. వరదలు తగ్గిన అనంతరం సాగు ప్రారంభించిన రైతులకు వరినారు దొరకలేదు. బయటి ప్రాంతాల నుంచి అధిక



ధరలకు నారును కొనుక్కోవాల్సి వచ్చింది. గతేడాది గోదావరి వరదలతో పాటు భారీ వర్షాలు రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. జులైలో రికార్డు స్థాయిలో వచ్చిన వరదలతో ఇళ్లు, పంట పొలాలు నీటమునిగాయి. వేల ఎకరాల్లో పత్తి, వరి పంటలతోపాటు కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టం వివరాలను ఉన్నతాధికారులకు పంపించారు. కేంద్ర బృందం సైతం భద్రాద్రి జిల్లాలో పర్యటించి నష్టం వివరాలను పరిశీలించింది. కానీ రైతులకు ఎలాంటి పరిహారం అందలేదు. ఈ ఏడాది కూడా కేంద్ర ప్రభుత్వ అధికారులు ముంపు ప్రాంతాల్లో పర్యటించి నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. నేటికీ పరిహారానికి సంబంధించి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. ప్రభుత్వాలు స్పందించి పంట పరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ముంపు నివారణకు చర్యలు తీసుకోవాలి

గోదావరి పరివాహకంలోని పొలాలు ప్రతి ఏడాది ముంపునకు గురవుతున్నాయి. సాగు ప్రారంభించాలంటేనే భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గతేడాది వరదలతో రూ.1.5 లక్షలు నష్టపోయాను. ప్రభుత్వం స్పందించి నష్ట పరిహారం అందించడంతో పాటు ముంపు నివారణకు చర్యలు చేపట్టాలి.

పాశం ప్రశాంత్, రైతు, బూర్గంపాడు

గతేడాది గోదావరి వరదలతో 15 ఎకరాల పత్తి చేను నీట మునిగింది. సుమారు రూ.3 లక్షలు నష్టపోయాను. ప్రతి ఏడాది వరదలు వచ్చి పంటలు మునుగుతున్నాయి. రూ.లక్షల్లో నష్టపోతున్నా ప్రభుత్వం ఎలాంటి పరిహారం అందించడం లేదు. ప్రభుత్వ పెద్దలు స్పందించి మాలాంటి వారికి నష్టపరిహారం అందించాలి. యడమకంటి పిచ్చిరెడ్డి, రైతు, నాగినేనిప్రోలు రెడ్డిపాలెం

# ఆర్థిక.. డిజిటల్ పరిజ్ఞానమూ కీలకం

జగిత్యాల : నేటి కాలంలో అక్షరాలు నేర్చుకోవడమే కాదు.. ఆర్థిక.. డిజిటల్ అక్షరాస్యతా కీలకమయింది.. డిగ్రీలు మనకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మాత్రమే కల్పిస్తాయి.. సంపాదిస్తున్న క్రమంలో భవిష్యత్తు కోసం ఆర్థిక ప్రణాళికలు రూపొందించుకోవడానికి ఆర్థిక పరమైన అంశాల పట్ల అవగాహన తప్పనిసరిగా ఉండాలి.. దీంతోపాటు ప్రపంచం డిజిటల్‌గా మారుతున్న క్రమంలో ఈ అంశంపైనా అవగాహన అవసరం.

ఆర్థిక అవగాహన ఇలా..ఆర్థికంగా అభివృద్ధి చెందిన సమాజ నిర్మాణం పొదుపు, మదుపుపైనే ఆధారపడి ఉంది. బడ్జెట్ నిర్వహణ, పెట్టుబడులు, రుణ చెల్లింపులు వంటి నైపుణ్యాల ద్వారా యువత భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది. క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డుల వినియోగం, నెలసరి రుణ వాయిదాల సక్రమ చెల్లింపు (ఈఎంఐ), రుణ వ్యూహాలను బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవడం ద్వారా ఆర్థిక క్రమశిక్షణ పెరిగి డబ్బు ఆదా కావడంతోపాటు జీవిత లక్ష్యాలను సమర్థంగా సాధించడానికి, ఆర్థిక శ్రేయస్సుకు దారి తీస్తుంది. క్షేత్రస్థాయిలో ప్రజలకు ఆర్థిక అక్షరాస్యత కల్పించడానికి లీడ్ బ్యాంకులు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్గదర్శకాల మేరకు బ్యాంకు శాఖలు విద్యార్థు లకు, స్వశక్తి, మహిళా సంఘాల సభ్యులకు, రైతులకు, వృద్ధులకు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల యాజమాన్యాలకు అవగాహన కల్పిస్తున్నాయి.

సాంకేతికతతో జాగ్రత్త ప్రస్తుత డిజిటల్ ప్రపంచంలో చదువులు, ఉద్యోగ తీరులు మారిపోయాయి.. సామాన్య జనం జీవితంలోనూ సాంకేతికత ప్రధాన పాత్ర పోషిస్తోంది.. స్మార్ట్‌ఫోన్లతో అరచేతిలో ప్రపంచం ఉంది.. కంప్యూటర్ కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవడం.. కార్యాలయాలకు వెళ్లి బిల్లులు కట్టడం.. బ్యాంకులకు వెళ్లి లావాదేవీలు నిర్వహించే స్థాయి నుంచి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉంటే ఇంట్లో కూర్చునే ఈ పనులన్నీ చేసుకునే వెసులుబాటు వచ్చింది.. జేబులో డబ్బులు లేకపోయినా.. బ్యాంకు ఖాతాలో ఉంటే చాలు స్మార్ట్‌ఫోన్ తీసుకుని వెళ్లి స్కాన్ చేసి ఏదైనా కొనుగోలు చేసుకోవచ్చు. కరోనా విపత్కర పరిస్థితుల కంటే ముందు 12 శాతం ఉన్న డిజిటల్ లావాదేవీలు ప్రస్తుతం 43 శాతానికి పెరిగినట్లు సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఈ క్రమంలో సైబర్ నేరగాళ్ల వలకు చిక్కుకుని ఆర్థికంగా నష్టపోతున్నవారూ ఉన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో వీటి వినియోగం ఎంత ముఖ్యమో. సరైన అవగాహన కలిగి ఉండటం కూడా అంతే ప్రధానం. ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సినవి ఇవీ...

తెలియని వ్యక్తుల నుంచి చరవాణులకు వచ్చే లింకులు ఓపెన్ చేయవద్దు. ప్రభుత్వం ఆమోదించిన యాప్‌ల ద్వారా మాత్రమే లావాదేవీలు నిర్వహించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ మీ చరవాణికి వచ్చే ఓటీపీలు వేరేవారికి చెప్పొద్దు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే డబ్బులు వస్తాయని చెబితే నమ్మి మోసపోవద్దు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం చెల్లింపులకే కాని.. డబ్బులు రావడానికి కాదని గుర్తించాలి.

# ఎన్నికల ప్రక్రియ మొదలైంది.. పోరు మిగిలింది



ఖమ్మం: శాసనసభ ఎన్నికల ప్రక్రియ మొదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయటంతో ప్రవర్తన నియమావళి నుంచే అమల్లోకి వచ్చింది. రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాల హోర్డింగులు, ప్రకటనలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డుల తొలగింపు ప్రక్రియ ఆరంభమైంది. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా సాగేలా అధికార యంత్రాంగం ప్రణాళికలు రూపొందిస్తోంది. ఇదే సమయంలో ప్రలోభాల పర్వానికి అడ్డుకట్ట వేసేలా రెవెన్యూ, పోలీసు శాఖలు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి.

చెక్‌పోస్టుల ఏర్పాటు..కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయగానే అన్ని నియోజకవర్గాల్లో రెవెన్యూ, పోలీసు అధికారులు కోడ్ అమలుకు పూనుకున్నారు. గోడలపై ప్రచార ప్రకటనలు కనిపించకుండా రంగులు వేస్తున్నారు. సంక్షేమ పథకాల బ్యానర్లు, ఫ్లెక్సీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నేతల చిత్రపటాలు తొలగించారు. కోడ్ అమల్లోకి రావడంతో ప్రజాప్రతినిధులు అధికారిక నివాసాలు ఖాళీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ వాహనాలు, భవనాలు వినియోగించొద్దని అధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల ప్రక్రియకు ఆటంకాలు కలగకుండా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోంది. ఫ్లయింగ్ స్క్వాడ్స్, వీడియో చిత్రీకరణ బృందాలు రంగంలోకి దిగాయి. డబ్బు, మద్యం తరలింపును అడ్డుకునేలా చెక్‌పోస్టులు ఏర్పాటయ్యాయి.

అధికార యంత్రాంగం అప్రమత్తం

శాసనసభ ఎన్నికల సమరానికి కేంద్ర ఎన్నికల సంఘం పచ్చజెండా ఊపడంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. పది నియోజకవర్గాల్లో అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. ఖమ్మం జిల్లాలో 11,96,293 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 9,45,094 మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు.

ఈవీఎంల భద్రత, రిసెప్షన్ కేంద్రం ఏర్పాటుకు ఖమ్మం గ్రామీణం మండలం పొన్నెకల్‌లో శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాల, ఖమ్మం నగరంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలను కలెక్టర్ వీపీ గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్ పరిశీలించారు. భోజనం, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపై ఆరా తీశారు.

వినతులు స్వీకరించిన నామా

జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన నాయకులతో ఖమ్మంలో ఎంపీ నామా నాగేశ్వరరావు భేటీ అయ్యారు. వినతిపత్రాలను స్వీకరించి వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు. వైరా, కొణిజర్ల మండలాలకు చెందిన భారాస నాయకులు బానాల వెంకటేశ్వరరావు, చిరంజీవి కలిసి పలు సమస్యలను నామాకు వివరించారు. వైరా నియోజకవర్గ భారాస అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ వాడీవేడి

శాసనసభ ఎన్నికల సమరానికి రాజకీయ పార్టీలు సై అంటున్నాయి. విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లి విజయబావుటా ఎగురవేసేందుకు అస్త్రశస్త్రాలు సిద్ధం చేస్తున్నాయి. అవసరమైన ప్రచార సామగ్రి ఇప్పటికే ఆయా పార్టీల కార్యాలయాలకు చేరింది. ఎన్నికల క్షేత్రంలో భారత రాష్ట్ర సమితి ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించి ముందంజలో ఉంది. మరోవైపు గడపగడపకూ కాంగ్రెస్ పేరిట ప్రచార పర్వానికి శ్రీకారం చుట్టినా అభ్యర్థుల లెక్కలు తేలకపోవడంతో ఆపార్టీ శ్రేణులకు నిరీక్షణ తప్పటం లేదు. త్వరలోనే కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. భారతీయ జనతా పార్టీలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొలిక్కి రాకపోగా.. ఈసారి ఎన్నికల పోరుకు సైఅంటున్న కామ్రేడ్లు.. పొత్తులు పెట్టుకుంటారా, ఒంటరిగా బరిలో నిలుస్తారా అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

ప్రచారం పర్వంలో భారాస

ముఖ్యమంత్రి కేసీఆర్ ఆగస్టు 21న భారాస అభ్యర్థులను ప్రకటించారు. ప్రత్యర్థులెవరో తేలకముందే ఆపార్టీ అభ్యర్థులు ప్రచార పర్వానికి శ్రీకారం చుట్టారు. ఖమ్మంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆత్మీయ సమ్మేళనాల పేరిట ప్రజల్లోకి వెళ్తున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో అసమ్మతి బెడద వేధిస్తుండటంతో.. పూర్తిస్థాయి ప్రచారంలోకి దిగటానికి ముందే అసంతృప్తులను బుజ్జగించాలని అధిష్ఠానం ఆదేశించి ంది. నియోజకవర్గాల ఇన్‌ఛార్జిలు రంగంలోకి దిగి అసమ్మతులతో సమావేశమవుతున్నారు. భారాస అధినేత కేసీఆర్ బీ-ఫారాలు అందజేశాక ప్రచారాన్ని అభ్యర్థులు మరింత ముమ్మరం చేయనున్నారు.

తుది దశకు కాంగ్రెస్ కసరత్తు

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో గెలుపు గుర్రాల కోసం కాంగ్రెస్ పార్టీ కొన్నిరోజులుగా చేస్తున్న కసరత్తు దాదాపు కొలిక్కి వచ్చింది. త్వరలోనే అభ్యర్థులను ప్రకటించనుంది. మధిర, భద్రాచలం నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలే మరోసారి పోటీచేయనున్నారు. మిగిలిన నియోజకవర్గాలకు 120 మందికి పైగా ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. వడపోత తర్వాత నాలుగు నియోజకవర్గాల్లో ఒక్కొక్కరి పేరు, మిగిలిన నియోజకవర్గాల్లో ఇద్దరి పేర్లతో తుది జాబితాను కేంద్ర ఎన్నికల కమిటీకి అందజేసినట్లు తెలిసింది. కొన్నిచోట్ల పోటాపోటీ నెలకొనటంతో అభ్యర్థుల ఎంపిక కత్తిమీద సాములా మారుతుందన్న ప్రచారం సాగుతోంది. సర్వేలు, ప్రజాదరణ ఆధారంగానే అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు కాంగ్రెస్ ముఖ్యనాయకుడొకరు 'ఈనాడు'కు తెలిపారు.

బోణీ కొట్టాలని భాజపా..

ఖమ్మంలో కేంద్ర మంత్రి అమిత్‌షా బహిరంగ సభ కాషాయదళంలో ఉత్సాహం నింపింది. బలమైన అభ్యర్థుల కోసం భాజపా అన్వేషిస్తోంది. ఉభయ జిల్లాల్లో ఈసారి ఎలాగైనా బోణీ కొట్టాలని ఉవ్విళ్లూరుతోంది. ఎన్నికల బరిలో నిలిచేందుకు సైఅంటున్న బహుజన సమాజ్‌పార్టీ ఇప్పటికే ఎనిమిది నియోజకవర్గాల్లో అభ్యర్థులను ప్రకటించింది.

'పొత్తు' పొడుస్తుందా..సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు చెందినవారే కావడంతో ఈసారి ఇక్కడ సత్తా చాటాలని కమ్యూనిస్టులు ఉవ్విళ్లూరుతున్నారు. కాంగ్రెస్‌తో కలిసి ఎన్నికల బరిలో నిలుస్తాయా... లేక రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తాయా అన్నది తేలాల్సి ఉంది. పొత్తు కుదిరితే ఉభయ జిల్లాల్లోనే ఎక్కువ స్థానాలను వామపక్ష పార్టీలు కోరే అవకాశాలు ఉన్నాయి. పొత్తు కుదరని పక్షంలో తమకు బలమున్న స్థానాల్లో బరిలో నిలిచేలా ఉభయ కమ్యూనిస్టులు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

# మనసు బాగుంటేనే మహాభాగ్యం



ఖమ్మం : శారీరక దృఢత్వంతోపాటు మానసిక ఆరోగ్యమూ ముఖ్యమే.. ఆధునిక కాలంలో ఉరుకులు పరుగుల జీవితం.. పెరిగిన ఒత్తిళ్లతో మానసిక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. డిప్రెషన్, ఆందోళన, తెలియని భయం, గందరగోళానికి గురవడం, ఆత్మహత్య వైపు ఆలోచనలు మళ్లడం, ఏకాగ్రత లోపించడం, విపరీతమైన ఆలోచనలు వంటి సమస్యలు పెరుగుతున్నాయి. సరైన సమయంలో సమస్య గుర్తించి చికిత్స తీసుకుంటే సమస్యలను నయం చేసుకోవచ్చని వైద్య నిపుణులు చెబుతున్నారు. జిల్లాలో ప్రభుత్వపరంగా మానసిక సమస్యలను ఎదుర్కొంటున్న వారికి గుర్తించి చికిత్స అందిస్తున్నారు. నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం...

నేలకొండపల్లి మండలానికి చెందిన ఓ వివాహిత చాలాఏళ్లుగా సైకోసిస్ సమస్యను ఎదుర్కొంది. ఒంటరితనం, జన జీవనంలో కలవలేకపోవడం వంటి కారణాలతో ఇబ్బంది పడుతోంది. ఆశా కార్యకర్తల సాయంతో ప్రభుత్వాసుపత్రిలో మానసిక చికిత్స కేంద్రంలో వైద్య సేవలు తీసుకొని ప్రస్తుతం సాధారణ జీవితాన్ని గడుపుతోంది. విధి నిర్వహణలో అవమానాలపాలైన మధిరకు చెందిన ఓ ప్రభుత్వ యువ ఉద్యోగి స్కిజోఫ్రేనియా సమస్యను ఎదుర్కొన్నారు. టెలీ మెడిసిన్ సర్వీసెస్ ద్వారా వైద్యులను సంప్రదించి మందులు వాడుతున్నారు. ప్రస్తుతం మానసిక ఒత్తిడి నుంచి కోలుకుంటున్నారు.

ప్రపంచ జనాభాలో ప్రతి ఎనిమిది మందిలో ఒకరు మానసిక సమస్యలతో బాధపడుతున్నారు. 25 నుంచి 45 ఏళ్ల లోపు వారిలో సమస్యలు ఎక్కువ. ఈ ఏడాది ఐక్యరాజ్య సమితి 'మానసిక ఆరోగ్యం సార్వత్రిక మానవ హక్కు' అనే థీమ్‌ను ప్రకటించింది.

ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ 14416

మానసిక సమస్యలు ఎదుర్కొంటున్న వారిని గుర్తించి సరైన సమయంలో చికిత్స అందించడమే కీలకం. ఇందుకోసం వైద్య ఆరోగ్య శాఖ టోల్‌ఫ్రీ నంబరును ఏర్పాటు చేసింది. నేరుగా వైద్యులను కలిసేందుకు ఇష్టపడని వారు 14416 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి తమ సమస్య చెప్పి వైద్య సలహాలు, సూచనలు పొందవచ్చు.

వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణలో గ్రామీణ స్థాయిలో ఆశ, ఆరోగ్య కార్యకర్తలు సర్వే నిర్వహిస్తున్నారు. పీహెచ్‌సీ, వెల్‌నెస్ సెంటర్, పల్లె దవాఖానా, బస్తీ దవాఖానాలకు అనారోగ్య సమస్యలతో వచ్చే వారిలో బాధితులను గుర్తిస్తున్నారు.

ఖమ్మం సర్వజనాసుపత్రి కేంద్రంగా సంజీవని ప్రోగ్రాంలో భాగంగా టెలీ మెడిసిన్ వైద్య సేవలను ప్రవేశపెట్టారు. జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం ద్వారా సైకియాట్రిస్ట్‌ను నియమించి సోమ, గురువారాల్లో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. మందులు పంపిణీ చేస్తున్నారు.

మానసిక సమస్యలు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, ఒత్తిడి, ఆందోళనతో సతమతమవుతారు. వ్యసనాలకు బానిస కావడం, కుంగుబాటు, సర్దుబాటు సమస్యలు బాధితుల్లో కనిపిస్తాయి. సామాజిక, ఆర్థిక, ప్రేమ వ్యవహారాలు, కుటుంబ కలహాలు, వంశపారంపర్య, మద్యం, మాదక ద్రవ్యాలు, జీవిత అనుభవాలు మానసిక రుగ్మతలకు దారితీస్తున్నాయి. జిల్లాలో బాధితులకు వైద్య సేవలందించేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నాం.

డాక్టర్ సుబ్బారావు, మెంటల్ హెల్త్ ప్రోగ్రాం జిల్లా అధికారి

సామాజిక కారణాలపై నిర్లిప్తత, ఒత్తిడి, భ్రాంతి, అధిక బాధ, దుఃఖం, విపరీతమైన భయం, కోపం, శత్రుత్వం, ఆలోచన ఏకాగ్రతలో గందరగోళం, నిద్ర సమస్య, అలసట, శక్తిహీనత, ఆత్మహత్య ధోరణి, అతి స్పందన, విపరీతమైన మూడ్ స్వింగ్స్ వంటివి మానసిక సమస్యల లక్షణాలు. విద్యార్థుల్లో పరీక్షలు, ఓటమి భయం, ఒంటరితనం కనిపిస్తాయి. ఇలాంటి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి ప్రాథమిక స్థాయిలోనే చికిత్సలు అందిస్తే నయం చేయవచ్చు.డాక్టర్ ప్రగతి, మానసిక వైద్య నిపుణురాలు

# ఖాళీ ప్లాట్లు.. కాలనీవాసుల పాట్లు

జనగామ : పట్టణంలోని ఖాళీ ప్లాట్లు చెత్త కేంద్రాలకు నిలయంగా మారాయి. దోమలు, విష కీటకాలు, పందులు స్వైరవిహారం చేస్తుండటంతో ఆయా కాలనీవాసులకు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని చోట్ల నీరు నిలిచి మురుగు గుంతలుగా మారాయి. వరుస వర్షాలతో శివారు కాలనీలకు వరదనీటి ప్రమాదం ఉంది. పక్కా రహదారులు, కాల్వలు లేని కాలనీలకు రంగప్ప చెరువు వరద, మురుగునీరు ముప్పుగా మారింది. సరైన దిశ, దశ లేని పట్టణ ప్రణాళిక విభాగం, పట్టింపు లేని పురపాలిక అధికారులు, పాలకవర్గం, పౌరస్పృహ లేని ప్లాట్ల యజమానుల కారణంగా ఆయా ప్రాంతవాసులకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. వర్షాకాలంలో నీరు నిలిచి అపరిశుభ్ర వాతావరణం ఏర్పడిన సమయంలో పారిశుద్ధ్య విభాగంపై ఒత్తిడి పెరుగుతోంది.

జోరుగా క్రయవిక్రయాలు

వేగంగా విస్తరిస్తున్న జనగామ పట్టణంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని స్థలాల క్రయ, విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ ప్రాంతం వారే కాకుండా పక్క జిల్లాల వారు సైతం ఇక్కడి భూములపై పెట్టుబడులు పెడుతున్నారు. శ్రీనగర్ కాలనీ, సాయినగర్, శ్రీవిల్లాస్ కాలనీ, జీఎం గోకుల్‌నగర్, బాలాజీనగర్, జ్యోతినగర్, ప్రగతినగర్, దుర్గానగర్, బతుకమ్మ కుంట, గీతానగర్, వికాస్‌నగర్ తదితర వీధుల్లో స్థలాలకు డిమాండ్ ఉంది. కొంత మంది ఇళ్లు కట్టుకోగా మరికొంత మంది స్థలాపై పెట్టుబడి పెట్టి వదిలేస్తున్నారు. యజమానులు ఎవరో తెలియని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆ ప్లాట్లతో



అవస్థలు ఏర్పడుతున్నాయి.

పన్ను వసూలులో అశ్రద్ధ

ఇల్లు కట్టే ఆలోచన లేనప్పుడు ఇరుగు పొరుగు వారికి ఇబ్బంది కలగకుండా ఎప్పటికప్పుడు స్థలాన్ని చదును చేయించాలి. నీరు బయటకు పోయేలా ఏర్పాట్లు చేయాలి. ఇలా చేయని ప్లాట్ల యజమానులను గుర్తించి మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేయాలి. పట్టించుకోని పక్షంలో పురపాలిక ఆధ్వర్యంలో వాటిని చదును చేయించి, అందుకు అయిన ఖర్చును యజమాని నుంచి చట్టబద్ధంగా జరిమానాతో సహా వసూలు చేయవచ్చు. ఇలాంటి స్థలాలను గుర్తించి పన్ను వేయాల్సి ఉంటుంది. ఖాళీ స్థలాలకు ఆస్తి పన్ను విధించి ఆదాయాన్ని పొందే అవకాశం ఉన్నా పుర అధికారులు ముందుకు వెళ్లడం లేదు. స్థల యజమానుల సమాచారం లేదని పురపాలక పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు అంటున్నారు.

ప్రభుత్వ స్థలాలదీ అదే దుస్థితి

ప్రభుత్వ కార్యాలయాలు, విద్యా సంస్థలు, అంతర్గత, ప్రధాన రహదారుల వెంట ఉన్న గ్రీన్‌బెల్టు, తదితర స్థలాలు చెత్తకుండీలుగా, మురుగునీటి నిలయాలుగా మారుతున్నాయి. గుండ్లగడ్డ కబేలా నుంచి పాలకేంద్రం వరకు 60 అడుగుల రహదారి, రైలు పట్టాల మధ్య ఖాళీ స్థలం డంపింగ్ యార్డుగా మారాయి. నిర్మాణ వ్యర్థాలు, వివిధ కార్యాల భోజన వ్యర్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు ఈ దారుల వెంట పడేస్తున్నారు. ఈ ప్రాంతాలను శుభ్రం చేసేందుకు ఏటా రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు.

గుర్తించి చర్యలు తీసుకుంటా– జె.రజిత, మున్సిపల్ కమిషనర్

ఖాళీ స్థలాల సమస్య మా దృష్టిలో ఉంది. స్థలాల యజమానుల గుర్తింపే సమస్యగా ఉంది. అమ్మకాలు, కొనుగోల్లు జోరుగా సాగుతుండటంతో ఆయా ప్లాట్ల పక్క వారికే యజమానులు ఎవరో తెలియడం లేదు. ప్రజల నుంచివచ్చే ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

# సింగరేణిలో 'సౌర'భాలు

సింగరేణి : సంస్థ సౌర విద్యుత్తు కేంద్రాలు అందుబాటులోకి తీసుకొస్తోంది. ఇప్పటికే సింగరేణి వ్యాప్తంగా తొమ్మిది ఏరియాల్లో 224 మెగావాట్ల సామర్థ్యం గల సౌర విద్యుత్తు కేంద్రాలను నిర్మించింది. తాజాగా మరో ముందడుగు వేసింది. మరో 232 మెగావాట్ల సామర్థ్యం గల కేంద్రాలను నిర్మించబోతోంది. ఈ మేరకు ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా భూపాలపల్లి ఏరియాలో 10 మెగావాట్ల ప్లాంటు ఏర్పాటు చేయనుంది. విద్యుత్తు ఉత్పత్తిలో స్వయం సమృద్ధి దిశగా సింగరేణి వేగంగా అడుగులు వేస్తోంది. 1200 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు ఉత్పత్తి చేస్తోంది. 224 ఎంవీ సౌర విద్యుత్తును సైతం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇక రెండో దఫాలో రానున్న రెండేళ్లలో మరో 232 మెగావాట్ల ప్లాంట్లను నిర్మించి ఉత్పత్తి ప్రారంభించనుంది. ఇందుకు తగిన కసరత్తు మొదలుపెట్టింది. 2024 డిసెంబర్ నాటికి పూర్తి చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది.

రూ.1,349 కోట్ల వ్యయంతో..రెండో దశలో రూ.1,349 కోట్లతో 232 మెగావాట్ల సామర్థ్యంతో సౌర విద్యుత్తు కేంద్రాల ఏర్పాటుకు దేశవ్యాప్త టెండర్లను సింగరేణి ఆహ్వానించింది. రాష్ట్రవ్యాప్తంగా 8 ఏరియాల్లో యూనిట్లను నిర్మించనుంది. టెండర్ గడువు ఈ నెల 25వ తేదీగా నిర్ణయించింది. ఉత్పత్తి మొదలైతే రూ.500 కోట్ల విలువైన విద్యుత్తు ఆదా అవుతుందని సింగరేణి యాజమాన్యం భావిస్తోంది. అదేవిధంగా మొదటి దఫాలో మిగిలిన 76 మెగావాట్ల సామర్థ్యం గల యూనిట్లు నెలకొల్పే పనులు తుది దశలో ఉన్నాయి. పూర్తిచేసి ఉత్పత్తి ప్రారంభిస్తే మొదటి దశ లక్ష్యం పూర్తికానుంది. మొత్తంగా కలిపితే 2024 డిసెంబర్ నాటికి 532 ఎంవీ విద్యుత్తు ఉత్పత్తి అవుతుందని, నిర్దేశిత లక్ష్యం ఛేదించినట్లవుతుందని కంపెనీ భావిస్తోంది. భూపాలపల్లి ఏరియాలో ఇప్పటికే 10 ఎంవీ సౌర విద్యుత్తు కేంద్రం నిర్మించారు. గతేడాది నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేస్తున్నారు. తాజాగా మరో 10 ఎంవీ ప్లాంట్ ఏర్పాటుకు యాజమాన్యం చర్యలు చేపట్టింది. టెండర్ ప్రక్రియ కూడా మొదలైంది. పట్టణంలోని సీఆర్‌నగర్‌లో ప్రస్తుతానికి ఉన్న ప్లాంట్ పక్కనే కొత్త కేంద్రాన్ని నిర్మించేందుకు ఆలోచనలు చేశారు. 45 ఎకరాల భూమిలో సౌర పలకలు ఏర్పాటు చేసి విద్యుదుత్పత్తి చేపట్టనుంది.

'జీరో పవర్' సంస్థగా..సింగరేణి కంపెనీ ఏటా గనులు, కాలనీల అవసరాలకు సుమారు 700 మిలియన్ యూనిట్ల విద్యుత్తు వినియోగిస్తోంది. దీని కోసం తెలంగాణ డిస్కంకు సుమారు రూ.490 కోట్లు చెల్లిస్తోంది. ఈ భారాన్ని తగ్గించుకుని 'జీరో పవర్' సంస్థగా దేశంలోనే ప్రథమంగా నిలవాలనే లక్ష్యంతో 2020 సౌర కేంద్రాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఇప్పటివరకు 224 మెగావాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను నిర్మించి 731 మిలియన్ యూనిట్ల విద్యుత్తును ఉత్పత్తి చేశారు.

# ధాన్యం కమీషన్లతో ఆర్థిక అభ్యున్నతి

సిరిసిల్ల : ధాన్యం కొనుగోళ్లలో ముందుంటున్న మహిళా సంఘాలు.. వచ్చిన లాభాలతో ఆస్తులను కూడబెట్టుకుంటున్నారు.. మార్కెట్ యార్డులకు ప్రత్యామ్నాయంగా మారిన కొనుగోళ్లతో వచ్చిన కమీషన్‌ను సభ్యుల ఆర్థిక అభ్యున్నతికి వాడుకుంటూనే గ్రామాల్లో స్థిరాస్తులను కూడబెడుతూ ఇతర సమాఖ్యలకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు. వరితో వీరి విజయం..

ఉమ్మడి జిల్లా వరి సాగులో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుస్తోంది. ప్రతి సీజన్‌లో లక్షల హెక్టార్ల సాగు విస్తీర్ణంతో ఏటా వానాకాలం, యాసంగి కలిపి లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తోంది. ఈ దిగుబడినంతా మార్కెట్ కమిటీలు, పౌరసరఫరాల శాఖలు కొనుగోలు చేయలేని పరిస్థితి. అప్పుడు వీరికి ప్రత్యామ్నాయంగా 2006 నుంచి ఐకేపీ (ఇందిరా క్రాంతి పథం) ద్వారా మహిళలు రంగంలోకి దిగారు. గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. నేటికీ కొనుగోళ్లు నిరాటంకంగా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేయడం.. నాణ్యత, తూకాల్లో మోసం లేకపోవడం.. అమ్మిన ధాన్యానికి చెల్లించాల్సిన మొత్తాన్ని చెప్పిన సమయానికి చేతికందడం వీరి ప్రత్యేకత. ఇటీవల వానాకాలం 14 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు.

రెండేళ్లలో రూ.33.41 కోట్లు..ఉమ్మడి జిల్లాలో గత రెండేళ్లలో నాలుగు సీజన్లలో ధాన్యం కొనుగోళ్లతో రూ.33.41 కోట్ల కమీషన్ మహిళా సంఘాలకు అందింది. 2006లో క్వింటాలు ధాన్యం కొనుగోలుపై రూ.12 కమీషన్ ఉండేది. ప్రస్తుతం కామన్ రకానికి రూ.31.25 'ఏ' గ్రేడుకు రూ.32 చెల్లిస్తున్నారు. ఇలా వచ్చిన సొమ్మును గ్రామైక్య సంఘాల్లో జమ చేసి అవసరమైన సభ్యులకు తక్కువ వడ్డీకి ఇస్తున్నారు. మరికొన్ని సంఘాలవారు స్థిరాస్తులను కొనుగోలు చేస్తున్నారు. పక్కా భవనాలు నిర్మించి అద్దెలకిస్తూ సంఘాలను బలోపేతం చేస్తున్నారు. కరీంనగర్‌లోని జీవనజ్యోతి సమాఖ్యకు ధాన్యం, మక్కల కొనుగోలు ద్వారా రూ.1.50 కోట్ల కమీషన్ వచ్చింది. వీరికి ప్రభుత్వం స్థలం కేటాయించడంతో నాబార్డు ఆర్థిక సాయంతో గోదాంను నిర్మించారు. దానిని ప్రస్తుతం పౌర సరఫరాలశాఖకు అద్దెకిస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగిలోని మహిళా సమాఖ్యకు కేటాయించిన స్థలంలో కమీషను సొమ్ము రూ.19.50 లక్షలతో భవనాన్ని నిర్మించారు. దానిని ప్రస్తుతం రెవెన్యూ కార్యాలయానికి, దుకాణాల నిర్వహణకు



అద్దెకిచ్చారు.ఎల్లారెడ్డిపేట మండలం పదిర, ముస్తాబాద్ మండలం గూడెం, కోనరావుపేట మండలం కొండాపూర్‌లో కమీషన్ సొమ్ముతో కొనుగోలు కేంద్రాల నిర్వహణకు సొంతంగా స్థలం కొనుగోలు చేశారు.

భరోసా కలిగింది

2011 నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాం. ప్రతి సీజన్‌కు స్థల సమస్య ఎదురయ్యేది. దీనికితోడు గ్రామైక్య సంఘంలోని సభ్యులకు ఆర్థికంగా భరోసా కల్పించాలని నిర్ణయించుకున్నాం. 2019లో రూ.55 లక్షలతో అయిదు ఎకరాల స్థలం కొనుగోలు చేశాం. ప్రతి సీజన్‌లో రైతులకు సౌకర్యాలు కల్పించి ఇక్కడే ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. ప్రస్తుతం ఈ భూమి విలువ రూ.2 కోట్లు ఉంటుంది. ప్రభుత్వ సాయంతో గోదాముల నిర్మాణానికి ప్రణాళికలు చేస్తున్నాం.

పుప్పాల వనిత, పదిర, గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు, ఎల్లారెడ్డిపేట మండలంనిరుపేదలకు అండగా.. ధాన్యం కొనుగోళ్ల ద్వారా రూ.53 లక్షలను కూడబెట్టాం. నాబార్డు, ఎస్‌జీఎఫ్‌వై రుణసాయానికి తోడుగా ప్రభుత్వం అల్లునూరులో 2.30 ఎకరాల స్థలం కేటాయించింది. మొత్తం రూ.2.30 కోట్లతో 7500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో గోదాములను నిర్మించాం. 2011 నుంచి వీటిని పౌరసరఫరాలశాఖకు అద్దెకిచ్చాం. దీనిద్వారా జిల్లా సమాఖ్యకు నెలకు రూ.1.18 లక్షల ఆదాయం సమకూరుతోంది. వీటిని సంఘాల్లోని పేదలకు తక్కువ వడ్డీకి రుణాలు అందజేస్తూ ఆయా కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఉపయోగపడుతుంది.కోల హరిణి, సమాఖ్య అధ్యక్షురాలు, కరీంనగర్

# హమాలీల జీవితం.. గాలిలో దీపం



ఖమ్మం : వ్యవసాయ మార్కెట్లలో పనిచేస్తున్న హమాలీల జీవితం దుర్భరంగా మారింది. ఇటు వ్యాపారికి, అటు రైతుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా విపణికి వెన్నుదన్నుగా నిలుస్తున్న వీరి ఆర్థిక పరిస్థితులు మాత్రం మారడం లేదు. ఖమ్మం జిల్లాలో 8, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 7 కలిపి మొత్తం 15 వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయి. వీటిలో సుమారు 5 వేల మంది హమాలీలు పనిచేస్తున్నారు. ఒక్క ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌పైనే సుమారు 3 వేల మంది హమాలీ కార్మికులు ఆధారపడ్డారు. పని దొరికితే పర్వాలేదు. లేకుంటే పస్తులు ఉండటమే.మార్కెట్ కమిటీ వీరికి కేవలం లైసెన్స్ మాత్రమే ఇస్తుంది. అలాగే ఏడాదికి రెండు జతల దుస్తులు అందజేస్తుంది. అంతకుమించి ఎలాంటి సాయం చేయదు. చాలామంది హమాలీలు పని చేసే సమయంలో గాయపడి... అస్వస్థతకు గురవుతుంటారు. అయినా వీరికి ఇక్కడ ఎలాంటి ప్రథమ చికిత్స అందుబాటులో లేదు. ఆకస్మికంగా మృతి చెందినా, అనారోగ్యంతో కన్నుమూసినా, పనిచేసే సమయంలో గాయపడినా ఎలాంటి బీమా సౌకర్యం లేదు. బాధిత కుటుంబానికి మాత్రం బీఆర్‌ఎస్‌కేవీ సంఘం దహన సంస్కారాల నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తుంది. వయసు పైబడిన అనేక మంది మోకాళ్లు, నడుము నొప్పులు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. వీరికి ఎలాంటి సాయం లేదు. ఏళ్ల తరబడి పనిచేస్తూ మార్కెట్ల ఆదాయం పెంచటంలో కీలకపాత్ర పోషించిన హమాలీలకు ఆ శాఖ నుంచి ఎలాంటి పింఛను లభించటం లేదు. చేతనైనన్ని రోజులు పనిచేయటం, తర్వాత మానేయడం పరిపాటి. జీవితానికి ఎలాంటి భద్రత లేకుండా పోయింది. అనేక మంది అనారోగ్యాలతో బాధపడుతున్నారు. కుటుంబాలను పోషించుకోలేని స్థితిలో ఉన్నారు.

కనీస సాయం కరవు..

వ్యవసాయ మార్కెట్లలోని పత్తి, మిరప, అపరాల యార్డుల్లో పని చేస్తారు. వీరే లేకుంటే విపణి నుంచి ఒక్క బస్తా కూడా కదలదు. మార్కెట్‌కు వచ్చిన రైతు సరకును దిగుమతి చేయటం, వ్యాపారి కొనుగోలు చేసిన తర్వాత ఎగుమతి చేయటం ద్వారా విపణిలో ఒక్క బస్తా కూడా లేకుండా నిత్యం ఖాళీ చేస్తుంటారు. విపణిలో ఒక్కో బస్తా దిగుమతి చేయటంతో పాటు కాంటా వేసినందుకు వీరికి రూ.10 చెల్లిస్తారు. ఇలా విపణిలో కొంతమంది హమాలీలు కలిసి బృందాలుగా ఏర్పడి పనిచేస్తుంటారు. పని పూర్తయిన తర్వాత వచ్చిన డబ్బును పంచుకుంటారు. సీజన్‌లో వీరికి రోజుకు రూ.400 నుంచి రూ.500 వరకు కూలి అందుతుంది. ఆగస్టు నుంచి నవంబరు వరకు అన్‌సీజన్ ఉంటుంది. ఈ సమయంలో వారికి ఉపాధి దొరకదు. కొన్నిసార్లు రోజుకు రూ.50 నుంచి రూ.100 వరకు వచ్చిన సందర్భాలు ఉన్నాయి. కేవలం విపణికి వచ్చిన సరకు మీద మాత్రమే ఆధారపడి జీవిస్తారు. ఎండాకాలం సీజన్‌లో మార్కెట్లో మిరప ఘాటును తట్టుకోవడం చాలా కష్టం. అలాంటిది వీరు ఉదయం నుంచి సాయంత్రం వరకు మండుటెండలో మిరప ఘాటులో పని చేసి మార్కెట్‌కు అండగా నిలుస్తున్నారు. కేవలం రైతు ఇచ్చే కూలిపై ఆధారపడి పనిచేస్తున్నారు. ప్రభుత్వపరంగా మాత్రం వీరికి ఎలాంటి ఆర్థిక వెసులుబాటు లేదు.

ఏళ్ల తరబడి మార్కెట్‌ను నమ్ముకుని జీవిస్తున్న హమాలీలను ప్రభుత్వం ఆదుకోవాలి. వారు ఈ పని తప్ప మరో పని చేయలేరు. రైతులు, వ్యాపారులు, ప్రభుత్వానికి వారధిలా పనిచేస్తున్న వీరి సేవలు మరువలేనివి. పని చేయలేని పరిస్థితిలో ఉన్న హమాలీలకు మార్కెటింగ్‌శాఖ పింఛను అందించాలి. మార్కెట్లలో వారికి భోజన, తాగునీటి సౌకర్యం కల్పించాలి. అత్యవసర వైద్యసేవలను అందుబాటులో ఉంచాలి. రెండు పడక గదుల ఇళ్లను మంజూరు చేయాలి. పాలకవర్గంలో వ్యాపారులను డైరెక్టర్లుగా తీసుకున్నట్లే హమాలీ కార్మికులకూ డైరెక్టర్లుగా ప్రాతినిధ్యం కల్పించాలి. అప్పుడే వారి సమస్యలు పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునే వెసులుబాటు ఉంటుంది.నున్నా మాధవరావు, బీఆర్‌ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు, ఖమ్మం

# బాంబుల మోత.. భయాందోళన..!

మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా గుట్టలను పేల్చివేస్తున్నారు. క్రషర్ మిల్లుల పేరిట కొందరు అనుమతులు పొంది ఆ పరిశ్రమలను నిర్వహిస్తూ జిలెటిన్ స్టిక్స్‌ను అక్రమంగా మోతాదుకు మించి అమర్చి గుట్టలను పేల్చివేస్తున్నారు. పగటి వేళలో బోర్‌మిషన్లతో డ్రిల్లింగ్ చేసి సాయంత్రం జిలెటెన్ స్టిక్స్‌తో పేలుస్తున్న తీరు సమీప ప్రాంతవాసుల్ని భయాందోళనకు గురి చేస్తోంది. ఇళ్లు బీటలువారుతున్నాయి. బోరు బావులు కూలిపోయి నీళ్లు రావడం లేదు. సమీపంలోని పంట పొలాల్లో సైతం రాళ్లు పడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పేలుళ్లు జరుపుతున్నా భూగర్భ గనులు, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు.జిల్లాలో సుమారు 30 క్రషర్లు ఉన్నట్లు అధికారిక రికార్డులు తెలుపుతున్నాయి. వాటిలో పది, పదిహేను క్రషర్ మిల్లులు పని చేస్తున్నాయి. అనుమతి లేకుండా మరో పది నిర్వహిస్తున్నారు. ఈ మిల్లులకు అవసరమైన కంకర ముడి సరకు కోసం గుట్టలను పిండి చేస్తున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు వాటి నిర్వహణ అనుమతులు తమ పరిధిలోకి రావంటూ ఆయా శాఖల అధికారులు ఒకరిపై ఒకరు నెట్టివేస్తున్నారు.

స్థిరాస్తి వ్యాపారులు సైతం..

కొందరు స్థిరాస్తి వ్యాపారులు వ్యయసాయ యోగ్యం కాని గుట్టలు ఉన్న భూములను కొనుగోలు చేసుకొని వెంచర్లు చేస్తున్నారు. ఆ స్థలాల్లో ఉన్న పెద్ద గుట్టలను రాత్రికి రాత్రే పేల్చివేసి చదును చేస్తున్నారు. మహబూబాబాద్ పట్టణంలోని నలువైపుల ప్రతి రోజు గుట్టలను పేల్చివేస్తున్నారని జిల్లా అధికారులకు ఫిర్యాదులు చేసిన వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. భారీ యంత్రాలను మోహరించి గుట్టలను పేల్చివేసిన రాళ్లను పదుల సంఖ్యలో లారీలతో క్రషర్లకు తరలిస్తున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని నాలుగు కాలనీలకు చెందిన ప్రజలు జిల్లా అదనపు కలెక్టర్‌కు అక్రమ పేలుళ్లపై ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. హుటాహుటిన అక్కడికి వెళ్లిన అధికారులు ఒక వాహనాన్ని సీజ్ చేసి మిగిలిన వాటిని వదలివేశారు. ముఖ్యప్రజాప్రతినిధులు ఆ వ్యాపారులకు అండగా నిలవడంతో వెనుదిరిగి వచ్చినట్లు ఆ శాఖకు చెందిన సిబ్బంది వ్యాఖ్యానిస్తున్నారు.ఇలా పట్టణ నలుమూలలతో పాటు కేసముద్రం, గూడూరు, నెల్లికుదురు, కురవి, డోర్నకల్, దంతాలపల్లి మండలాల్లో నిత్యం ఎక్కడో ఒక్క చోట పేలుళ్లు యథేచ్ఛగా సాగుతున్నట్లు ఆరోపణలున్నాయి.

అనుమతి లేకుండానే..

మహబూబాబాద్ పట్టణంలోని తాళ్లపూసపల్లి రోడ్‌లో ఉన్న పెద్ద గుట్టలను కొందరు స్థిరాస్తి వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా పేల్చివేస్తున్నారు. ఓ రైతుకు చెందిన



భూమిని కొనుగోలు చేసిన స్థిరాస్తి వ్యాపారులు సంబంధిత శాఖల అధికారుల అనుమతి తీసుకోకుండానే జిలెటిన్ స్టిక్స్ పేల్చి గుట్టలను కరిగిస్తున్నారు. ఇటీవల స్థానికులు జిల్లా అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా మైనింగ్ శాఖాధికారులు వెళ్లి ఒక వాహనాన్ని సీజ్ చేశారు. వారం రోజులు విరామమిచ్చి మళ్లీ పేలుళ్లు ప్రారంభించారు.

ఇళ్లకు పగుళ్లు

దంతాలపల్లికి చెందిన కొక్కు యశోదకు చెందిన ఈ ఇంటిపై కప్పు పగిలిపోయింది. రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఓ క్రషర్‌లో బాంబులు పేల్చిన సమయంలో భారీ శబ్దాలతో భూమి కంపిస్తోంది. ఈ ఇంటిలాగానే పక్క ఉన్న ఇళ్లు కూడా పగుళ్లు చూపుతున్నాయి.

పెచ్చులు ఊడిపడుతున్నాయి

కొక్కు యశోద, దంతాలపల్లి

మా ఇంటికి సమీపంలో ఉన్న క్రషర్ కోసం గుట్టకు బాంబులు అమర్చి పేల్చివేస్తున్నారు. ఆ శబ్దాలకు గోడలు పగుళ్లే చూపడంతో పాటు ఇంటి పైకప్పు పెచ్చులు ఊడి మీద పడ్డాయి. ఎన్నిసార్లు చెప్పిన వారు వినిపించుకోకుండా బాంబులు పెడుతున్నారు.

భయమేస్తోంది..సొమయ్య, జయశంకర్‌కాలనీ, మహబూబాబాద్

మహబూబాబాద్–తాళ్లపూసపల్లి రోడ్‌లో సుమారు 20 ఎకరాలకు పైగా విస్తరించిఉన్న భూమిలో ఎత్తైన గుట్టలను పేల్చివేసేందుకు కొందరు స్థిరాస్తి వ్యాపారులు ప్రతి రోజు సాయంత్రం, రాత్రి సమయాల్లో జిలెటిన్ స్టిక్స్ అమర్చి గుట్టలను పేలుస్తున్నారు. సమీప కాలనీల్లోని ఇళ్లు ఆ పేలుళ్ల ధాటికి బీటలువారుతున్నాయి. రెండు నెలలుగా ఈ ప్రక్రియ జరుగుతోంది. ఇటీవల అధికారులు వచ్చి పేల్చివేతలు నిలిపివేయాలని చెప్పి వెళ్లినా కూడా కొనసాగిస్తున్నారు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

మాకు సంబంధం లేదురవీందర్, జిల్లా మైనింగ్ శాఖాధికారి

క్వారీలు, క్రషర్ మిల్లుల నిర్వహణకు అనుమతులు ఇస్తాం. బాంబు పేలుళ్ల అనుమతులు మాకు సంబంధం లేదు. వారు ఎంత ముడి సరకు తీసుకెళుతున్నారనే విషయంపైనే శాఖ దృష్టి సారిస్తుంది. గుట్టలకు బాంబులు అమర్చడం, వాటి వల్ల నష్టపోయినవారికి సాయమందించడం మా శాఖ పరిధిలోకి రాదు.

# పదేపదే.. అదే తప్పు..!



చర్ల : భూదస్త్రాల ప్రక్షాళన అనంతరం భద్రాచలం ఏజెన్సీ ప్రాంతంలో పెద్దఎత్తున భూ ఆక్రమణలు జరిగాయి. చర్ల మండలంలో నిబంధనలకు విరుద్ధంగా 2018, 2019లో ఓ అధికారి భారీగా పట్టాలు జారీ చేశారు. అసైన్డ్ స్థలాలకూ భూ హక్కులు కల్పించారు. కుదునూరు(జడ్), చింతకుంట(జడ్), తేగడ(జి), కొత్తపల్లి(జడ్), వీరాపురం, మొగళ్లపల్లి(జడ్), ఎంపీపల్లి, సి.కత్తిగూడెం తదితర రెవెన్యూ గ్రామాల్లో అక్రమ పట్టాదారు పుస్తకాలు జారీ అయ్యాయని సమాచారం. షెడ్యూల్డ్ ఏరియాలో క్రయవిక్రయాలు నిషిద్ధమైనా అప్పటికే కొన్ని వందలాది ఎకరాలకు సదరు అధికారితో పాటు తదుపరి వచ్చిన కొందరు అధికారులు రూ.లక్షలు దండుకొని అడ్డదారిలో పట్టాలిచ్చారనే ఆరోపణలున్నాయి. దుమ్ముగూడెం మండలంలో భూ అక్రమాలకు బాధ్యుడిని చేస్తూ అక్కడి తహసీల్దారును కలెక్టర్ అనుదీప్ సస్పెండ్ చేయడంతో అవినీతి అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రభుత్వ చెరువులకు సైతం ఆ అధికారి పట్టాలు చేసి అక్రమాలకు పాల్పడిన వైనంపై ఇటీవల గవర్నర్‌కూ కొందరు ఫిర్యాదు చేశారు. బదిలీపై వెళ్లిన ఆ అధికారి వేరే మండలంలోనూ ఇదే తంతు నిర్వహించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక్కడ షెడ్యూల్ చట్టాన్ని తుంగలో తొక్కి గతంలో జరిగిన భూ అక్రమాలపై హైకోర్టులో గిరిజన సంఘం తరఫున పిటిషన్ దాఖలైంది.

మళ్లీ అక్రమార్కుల చెరలోకి..

గోదావరి పరివాహకంలో అప్పట్లో జరిగిన భూఆక్రమణలపై వరుస కథనాలు ప్రచురితమవటంతో అధికారులు సర్వే జరిపి రూ.కోట్ల విలువ చేసే భూములను 2018లో స్వాధీనపరచుకున్నారు. వీరాపురం మొదలుకొని జీపీపల్లి, కత్తిగూడెం, చింతకుంట, మొగళ్లపల్లి, కొత్తపల్లి గోదావరి పరివాహక ఇసుకపాయ, సందుపాయ లంకల్లో విలువైన భూములను అక్రమార్కుల చెర నుంచి కాపాడారు. సుమారు 80 ఎకరాల ఆక్రమిత భూముల్లో హద్దురాళ్లు ఏర్పాటు చేశారు. కొద్దిరోజుల తర్వాత ఆ భూములను మళ్లీ కొందరు ఆక్రమించుకుని వ్యవసాయం చేస్తున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఇక్కడి బంగారం లాంటి లంక భూములకు ఎకరాకు ఏడాదికి కౌలు ధర రూ.95వేల నుంచి రూ.లక్షకు పైగా పలుకుతోంది. ఇలాంటి భూములు చాలావరకు ఆక్రమణలోనే కొనసాగుతున్నా.. రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. చివరకు అక్రమార్కులు శ్మశానాలను సైతం వదలటం లేదు.లంక భూముల్లో పాతిన హద్దురాళ్ల వివరాలు సేకరిస్తున్నాం. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తాం. యాక్ట్ 1/70కు విరుద్ధంగా కొన్ని భూములకు పట్టాలు జారీ చేయటం నేరం. ఈ వ్యవహారంపై గవర్నర్‌కు ఫిర్యాదు అందినట్లు సమాచారం లేదు.భరణిబాబు, తహసీల్దారు, చర్ల

# నాంపల్లి గుట్ట.. ఆక్రమణల పుట్ట!

వేములవాడ : దక్షిణ కాశీగా పేరొందిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దత్తత దేవాలయమైన నాంపల్లి గుట్టపైన శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ స్థలం కబ్జాకు గురవుతోంది. గుట్టకు ఎక్కడా హద్దులు లేకపోవడంతో అక్రమార్కులకు వరంగా మారింది. దాని చుట్టూ ఆలయ స్థలంలో రోజుకో చోట ఆక్రమణలకు తెరతీస్తున్నారు. ఇటీవల మెట్ల దారి వైపు పెద్ద ఎత్తున తవ్వి చదును చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టగా అధికారులు అడ్డుకున్నారు. దీన్ని బట్టి కబ్జాదారులు ఎంతగా బరితెగించారో ఊహించవచ్చు. ఇంత జరుగుతున్నా ఆలయ అధికారులు మాత్రం సర్వే చేసి హద్దుల ఏర్పాటుకు చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.ప్రభుత్వ రికార్డుల ప్రకారం నాంపల్లిలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయ గుట్ట 101.28 ఎకరాల విస్తీర్ణంలో వ్యాపించి ఉంది. దీనిపై స్వామివారు కొలువై ఉన్నారు. గుట్ట ప్రాంతంలోనే ముంపు గ్రామాల కాలనీలు ఏర్పాటు కావడంతో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. దీంతో కొందరు అక్రమార్కులు ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడ కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో నాంపల్లి లక్ష్మీనర్సింహస్వామి గుట్ట స్థలాన్ని కూడా అక్రమార్కులు చదును చేస్తున్నారు. ఇప్పటికే దాని చుట్టూ అక్కడక్కడ నిర్మాణాలు చేపట్టారు. ప్రధాన రోడ్డు పక్కన గుట్టను ఆనుకొని పాత రోడ్డును కబ్జా చేసి నిర్మాణాలు చేశారు. గుట్టపైకి వెళ్లే కమాన్ ప్రాంతంలోనూ స్థలాన్ని ఆక్రమించారు. ఇలా ఆక్రమణల పర్వం కొనసాగుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

హద్దుల ఏర్పాటుతోనే అడ్డుకట్ట

నాంపల్లి శ్రీలక్ష్మీనర్సింహస్వామి గుట్టను పూర్తి స్థాయిలో సర్వే చేయించి హద్దులను ఏర్పాటు చేస్తేనే ఆక్రమణలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుంది. చుట్టూ పునరావాస కాలనీలను నిర్మించడం, నాంపల్లి ప్రాంతం వేములవాడ మున్సిపల్‌లో విలీనమవడంతో ఇక్కడ భూముల ధరలు పెరిగిపోయాయి. నాంపల్లి గుట్టను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్‌మెంట్ (వీటీఏడీఏ) ప్రణాళికలు సిద్ధం చేసింది. భవిష్యత్తులో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇప్పటికే పెద్ద ఎత్తున భక్తులు ఇక్కడ స్వామివారిని దర్శించుకునేందుకు వస్తున్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అక్రమార్కులు కబ్జాలకు తెరతీస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుట్ట చుట్టూ సర్వే చేయించి హద్దులు ఏర్పాటు చేస్తే ఆక్రమణలకు అడ్డుకట్ట పడేందుకు అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ఎవరి వేడుకకీ జాప్యం?

కొత్తగూడెం : పట్టణ ప్రజలు శుభకార్యాలు నిర్వహించుకునేందుకు కొత్తగూడెం పురపాలకం ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన వేడుకల మందిరం పనులు నత్తనడకన సాగుతున్నాయి. రూ.25 లక్షల అంచనా వ్యయంతో పురపాలక రాజీవ్ పార్కు సమీపంలో ఐదేళ్ల క్రితం ఫంక్షన్ హాలు నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రధాన హాలుకు అదనంగా రెండు గదులు, భారీ వంట షెడ్డు నిర్మించాలన్నది ప్రణాళిక. కానీ నిధులు లేకపోవడంతో ఆయా పనులు సగంలో ఆపేశారు. ఏడాదిలోగా పూర్తి చేస్తామని అధికారులు చెప్పినా.. ఏళ్లు గడిచిపోతున్నాయి. వేడుకల భవనాన్ని పూర్తిచేస్తే ప్రజలపై ఆర్థిక భారం తగ్గడంతో పాటు పురపాలకానికి మంచి ఆదాయ వనరుగా మారుతుంది.అధికారుల చొరవేదీ?ఏ నిధులు అందుబాటులో ఉంటే ఆ నిధులను (అవైలబుల్) కేటాయించాలన్నది తీర్మానం. ఇలా ఇప్పటి వరకు రూ.20 లక్షలు వెచ్చించారు. సగం వరకు పనులు రెండేళ్ల క్రితమే పూర్తిచేశారు. ఆ తర్వాత నిధుల కొరత ఉందని అధికారులు చెబుతున్నారు. కానీ సామాజిక భవనాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు 'పట్టణ ప్రగతి' నిధులు కేటాయిస్తున్నారు. నాలుగు నెలల క్రితం దాదాపు రూ.40 కోట్ల అంచనాతో పలు పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందులో ఒక్కో వార్డుకు సగటున రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు దక్కనున్నాయి. ఈ కేటాయింపుల్లో 27వ వార్డులోని ఫంక్షన్ హాల్‌ను



విస్మరించడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. మరో రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు నిధులు వెచ్చిస్తే వేడుకలు జరుపుకొనేలా భవనం రూపుదిద్దుకునే అవకాశం ఉంది. వేడుకల భవనం ఫ్లోరింగ్, విద్యుత్తు కనెక్షన్లు, చేతులు శుభ్రం చేసుకునే పంపు కనెక్షన్లు, వంట షెడ్డు ప్లాస్టింగ్, గ్రీనరీ పనులు పూర్తిచేయాల్సి ఉంది. కనీసం జిల్లా ఉన్నతాధికారులైనా ఈ సమస్యపై దృష్టిసారించాలన్నది 'గూడెం' వాసుల విన్నపం.

# గోదావరి నీరు.. వచ్చేదెన్నడు సారూ?

నర్సాపూర్ : నియోజకవర్గ ప్రజల దాహార్తిని తీర్చడానికి మంజీరా నీటి పథకానికి అనుబంధంగా శివ్వంపేట మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.30 కోట్లు ఖర్చు చేసి నిర్మించిన గోదావరి నీటి పథకం వృథాగా మారింది. పనులు పూర్తయి ఏడాదవుతున్నా పథకం అలంకార ప్రాయంగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధులు దీన్ని ప్రారంభించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. వర్షాభావంతో..మూడేళ్ల కిందట తీవ్ర వర్షాభావ పరిస్థితులతో నర్సాపూర్ ప్రాంతంలో భూగర్భ జలాలు అడుగంటాయి. చక్రియాల వద్ద నది పూర్తిగా ఎండిపోవడంతో నియోజకవర్గంలోని 399 ఆవాస ప్రాంతాలకు మంజీరా పథకం నుంచి నీటి సరఫరా నిలిపివేశారు. వందల అడుగుల లోతులో బోర్లు తవ్వినా చుక్కనీరు పడలేదు. దీంతో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సమస్యను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. నర్సాపూర్ ప్రాంతానికి గజ్వేల్ సమీపంలోని కోమటిబండ నుంచి గోదావరి జలాలు తరలించడానికి హామీ ఇచ్చారు. రూ.30 కోట్లు విడుదల చేశారు.

అలంకారప్రాయంగా..చక్రియాల నుంచి వయా దౌల్తాబాద్, నర్సాపూర్, తూప్రాన్ మీదుగా గజ్వేల్ వరకు ఉన్న మంజీరా నీటి పథకం ప్రధాన పైప్‌లైన్ల ద్వారానే గోదావరి నీటిని కోమటిబండ నుంచి శివ్వంపేటలో నిర్మించిన సంప్ వరకు తెచ్చారు. ఇక్కడ సంప్ నిర్మాణం పూర్తయింది. 630 కేవీఏ విద్యుత్తు నియంత్రికను సైతం బిగించారు. ఆరు మోటార్లను నీటి పంపింగ్‌కు ఏర్పాటు చేశారు. ఇవన్నీ ప్రస్తుతం అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి.శివ్వంపేట, వెల్దుర్తి మండలాల్లోని 79 నివాస ప్రాంతాలకు గోదావరి నీటిని సరఫరా చేయాలని ప్రణాళికలు రూపొందించగా అటకెక్కింది. శివ్వంపేట మండలం దొంతి, చిన్నగొట్టి ముక్కలో ఉన్న భారీ ట్యాంకులను గోదావరి నీటితో నింపి ఇక్కణ్నుంచి రెండు మండలాలకు సరఫరా చేయాలనుకున్నారు. ఆచరణలో పెట్టకపోవడంతో పథకం నిరుపయోగంగా మారింది.ట్రయల్‌రన్ పూర్తిచేశాం..– ప్రవీణ్‌చారి, డీఈ, మిషన్ భగీరథ పథకంకోమటిబండ నుంచి గోదావరి నీటిని శివ్వంపేట సంపులోకి తరలించడం పూర్తి చేశాం. ట్రయల్ రన్ చేపట్టాం.

# పోవాలి జగన్... బై బై జగన్...



విశాఖ : ప్రజలను మభ్య పెట్టడానికే విశాఖ రాజధాని ప్రకటనలు చేస్తోందని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు పేర్కొన్నారు. విశాఖకు సీఎం రావడానికి డొంక తిరుగుడు జీవోలు ఎందుకని ప్రశ్నించారు. రాష్ట్ర రాజధానిపై 2014లో జగన్ ఏమి మాట్లాడారో ఒకసారి గుర్తు తెచ్చుకోవాలన్నారు. అమరావతి రాజధానిని మనస్ఫూర్తిగా సమర్థిస్తున్న జగన్ చేసిన వ్యాఖ్యలను మీడియాకు గంటా వినిపించారు. రాజధానిపై జగన్ యూ టర్న్ తీసుకున్నారన్నారు. న్యాయస్థానాల్లో ఈ అంశం పెండింగ్‌లో ఉందన్న విషయాన్ని మర్చిపోయారా? అని గంటా ప్రశ్నించారు. "99 శాతం ప్రజలు జగన్ విశాఖకు రావద్దని అంటున్నారు. కావాలంటే ప్రజా అభిప్రాయం సేకరణ చేయండి. విశాఖను పరిపాలన రాజధాని చేస్తే అభివృద్ధి జరుగుతుందని తొలుత స్వాగతించాము. కానీ ఇప్పటి వరకూ ఒక ఇటుక కూడా వేయలేదు. గండికోట రహస్యంలా రుషి కొండ వ్యవహారం ఉంది. రుషికొండలో వాడిన మెటీరియల్ చాలా విలువైనవి ఉన్నాయి. బాత్రూం కమోడు రూ.25 లక్షలతో నిర్మించారంటే.. మిగిలిన విషయాలు ఆలోచించుకోవచ్చు. 175 కి 175 కాదు.. వైసీపీకి ఎందుకు ఓట్లు వేయాలి. ప్రజలకు వైసీపీ ఇచ్చిన ఒక్క హామీ నెరవేర్చలేదు. దేశంలో అత్యధిక ధనిక ముఖ్యమంత్రి జగన్.. అత్యంత సంపన్నుడు. ఇటువంటి వ్యక్తి పేదల పక్షాన పోరాడుతారా? మద్యపాన నిషేధం చేయకుండా... మద్యంపై ఆదాయాన్ని తాకట్టు పెట్టిన ఘనుడు జగన్. జగన్ విశాఖకు దొడ్డి దారిన రావడాన్ని ప్రజలు తప్పుబడుతున్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారు. పోవాలి జగన్... బై బై జగన్ అని ప్రజలు అంటున్నారు" అని గంటా అన్నారు.

## నాలుగున్నరేళ్లలో విహారయాత్రలు తప్ప అభివృద్ధి శూన్యం.. జగన్‌పై యనమల ఫైర్





రాజమండ్రి: గడిచిన నాలుగున్నర ఏళ్లుగా ముఖ్యమంత్రి విహారయాత్రలు చేశారు తప్ప అభివృద్ధి చేయలేదని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు విమర్శలు గుప్పించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. పేదవాడి పేరు చెప్పి వైసీపీ నేతలు రాష్ట్రంలో వనరులన్నీ దోచుకున్నారన్నారు. పేదవారికి ఇళ్ళ స్థలాల పేరుతో వైసీపీ నేతలు దోచుకున్నారని ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వంలో కట్టిన ఇళ్లకు జగన్ ప్రభుత్వం రంగులు మార్చేసిందన్నారు. పూర్తికాని ఇళ్లకు ప్రారంభోత్సవాలు చేస్తూ పేద ప్రజలను జగన్ మోసం చేస్తున్నారని అన్నారు. జగన్ అధికారంలో నుంచి ఎప్పుడు దిగిపోతాడా అని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. నవరత్నాలు పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీలను జగన్ మోసం చేశారని మండిపడ్డారు. పేదరికం తగ్గించగలిగావా..? అసమంతులను తగ్గించగలిగావా..? సూటిగా సమాధానం చెప్పు జగన్ అని ప్రశ్నించారు. ఖజానా ఖాళీ చేసిన ఘనత జగన్ ది అని వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అప్పులు 11 లక్షల కోట్లు దాటిపోయాయని.. 270 కోట్లు రుషికొండ క్యాంపు కార్యాలయం కోసం ఖర్చు పెట్టారన్నారు. జగన్ పాలనలో రెండు లక్షల కోట్లు అవినీతి జరిగిందన్నారు. వైసీపీ అవినీతిపై న్యాయ స్థానంలో పోరాటం చేయటంతో పాటు అవినీతిని కక్కిస్తామన్నారు. హౌసింగ్ నిర్మాణాలపై జగన్ శ్వేతపత్రం విడుదల చేయాలని రామకృష్ణుడు డిమాండ్ చేశారు.

## ఏపీ సీఎంకు ఎవరూ లెక్కలేదు.. చివరకు కోర్టుకు కూడా..



అనంతపురం: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రికి ఎవరు లెక్కలేదని.. చివరకు కోర్టులు కూడా లెక్కలేదన్నారు. సుప్రీంకోర్టులో మూడు రాజధానుల కేసు పెండింగ్‌లో ఉండగానే విశాఖకు తరలించేందుకు ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. వెనకబడిన ప్రాంతాలు ఈ రాష్ట్రంలో నాలుగు జిల్లాలు రాయలసీమలో ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రి ఇవాళ కోర్టు దిక్కరణ చేస్తున్నారన్నారు. రాయలసీమకు పక్కాగా ఇవాళ అన్యాయం జరుగుతోందని తెలిపారు. అనంతపురంకు తాగు, సాగు నీరు రాకుండా కుట్ర చేస్తున్నారని విమర్శించారు. కృష్ణా జలాల మీద కేంద్ర ప్రభుత్వ విధానం రాయలసీమకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కేంద్రం అడుగడునా రాష్ట్రానికి అన్యాయం జరుగుతుంటే జగన్ ఏం చేస్తున్నట్టు అని ప్రశ్నించారు. "నీకెందుకు వై నాట్ 175 ... ఇప్పుడు ఇంత మంది ఉండి ఏం ఉద్ధరించారు. ఇవాళ నిన్ను ప్రజలేవరు కోరుకోవడం లేదు" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్‌ను ఇంటికి సాగణంపితే తప్ప అభివృద్ధి జరగదని రామకృష్ణ వ్యాఖ్యలు చేశారు.

**మోదీ, జగన్‌ల పాలనంతా అప్పుల కుప్పలే..** : గత నాలుగున్నర ఏళ్లలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం చేసిన అప్పులపై శ్వేతపత్రం ప్రకటించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ డిమాండ్ చేశారు. మోదీ, జగన్‌ల పాలనంతా అప్పుల కుప్పలేనన్నారు. గత 9 ఏళ్లలో మోదీ ప్రభుత్వం చేసిన అప్పు రూ.115 లక్షల కోట్లు అని పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి ఇప్పటి వరకూ చేసిన అప్పు రూ.8 లక్షల కోట్లు అని పేర్కొన్నారు. జగన్ సర్కార్ ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఆరు నెలల్లో ఎఫ్ఆర్‌బీఎం పరిమితి దాటి ఆరుసార్లు రూ.67 వేల కోట్లు అప్పు చేసిందని రామకృష్ణ అన్నారు. ప్రతి నెల ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు చెల్లించే పరిస్థితి ఏపీలో లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న అప్పులు ప్రజలపై గుదిబండగా మారాయని రామకృష్ణ అన్నారు.




## హమాస్ 'నరమేధం'పై బైడెన్ ఆవేదన!

వాషింగ్టన్: ఇజ్రాయెల్‌పై హమాస్ దాడులను ఉద్దేశించి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదులు చిన్న పిల్లల తలలను తెగ్గోసే చిత్రాలను చూస్తానని జీవితంలో ఎన్నడూ ఊహించలేదని వ్యాఖ్యానించారు. దీన్ని అత్యంత పాశవికమైన దాడిగా అభివర్ణించిన ఆయన.. జీవితంలో అత్యంత ఘోర కలిని చూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత శనివారం ఇజ్రాయెల్‌లోకి చొరబడిన హమాస్ ఉగ్రవాదులు.. పౌరులపై భీకర దాడులు చేసిన విషయం తెలిసిందే. హమాస్ వందల మందిని బందీలుగా చేసుకుని వారిని అతి దారుణంగా చంపేశారని ఐడీఎఫ్ (ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్) ప్రకటించిన నేపథ్యంలో బైడెన్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. బైడెన్ వ్యాఖ్యలపై శ్వేతసౌధం అధికారి ఒకరు వివరణ ఇచ్చారు. హమాస్ ఘోరాలకు సంబంధించిన చిత్రాలను అధ్యక్షుడు స్వయంగా చూడలేదని తెలిపారు. అయితే, ఇజ్రాయెల్‌లో వారు సృష్టిస్తున్న విధ్వంసానికి సంబంధించి అందిన నివేదికల ఆధారంగానే ఆయన స్పందించారని వెల్లడించారు. ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దాడిలో పలువురు అమెరికా పౌరులు మరణించినట్లు బైడెన్ ధ్రువీకరించారు.

**ఇరాన్.. జాగ్రత్త! :** మరోవైపు బైడెన్ అమెరికాలోని యూదుల ప్రతినిధులతో బుధవారం సమావేశమయ్యారు. ఇజ్రాయెల్‌కు తమ పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. అలాగే హమాస్‌కు మద్దతుగా ఉన్న ఇరాన్‌ను సైతం హెచ్చరించినట్లు బైడెన్ వారికి వెల్లడించారు. ఇజ్రాయెల్, హమాస్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను మరింత తీవ్రం చేయొద్దని.. ఈ విషయానికి దూరంగా ఉండాలని ఇరాన్ ప్రభుత్వాన్ని హెచ్చరించినట్లు తెలిపారు. ఇజ్రాయెల్‌లో పరిస్థితిని ఎప్పటికప్పుడు నిశితంగా గమనిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆ దేశ అధ్యక్షుడు బెంజమిన్ నెతన్యాహుతో నిరంతరం వాకబు చేస్తున్నట్లు చెప్పారు. ఎట్టి పరిస్థితుల్లో ఉగ్రవాదాన్ని సహించేది లేదని స్పష్టం చేశారు. యూదు ప్రజల భద్రతకు తాను కట్టుబడి ఉన్నానని తెలిపారు. దీనికోసం నిరంతరం ఇజ్రాయెల్‌తో కలిసి పనిచేస్తామని చెప్పారు.

**22 మంది అమెరికన్లు మృతి..** మరోవైపు హమాస్ దాడిలో దాదాపు 22 మంది అమెరికన్లు ప్రాణాలు కోల్పోయినట్లు శ్వేతసౌధం బుధవారం ప్రకటించింది. మరో 17 మంది ఆచూకీ తెలియాల్సి ఉందని వెల్లడించింది. రాబోయే రోజుల్లో ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అగ్రరాజ్య జాతీయ భద్రతా సలహాదారు జాక్ సలీవన్ తెలిపారు. హమాస్ చేతిలో కొంత మంది బందీలుగా కూడా ఉన్నారని చెప్పారు. అయితే, బందీలను విడిపించేందుకు అన్ని మార్గాలను అన్వేషిస్తున్నామని అంతకుముందు బైడెన్ కూడా వెల్లడించారు. దానికోసం ప్రత్యేకంగా నిపుణులు పనిచేస్తున్నారన్నారు.




దిల్లీ: ఏపీలో జరుగుతున్న పరిణామాలకు సంబంధించి కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు అన్ని విషయాలు వివరించానని తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తెలిపారు. గురువారం దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అమిత్ షాతో భేటీ వివరాలను వెల్లడించారు. "కేంద్ర హోం మంత్రి కలవాలనుకుంటున్నట్టు కిషన్‌రెడ్డి ఫోన్ చేశారు. చంద్రబాబు అరెస్టు, అనంతర పరిణామాలపై హోం మంత్రి అమిత్ షాకు అన్ని విషయాలు వివరించా.

చంద్రబాబు ఆరోగ్యపరంగా ఇబ్బంది పడుతున్నట్టు చెప్పాను. ఆయనకు భద్రతా పరంగా ఉన్న ఆందోళన గురించి కూడా చెప్పాను. సీఐడీ ఎందుకు పిలిచింది.. ఎన్ని కేసులు పెట్టారని అమిత్ షా అడిగారు. అన్నీ పూర్తిగా రాజకీయ కక్షతో పెట్టిన కేసులే అని అమిత్ షాకు చెప్పా. భాజపానే చేయిస్తోందని ఒక ఎంపీ, మంత్రి నేరుగా అన్నట్టు అమిత్ షాకు తెలిపాను. భాజపా పాత్ర ఉందని నేను అనుకోవట్లేదు. భాజపా నేతల మౌనంతో ఆరోపణలు వచ్చాయనుకుంటున్నా. నిజం వైపు ఉండాలని అమిత్ షాను కోరా. తెదేపా ఎంపీలు ప్రధాని, హోం మంత్రికి లేఖలు రాశారు" అని లోకేశ్ మీడియాకు వివరించారు.

**భాజపాపై జగన్ నిందలు మోపుతున్నారు..** " రాష్ట్రంలో భాజపా పేరు చెప్పి కక్ష సాధిస్తున్నారని అమిత్ షా అన్నారు. చంద్రబాబు అరెస్టు వెనుక తాము లేమని అమిత్ షా స్పష్టంగా చెప్పారు. భాజపాపై జగన్ నిందలు మోపుతున్నారని అన్నారు. అమిత్‌షా వద్ద ఎలాంటి రాజకీయ అంశాలు చర్చకు రాలేదు. రాష్ట్రం నుంచి అమిత్ షా సమాచారం తీసుకున్నట్టు తెలిసింది. క్షేత్రస్థాయిలో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉంది. అక్రమ కేసుపై వైకాపా క్యాడర్‌లోనే అనుమానం ఉంది. స్కిల్ కేసు వెనుక ఏదో జరుగుతోంది. పది రోజులుగా ఈ కేసు విషయమై వైకాపా మాట్లాడలేదు. నా తల్లి ఐటీ రిటర్న్‌లు సీఐడీ చేతికి ఎలా వచ్చాయి? ఈ అంశంపై సీబీడీటీకి ఫిర్యాదు చేస్తా. ఎన్డీఏ, ఇండియా కూటములకు సమదూరంలోనే ఉన్నాం. దాదాపు అన్ని ప్రాంతీయ పార్టీల నేతలను కలిశా. మేం సుప్రీంలో సవాల్ చేసిన 17ఏ అంశం చాలా కీలకం. 17ఏ ను పరిగణనలోకి తీసుకోకుంటే చాలా మంది ఇబ్బంది పడతారు" అని లోకేశ్ తెలిపారు.



## చట్టసభల్లో ఏరోజూ లేని సజ్జలకు ఏం తెలుసు?: బుద్దా వెంకన్న

విజయవాడ: సీఎం జగన్ వస్తున్నారని విశాఖ ప్రజలు గడగడలాడిపోతున్నారని తెదేపా ఉత్తరాంధ్ర ఇంఛార్జ్ బుద్దా వెంకన్న దుయ్యబట్టారు. సజ్జల రామకృష్ణారెడ్డి ఓ అబద్దాల పుట్ట అని.. చట్టసభల్లో ఏ రోజూ లేని ఆయనకు స్కిల్ డెవలప్‌మెంట్ గురించి ఏం తెలుసని ధ్వజమెత్తారు. తమ అధినేత చంద్రబాబును జైలుకు పంపిన కేసులో ఎలాంటి ఆధారాలు లేవన్నారు. ఈ మేరకు విజయవాడలో బుద్దా వెంకన్న మాట్లాడారు. స్కిల్ డెవలప్‌మెంట్ గురించి మాట్లాడే అర్హత సజ్జలకు లేదని మండిపడ్డారు.

## ప్రేమ కాదు.. విశాఖను దోచుకోవాలనే జగన్ వస్తున్నారు: అచ్చెన్న



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఓట్ల తొలగింపు, నకిలీ ఓట్లపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి తెదేపా నేతలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడి నేతృత్వంలోని నేతల బృందం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్ మీనాను కలిసి ఫిర్యాదు చేసింది. ఈ సందర్భంగా అచ్చెన్న మాట్లాడుతూ.. "అక్రమాలు చేసి ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారు. ప్రతిపక్షాల ఓట్లన్నీ తొలగించేందుకు కుట్ర చేస్తున్నారు. ఇందుకోసం సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థను వినియోగించుకుంటున్నారు. తెదేపా సానుభూతిపరుల ఓట్లు తొలగించేందుకు కుట్ర చేస్తున్నారు. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరాం. మేం ఇచ్చిన ఫిర్యాదుపై విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు" అని తెలిపారు. మరోవైపు తమ అధినేత చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేశారని అచ్చెన్న ఆరోపించారు. "ఇంత వరకు ఆయనకు వ్యతిరేకంగా ఒక్క ఆధారమూ చూపలేకపోయారు.

వైకాపా ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. చంద్రబాబు అరెస్టులో తమ ప్రమేయం లేదని కేంద్ర మంత్రి అమిత్ షా చెప్పారు. జగన్‌కు ఉత్తరాంధ్రపై ప్రేమ కాదు.. విశాఖను దోచుకోవడానికే వస్తున్నారు. ఉత్తరాంధ్రలో ఏనాడైనా పరిశ్రమలు తీసుకొచ్చారా? ఉత్తరాంధ్రలో ఒక్క నీటి ప్రాజెక్టు అయినా పూర్తి చేశారా?" అని ధ్వజమెత్తారు.

## 'జగనన్న ఆరోగ్య సురక్ష'తో ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం

### గుంటూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి విడదల రజిని



గుంటూరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందుతోందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని అన్నారు. గుంటూరులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మంత్రి రజిని పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య సేవలు పొందేందుకు వచ్చిన ప్రజలతో మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులు నిర్వహిస్తున్నామని, పేద ప్రజల గడప ముందుకే వైద్య సేవలు తీసుకువచ్చామన్నారు. మెరుగైన వైద్యం కోసం రిఫరల్ ఆస్పత్రులకు తరలిస్తున్నామని చెప్పారు. గిరిజన ప్రాంతాలు, మారుమూల గ్రామాల్లో ఈ కార్యక్రమం ఎలా అమలవుతుందో నిరంతరం పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వంలో చాలీచాలని మౌలిక సదుపాయాలతో నిరుపేదలకు వైద్యం అందేది కాదన్నారు. వైయస్ జగన్ ప్రభుత్వంలో గవర్నమెంట్ ఆస్పత్రుల రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని, మెరుగైన వైద్యం అందరికీ అందుబాటులోకి వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్ ప్రజలందరికీ ఆరోగ్య భరోసా కల్పించారని చెప్పారు.

## నవరాత్రి బ్రహ్మోత్సవాలకు టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు




తిరుమల: తిరుమల నవరాత్రి బ్రహ్మోత్సవాలకు టీటీడీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఇక, అక్టోబరు 15 నుంచి 23వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నవరాత్రి బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నట్లు టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు.

అక్టోబరు 14వ తేదీ అంకురార్పణంతో ప్రారంభం కానున్న ఈ ఉత్సవాలకు టీటీడిలోని అన్ని విభాగాలు సమన్వయంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టింది.

**ప్రత్యేక దర్శనాలు రద్దు..** నవరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ప్రత్యేక దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. అక్టోబరు 19న గరుడసేవ, 20న పుష్పక విమానం, 22న స్వర్ణరథం, అక్టోబర్ 23న చక్రస్నానం. అక్టోబర్ 19న గరుడసేవ సందర్భంగా ఆ రోజు ద్విచక్ర వాహనాలను అనుమతి లేదు. 3,500 మంది పోలీసులు, 1500 విజిలెన్స్ సిబ్బందితో బందోబస్తు. గడ్డ వాహనానికి అదనపు భద్రత. భక్తులందరికి గరుడోత్సవం దర్శనానికి టీటీడీ ప్రత్యేక కార్యాచరణ. రెండు లక్షలమంది గ్యాలరీలో వాహనా సేవలు వీక్షించేలా చర్యలు. నవరాత్రి బ్రహ్మోత్సవాలలో ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 10 గంటలు వరకు, రాత్రి 7 గంటల నుండి 9 గంటల వరకు వాహన సేవలు ఊరేగింపు. నవరాత్రి బ్రహ్మోత్సవాలలో రథోత్సవానికి బదులుగా బంగారు తేరు. ధ్వజారోహణ ఉండదు.

**సర్వ దర్శనానికి 8 గంటలు..** ఇదిలా ఉండగా.. తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. నేడు తిరుమల శ్రీవారి సర్వదర్శనం కోసం భక్తులు 12 ?కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్నారు.

సర్వదర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. నిన్న స్వామివారిని 72,230 మంది భక్తులు దర్శించుకున్నారు. నిన్న స్వామి వారికి తలనీలాలు సమర్పించిన భక్తులు సంఖ్య 27,388. బుధవారం స్వామి వారి హుండీ అధాయం 3.74 కోట్లుగా ఉంది.

## అందంతో టెంపరేచర్ పెంచేస్తోన్న గాయత్రి

నార్త్ ఇండియా నుంచి చాలా మంది ముద్దుగుమ్మ హీరోయిన్స్ గా అడుగుపెడుతూ ఉంటారు. వీరిలో సక్సెస్ అందుకునేది కొంతమందే. మోడలింగ్ తో కెరియర్ స్టార్ట్ చేసి తరువాత హీరోయిన్స్ గా సిల్వర్ స్క్రీన్ పై తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటూ ఉంటారు. ఇప్పుడు మాస్ మహారాజ్ రవితేజ టైగర్ నాగేశ్వరరావు చిత్రంతో ఇద్దరు బాలీవుడ్ ముద్దుగుమ్మలో తెలుగులోకి అడుగుపెడుతున్నారు. అందులో ఒకరు కృతి సనన్ చెల్లెలు నుపూర్ సనన్ ఒకరు. ఇప్పటికే ఈ బ్యూటీ సింగర్ గా, యాక్టర్ గా బాలీవుడ్ లో సక్సెస్ అయ్యే ప్రయత్నం చేస్తోంది. టైగర్ నాగేశ్వరరావుతో తెలుగులోకి ఎంట్రీ ఇస్తోంది. మరో హాట్ బ్యూటీ గాయత్రి భరద్వాజ్ ఈ చిత్రంలో సెకండ్ లీడ్ హీరోయిన్ గా ఎంట్రీ ఇస్తోంది. హిందీలో ఇట్టు సై బాత్ సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. మూడు వెబ్ సిరీస్ లలో కూడా ఈ బ్యూటీ నటించింది. దాంతో పాటు మ్యూజిక్ వీడియోలలో కూడా కనిపించింది. ఇప్పుడు టైగర్ నాగేశ్వరరావుతో తెలుగులోకి డెబ్యూ



చేస్తోంది. నిజానికి పూరి జగన్నాథ్ తనయుడు ఆకాష్ పూరి హీరోగా తెరకెక్కిన రొమాంటిక్ మూవీతోనే ఈమె హీరోయిన్ గా ఇంటరి ఇవ్వాల్సి ఉంది. అయితే ఎందుకనో కొంత షూట్ చేసిన తర్వాత గాయత్రి స్థానంలో కేతిక శర్మ వచ్చి చేరింది. అయితే టైగర్ నాగేశ్వరరావుతో సినిమాపై ఈ అమ్మడు చాలా హోప్స్ పెట్టుకుంది. సినిమాలతో పెద్దగా పాపులారిటీ రాకున్న సోషల్ మీడియాలో గ్లామర్ షోతో గాయత్రి భరద్వాజ్ మంచి ఇమేజ్ సొంతం చేసుకుంది. హాట్ హాట్ అందాలతో ఏ మాత్రం తగ్గకుండా ఫోటోషూట్ లతో సందడి చేస్తూ ఉంటుంది. ఈ ఫోటోలు విపరీతంగా వైరల్ అవుతాయి. తాజాగా టైగర్ నాగేశ్వరరావు ప్రమోషన్స్ లో కూడా ఫుల్ హాట్ షోతో గాయత్రి గ్లామర్ గా కనిపించింది. ఎద అందాలతో ఈ అమ్మడు కుర్రాళ్ళకి హీట్ పెంచేస్తోంది. సుతిమెత్తని నవ్వుతో అబ్బాయిలని యిట్టె ఎట్రాక్ట్ చేస్తోంది. ఈ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. టైగర్ నాగేశ్వరరావు మూవీ సక్సెస్ అయితే గాయత్రి రూపంలో మరో హాట్ హీరోయిన్ టాలీవుడ్ కి దొరికినట్లే.

## లియో హాలీవుడ్ కనెక్షన్ ఓ క్లారిటీ వచ్చేసింది

ఇళయదళపతి విజయ్ హీరోగా లోకేష్ కనగరాజ్ దర్శకత్వంలో తెరకెక్కి ప్రేక్షకుల ముందుకి రాబోతున్న చిత్రం లియో. ఈ సినిమా ట్రైలర్ తాజాగా రిలీజ్ అయ్యింది. సినిమాపైన దేశ వ్యాప్తంగా భారీ హైప్ క్రియేట్ అయ్యింది. విజయ్ కెరియర్ లోనే హైయెస్ట్ బిజినెస్ లియో చిత్రంపై జరగడం విశేషం. ఏకంగా 500 కోట్ల వరకు నిర్మాతకి రిలీజ్ కి ముందే నాన్ థీయాట్రికల్, థీయాట్రికల్ రైట్స్ ద్వారా వచ్చేశాయి. టేబుల్ ప్రాఫిట్ తో థియేటర్స్ లోకి వస్తోన్న ఈ సినిమాపై పాజిటివ్ బజ్ ఉన్న నేపథ్యంలో కచ్చితంగా మొదటి రోజు మంచి వసూళ్లు అందుకునే అవకాశం కనిపిస్తోంది. త్రిష ఈ చిత్రంలో విజయ్ కి జోడీగా నటించింది. సంజయ్ దత్, అర్జున్ సర్జా ప్రతినాయకులుగా కనిపిస్తున్నారు. ఇదిలా ఉంటే ఈ సినిమా గురించి కొద్ది రోజులుగా ఒక ప్రచారం సోషల్ మీడియాలో నడుస్తోంది. ది హిస్టరీ ఆఫ్ వైలెన్స్ అనే మూవీని కాపీ కొట్టి లియో



సినిమా చేసాడని విస్తృతంగా చర్చించుకుంటున్నారు. అందులోనే స్టోరీలైన్ తో పాటు చాలా సన్నివేశాలు లేపెసాడని విమర్శలు చేస్తున్నారు. రీమేక్ కథని ఏదో ఒరిజినల్ అన్నట్లు కలరింగ్ ఇస్తున్నాడు అంటూ విజయ్ యాంటీ ఫ్యాన్స్ అయితే ట్రోల్ చేస్తున్నారు. దీనిపై తాజాగా లియో చిత్రంలో విలన్ గ్యాంగ్ లో నటించిన యాక్టర్ ఆత్మ పాట్రిక్ స్పందించాడు. లియో మూవీ ది హిస్టరీ ఆఫ్ వైలెన్స్ కి రీమేక్ అని కన్ఫర్మ్ చేశాడు. ఆ సినిమా హక్కులని లోకేష్ కొనుగోలు చేసి అధికారికంగానే రీమేక్ చేస్తున్నారని అన్నారు. అయితే మాతృకలో ఉండే మెయిన్ కథని తీసుకున్న లియో మూవీలో కంప్లీట్ గా లోకేష్ కనగరాజ్ ఇమాజినేషన్ ఉంటుందని అన్నారు. అతని విజయ్, విజువల్ ప్రెజెంటేషన్ లియో సినిమాకి అదనపు ఆకర్షణ అని అన్నారు. లియో చిత్రంలో విజయ్ ని బెల్ట్ తో చంపే సన్నివేశం కాశ్మీర్ లో షూట్ చేస్తున్నప్పుడు అక్కడి చలికి తట్టుకోలేకపోయానని, భాగా వణికిపోవడం విజయ్ వచ్చి తనని గట్టిగా పట్టుకున్నారని పాట్రిక్ తెలిపారు. ఈ నటుడి ద్వారా ది హిస్టరీ ఆఫ్ వైలెన్స్ సినిమాకి రీమేక్ గానే లియో సినిమా తెరకెక్కింది అని కన్ఫర్మ్ అయిపోయింది.




## ఆ విషయంలో బాలయ్య ముందడుగు వేశారు



సీనియర్స్ నిజం తెలుసుకున్నారా?. వయసుకు తగ్గ పాత్రల్లో నటించడానికి రెడీ అవుతున్నారా? అంటే తాజా పరిణామాలు చూస్తుంటే అవునని తెలుస్తోంది. అంతే కాకుండా ఇటీవల విడుదలై బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్లుగా నిలిచిన సినిమాలు కమల్ 'విక్రమ్', రజనీకాంత్ 'జైలర్', షారుక్ ఖాన్ 'జవాన్' ఇదే విషయాన్ని ప్రూవ్ చేశాయి కూడా. ఇంతకీ సీనియర్స్ తెలుసుకున్న నిజం ఏంటీ?.. ఈ విషయంలో టాలీవుడ్ అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ ముందడుగు ఎలా వేశారు? ఆ కథా కమామీషు ఏంటన్నది ఓ లుక్కేద్దాం. యూనివర్సల్ స్టార్ కమల్ హాసన్ వయసుకు తగ్గ పాత్రతో ముందకొచ్చి ప్రేక్షకుల ఆశ్చర్యపరిచారు. అప్పటి వరకు హీరోయిన్‌లతో డ్యాన్స్‌లు చేస్తూ 35, 40 ఏళ్ల హీరోగా కనిపించిన కమల్ 'విక్రమ్' సినిమాలో మాత్రం తొలి సారి తన వయసుకు తగ్గ పాత్రలో నటించి ఆకట్టుకున్నారు. తండ్రిగా, తనయుడిని హత్య చేసిన వారిపై పగతీర్చుకునే తండ్రిగా, ప్రత్యర్థుల నుంచి మనవడిని కాపాడుకునే తాతయ్యగా కమల్ కనిపించిన తీరు ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకోవడంతో 'విక్రమ్' బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలచి మళ్లీ సక్సెస్ ట్రాక్‌లోకి తీసుకొచ్చింది. ఇదే తరహాలో సూపర్ స్టార్ రజనీకాంత్ కూడా ట్రై చేశారు. సక్సెస్ అందుకున్నారు. రజనీ అంటే ఓ స్టైల్. పూనకాలు తెచ్చించే మబాస్‌మేనియా. అయితే ఆయన గత కొంత కాలంగా తన మార్కు సక్సెస్‌ని సొంతం చేసుకోలేకపోయారు. ఆ లోటుని తీరుస్తూ రజనీ చేసిన సినిమా 'జైలర్'. అప్పటి వరకు యంగ్ హీరోగా కనిపించిన రజనీ ఈ సినిమాలో మాత్రం వయసుకు తగ్గ పాత్రలో తండ్రిగా, తాతగా కనిపించి ఆకట్టుకున్నారు. దీంతో 'జైలర్' బాక్సాఫీస్ వద్ద కాసులు వర్షం కురిపించింది. రజనీకి తిరుగులేని విజయాన్ని అందించింది. ఇప్పుడు ఇదే పంథాని టాలీవుడ్ అగ్ర కథానాయకుడు నందమూరి బాలకృష్ణ ఫాలో అవుతున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే తెలుగు సీనియర్ హీరోల్లో ఈ విషయంలో బాలయ్య ముందడుగు వేశారని చెప్పొచ్చు. నందమూరి బాలకృష్ణ నటించిన తాజా చిత్రం 'భగవంత్ కేసరి'. అనిల్ రావిపూడి రూపొందించిన ఈ మూవీలో బాలయ్య తన వయసుకు తగ్గ పాత్రలో నటించారు. శ్రీలీలకు బాబాయ్‌గా కనిపించి తన వయసుకు తగ్గ పాత్రని పోషించారు. రీసెంట్‌గా విడుదల చేసిన టీజర్, ట్రైలర్‌లలోనే దీన్నే ప్రధానంగా చూపించారు. పరిణతి గల తండ్రిగా, తన కూతురు వ్యవస్థలో ధైర్యంగా నిలబడాలని తపించే చిచ్చాగా బాలయ్య పాత్రని దర్శకుడు అనిల్ రావిపూడి ఇందులో మలిచారు. దీంతో 'భగవంత్ కేసరి' టాలీవుడ్‌లో టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. అభిమానుల్లోనూ ఈ సినిమాపై సరికొత్త చర్చ మొదలైంది. అంతే కాకుండా బాలయ్య తొలి సారి తండ్రి పాత్రలో నటించడంతో టాలీవుడ్ లో కొత్త చర్చకు తెర తీసింది. అక్టోబర్ 19న విడుదలవుతున్న ఈ సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అయితే ఇదే తరహా సినిమాలకు మరిన్ని రావడం మొదల్యే ట్రెండ్ స్టార్టవుతుంది.

## కోలాలు పాన్ మసాలాలు వదిలిపెట్టరా?



గుట్కాలు, పాన్ మసాలాలతో నోటి క్యాన్సర్ ప్రమాద తీవ్రత గురించి థియేటర్లలో ప్రతిరోజూ ముఖేష్ ప్రకటన చూస్తూనే ఉన్నాం. అవి నిషిద్ధమైనవి, ప్రమాదకరమైనవి అని తెలిసీ సామాన్య ప్రజలు వాటికి అడిక్ట్ అవుతున్నారు. మార్కెట్లో ఇబ్బడిముబ్బడిగా దొరికే నాటు రకం మసాలా ప్యాకెట్లు ప్రజల జేబుకు చిల్లు పెట్టడమే కాకుండా జీవితాలను నాశనం చేస్తున్నాయి. అయితే అలాంటి ఒక మసాలా ప్రకటనలో నటించిన ఖిలాడీ అక్షయ్ కుమార్ కి బాధ్యత లేదంటూ నెటిజనులు తీవ్రంగా ట్రోల్ చేస్తున్నారు. ప్రజల్ని గొప్పగా ప్రభావితం చేసే సెలబ్రిటీగా బాధ్యత గురించి ప్రశ్నిస్తూ నెటిజనులు చెలరేగుతున్నారు. దీంతో అతడు (అక్షయ్) దిగొచ్చి పాన్ మసాలాకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఇకపై సంతకం చేయనని వాగ్దానం చేశాడు. అంతేకాదు పాన్ మసాలా ప్రకటనలో నటించినందుకు అక్షయ్ కుమార్ క్షమాపణలు చెప్పాడు. తాను ఇకపై పాన్ మసాలాకు బ్రాండింగ్ చేయనని ప్రతిజ్ఞ చేశాడు. ప్రస్తుతం జరుగుతున్న ప్రపంచ కప్‌లో క్రికెట్ మ్యాచ్ సందర్భంగా అక్షయ్, అజయ్ దేవగన్, షారుఖ్‌లతో కూడిన వాణిజ్య ప్రకటన కనిపించింది. ఇది క్షణాల్లో వైరల్ కావడంతో అందులో నటించిన స్టార్లను ట్రోలింగ్ సెగ తాకింది. డబ్బు కోసమేనా ఇదంతా చేస్తారు? అంటూ ప్రజలు స్టార్లను నిలదీసారు. డబ్బు కోసం తన మాట మరచిపోయారా? అని అక్షయ్ ని ప్రజలు ప్రశ్నించారు. అయితే సోషల్ మీడియాల్లో ఇది పెద్ద డిబేట్ గా మారడంతో వెంటనే అక్షయ్ కుమార్ పరిస్థితిని అందరికీ వివరిస్తూ అసలు విషయం చెప్పాడు. ప్రస్తుతం వైరల్ అవుతున్న ఆ పాన్ మసాలా ప్రకటన 2021 అక్టోబర్‌లో చిత్రీకరించినది అని దాని విషయంలో తాను ఏమీ చేయలేనని ఈ నెలాఖరు వరకు దానిని ప్రసారం చేసే హక్కు ప్రకటన కర్తలకు ఉందని వెల్లడించారు. అంతేకాదు ప్రజలకు హాని కలిగించే పాన్‌మసాలా ఎండార్స్‌ని వదిలేస్తానని కూడా అక్షయ్ వ్యాఖ్యానించారు. గతంలో షూట్ చేసిన ప్రకటన విషయంలో తాను ఏమీ చేయలేనని అక్షయ్ కుమార్ నొక్కి చెప్పారు. ఏది ఏమైనా కానీ అక్షయ్ ట్రోలర్లను శాంతపరిచే ఒక మంచి మాట చెప్పాడు. ఇకపై స్టార్లు పాన్ మాసాలాలు గుట్కాలు, కోలాలు, బెట్టింగ్, ఆన్ లైన్ జూదం వంటి ప్రకటనల్లో నటించకూడదని ప్రజలు కోరుకుంటున్నారు. ఖిలాడీ అక్షయ్ కుమార్ నటించిన 'మిషన్ రాణిగంజ్' తన కెరీర్ లో పెద్ద ఫ్లాప్ గా మారిందని ట్రేడ్ చెబుతోంది. ఈ సినిమా ట్రైలర్ దశలో ఆకట్టుకున్నా కానీ జనాల్ని థియేటర్లకు రప్పించడంలో విఫలమైంది. దీనికంటే అక్షయ్ నటించిన ఓమైగాడ్ సీక్వెల్ పెద్ద విజయం సాధించింది.

## కాజల్ న్యూ షూట్..కాక పుట్టిస్తోంది!

చందమామ కాజల్ అగర్వాల్ కొన్ని నెలలుగా షూటింగ్ లతోనే బిజీగా గడుపుతుంది. హైదరాబాద్ ..ముంబై ..చెన్నై అంటూ రౌండ్లు వేస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ షూటింగ్..అవసరం అనుకుంటే నైట్ షూట్లకు తప్పనిసరిగా హాజరు కావాల్సి వస్తోంది. దీంతో ఇన్ స్టాకి సైతం సమయం కేటాయించలేని పరిస్థితి తలెత్తింది. ఈ నేపథ్యంలో కాజల్ కొత్త ఫోటోలేవి ఈ మధ్య సోషల్ మీడియాలో పెద్దగా కనిపించ లేదు. తాజాగా 'భగవంత్ కేసరి' ప్రచారంలో భాగంగా అమ్మడికి కాస్త సమయం దొరికిన ట్లుంది.అందుకే ఇలా ఫోటో షూట్ లో బిజీ అయింది. ఇదిగో ఇక్కడిలా నలుపు రంగు డిజైన్ దుస్తులోకి దూరిపోయింది. అందంగా మ్యాకప్ వేసుకుని..కళ్లకు అద్దాలు ధరించి వావ్ అనిపించే భంగిమల్లో కెమారాకి



ఫోజులిచ్చింది. ఇందులో అమ్మడు థై షో ప్రత్యేక ఆకర్షణ. తొడ అందాలు హైలైట్ అయ్యేలా ఓ డిజైన్..స్టైలిష్ గా ఫోకస్ అయ్యేలా మరో డిజైన్ దుస్తుల్ని ధరించింది. రెండు కామన్ బ్లాక్. డిజైన్ వేరైనా రంగు ఒక్కటే. వైడ్ యాంగిల్ లోనూ అమ్మడు ఇచ్చిన ఫోజులు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం ఈఫోటోలు అంతర్జాలంలో వైరల్ గా మారాయి. చాలా గ్యాప్ తర్వాత నెట్టింట వైరల్ అవ్వడంతో చందమామ అభిమానులు చూసి తరిస్తున్నారు. వయసు పెరిగినా..ఓ బిడ్డకు తల్లైనా చందమామ అందం ఏమాత్రం తగిరిపోలేదు. ఇప్పటికే అదే లుక్ మెయింటెన్ చేస్తుంది. పిల్లల్ని కన్నా! సినిమాలకు అదేం అడ్డు కాదని కాజల్ నిరూపించింది. ఒకప్పుడు పెళ్లైన హీరోయిన్లకు అవకాశాలు వచ్చేవి కాదు. ఇప్పుడా మాట సహా బిడ్డలకు తల్లులైనా అవాకాశాలు వాకిట ముందు క్యూ కడుతున్నాయి. అందుకే కాజల్ అగర్వాల్..అనుష్క శర్మ...కరీనా కపూర్ లాంటి నటీమణులు ఇంకా మ్యాకప్ వేసుకోగల్గుతున్నారు.

## కళాత్మక చిత్రాల దర్శకుడు భన్సాలీతో నయనతార!

సౌతిండియా సూపర్ స్టార్ గా గుర్తింపు పొందిన నయనతార ఇటీవలే బాలీవుడ్ లో 'జవాన్' చిత్రంలో నటించిన సంగతి తెలిసిందే. కెరీర్ ఆరంగేట్రమే 1000 కోట్ల క్లబ్ సినిమాలో నటించి సత్తా చాటింది. ఈ చిత్రంలో నయన్ పోలీసాఫీసర్ పాత్రలో కనిపించింది. పోరాట సన్నివేశాల్లో మెప్పించింది. ఇప్పుడు హిందీ చిత్రసీమలో మరో క్రేజీ ప్రాజెక్టుకి నయన్ సంతకం చేయనుందని తెలిసింది. ప్రముఖ జాతీయ మీడియా కథనం ప్రకారం.. నయనతార తదుపరి దేశం దృష్టిని తనవైపునకు తిప్పుకునే స్థాయి ఉన్న కళాత్మక చిత్రంలో నటించే అవకాశం ఉంది. బాలీవుడ్‌లో తన రెండో సినిమా కోసం ఇప్పటికే చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. కళాత్మక చిత్రాల దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ తెరకెక్కించనున్న మ్యూజికల్ పీరియడ్ డ్రామా 'బైజు బావ్రా'లో నయన్ కీలక పాత్ర పోషించే అవకాశం ఉ ందనేది తాజా సమాచారం. బాలీవుడ్ స్టార్ రణవీర్ సింగ్ టైటిల్ రోల్ బైజు బావ్రాగా నటించనుండగా, ఈ మ్యూజికల్ పీరియడ్ డ్రామాలో జాతీయ అవార్డు గ్రహీత అలియా భట్ కథానాయికగా నటించనుంది. ఆలియా పాత్రకు ధీటుగా ఆకర్షించే ఓ కీలక పాత్ర



కోసం నయన్ ని సంప్రదించారనేది గుసగుస. రణవీర్-అలియా జంటగా నటించే ఈ చిత్రంలో నయన్ పాత్ర ఎలా ఉంటుంది? అన్నదానిపై ఎలాంటి అప్ డేట్ లేదు. బైజు బావ్రా దర్శకనిర్మాతలు ఇప్పటికే నయన్ ని సంప్రదించారని మాత్రమే తెలుసు. ఇరువైపులా ప్రస్తుతం నిబంధనలు షరతులపై ఆలోచిస్తున్నారు. నయనతార - విఘ్నేష్ శివన్ 2023 మార్చిలో సంజయ్ లీలా భన్సాలీని కలిసి ఒక సినిమా కోసం చర్చించారని కథనాలొచ్చాయి. అది బైజు బావ్రా కోసమేనని ఇప్పుడు అర్థమవుతోంది. తాజా పరిణామంతో రణవీర్ సింగ్ - అలియా భట్‌లతో పాటు బైజు బావ్రా లో నయన్ నటించేందుకు మెజారిటీ అవకాశాలున్నాయని భావించాలి. బైజు బావ్రా కథాంశం కాలాదులు ఆసక్తికరం. 1950ల నాటి హిందుస్థానీ శాస్త్రీయ సంగీత కళాకారుని నిజ జీవితంపై సినిమా ఇది. ఇందులో రణవీర్ సింగ్ టైటిల్ రోల్‌లో నటిస్తారు. సంజయ్ లీలా భన్సాలీతో రణవీర్ కి ఇది నాలుగో సినిమా. గల్లీ బాయ్ -రాకీ ఔర్ రాణి కి ప్రేమ్ కహానీ తర్వాత అలియా భట్ ఈ చిత్రంలో కథానాయికగా నటిస్తోంది. దీంతో ఈ జంట మూడోసారి కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ప్రాజెక్ట్ 2024 ప్రథమార్థంలో సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉంది.




# కారును పోలిన గుర్తులపై ఢిల్లీ కోర్టులో పిటిషన్.. ఇంతలోనే వెనక్కి తీసుకొని బీఆర్ఎస్ కీలక నిర్ణయం

ఢిల్లీ: తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వచ్చేసింది. నవంబర్-30న పోలింగ్ జరగనుంది. అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు వ్యూహ ప్రతివ్యూహాలు రచిస్తున్నాయి. ఇప్పటికే మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు రాష్ట్ర వ్యాప్తంగా సుడిగాలి పర్యటనలు చేసేశారు. త్వరలోనే సీఎం కేసీఆర్ కూడా రంగంలోకి దిగనున్నారు. ముచ్చటగా మూడోసారి హ్యాట్రిక్ కొట్టాలని అధికార బీఆర్ఎస్ పార్టీ మేథోమథనం చేస్తోంది. మరోవైపు.. ఎట్టి పరిస్థితుల్లో బీఆర్ఎస్ గెలవకూడదని కాంగ్రెస్, బీజేపీ చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తున్నాయి.

**మొదట అలా..!** ఇదిలా ఉంటే గత ఎన్నికల్లో కారును పోలిన గుర్తులు కారణంగా కొన్ని చోట్ల బీఆర్ఎస్ పార్టీకి నష్టం జరిగింది. ఈసారి అలా జరగకూడదని ఆ పార్టీ భావిస్తోంది. అందుకే కారును పోలిన గుర్తులు తొలగించాలంటూ ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘాన్ని బీఆర్ఎస్ నాయకులు కలిసి విజ్ఞప్తి చేశారు. కానీ సానుకూలమైన ఫలితం రాకపోవడంతో ఇవాళ ఉదయం ఇదే అంశంపై ఢిల్లీ హైకోర్టును ఆ పార్టీ నేతలు ఆశ్రయించారు. కారును పోలి ఉన్న గుర్తులను ఏ పార్టీకీ కేటాయించొద్దంటూ బీఆర్ఎస్ రిట్ పిటిషన్ దాఖలు చేసింది. మరొక పార్టీకి కేటాయించడం వల్ల తమ పార్టీకి నష్టం జరుగుతోందని రిట్ పిటిషన్‌లో గులాబీ పార్టీ పేర్కొంది. బీఆర్ఎస్ తరపున న్యాయవాది మోహిత్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఢిల్లీ హైకోర్టు విచారణ చేపట్టే లోపే బీఆర్ఎస్ ఆ పిటిషన్‌ను వెనక్కి తీసుకుంది.

**గంటల వ్యవధిలోనే ఇలా..!** అలా ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేయడం.. మళ్లీ వెనక్కి తీసుకోవడం ఇవన్నీ గంటల వ్యవధిలోనే జరిగిపోయాయి. తాజాగా ఇదే అంశంపై సుప్రీంకోర్టును ఆశ్రయించాలని భావిస్తోంది. మరికాసేపట్లో సర్వోన్నత న్యాయస్థానాన్ని బీఆర్ఎస్ ఆశ్రయించనుంది. కారును పోలిన గుర్తులను ఎన్నికల కమిషన్ తొలగించాలే ఆదేశాలు ఇవ్వాలంటూ భారత రాష్ట్ర సమితి ధర్మాసనాన్ని ఆశ్రయించనుంది. ధర్మాసనం ఎలా రియాక్ట్ అవుతుంది..? కారు పార్టీకి అనుకూలంగా తీర్పు ఉంటుందా..? లేకుంటే పరిస్థితి ఎలా ఉంటుందా అనేదానిపై సర్వత్రా ఆసక్తి, అంతకుమించి ఉత్కంఠ బీఆర్ఎస్‌లో నెలకొంది.

# సీఎం కేసీఆర్ వల్లే ప్రతి ఇంటికీ వాటర్ కనెక్షన్ సాధ్యమైంది: కేటీఆర్

హైదరాబాద్: స్వతంత్ర భారతదేశంలో ప్రతి ఇంటికి తాగు నీటి కనెక్షన్‌ను అందించేందుకు "మిషన్ భగీరథ" పథకాన్ని తీసుకొచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ అని మంత్రి కేటీఆర్ తెలిపారు. దేశంలో ప్రతి ఇంటికి వాటర్ కనెక్షన్ ఇచ్చిన రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల జాబితాను ది ఇండియన్ ఇండెక్స్ అనే సంస్థ ట్వీట్ చేసింది. ఆ జాబితాలో తెలంగాణ మొదటి స్థానంలో ఉంది. దీనిపై స్పందించిన కేటీఆర్.. తెలంగాణ అగ్రస్థానంలో ఉండటంపై హర్షం వ్యక్తం చేస్తూ రీట్వీట్ చేశారు. విజన్ ఉన్న కేసీఆర్ తెలంగాణకు ముఖ్యమంత్రిగా ఉండటం వల్లే ఇది సాధ్యమైందని కేటీఆర్ అన్నారు. ఈ పథకం తెలంగాణలో విజయవంతమైన తర్వాతే కేంద్ర ప్రభుత్వం 'హర్ ఘర్ జల్' అనే కార్యక్రమాన్ని తీసుకొచ్చిందన్నారు. ఇవాళ తెలంగాణ ఏది చేస్తే మిగిలిన రాష్ట్రాలు అనుసరిస్తున్నాయని కేటీఆర్ వెల్లడించారు.






హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా 119 నియోజకవర్గాల్లో పోటీ చేయాలని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్రస్థాయి కార్యవర్గ సమావేశంలో ఆ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల నిర్ణయించారు. పాలేరు నియోజకవర్గం నుంచి షర్మిల బరిలోకి దిగనున్నారు. పార్టీ బీఫామ్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని నేతలకు షర్మిల సూచించారు. " పాలేరుతోపాటు మరోచోట పోటీ చేయాలనే డిమాండ్ ఉంది. అనిల్, విజయమ్మను కూడా పోటీ చేయించాలని డిమాండ్ ఉంది. అవసరమైతే వారిద్దరూ పోటీ చేస్తారు. కాంగ్రెస్‌తో కలిసి వెళ్తే ప్రజా వ్యతిరేక ఓటు చీలదు అనుకున్నాం. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిస్తే కేసీఅర్ మళ్ళీ ముఖ్యమంత్రి అవుతారేమో అనుకున్నాం. అందుకే కాంగ్రెస్‌తో చర్చలు జరిపాం. 4 నెలలు ఎదురు చూశాం. రాష్ట్రంలో మళ్ళీ వైఎస్సార్ సంక్షేమ పాలన తీసుకువస్తాం" అని షర్మిల తెలిపారు.

# మేడ్చల్ బీజేపీ అభ్యర్థిగా ఈటల జమున?



హైదరాబాద్: మొదటి నుంచీ ఈటల కుటుంబానికి మేడ్చల్ నియోజకవర్గానికి సమీప సంబంధాలు ఉండటంతో ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తరఫున మేడ్చల్ నుంచి హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సతీమణి జమునను రంగంలోకి దించేందుకు ఆ పార్టీ అధిష్టానం వ్యూహాలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ఈటల రాజేందర్ మేడ్చల్ మండల పరిధిలోని పూడూర్ దగ్గర ఔటర్ రింగు రోడ్డు సమీపంలో నివాసముంటున్నారు. ఆయన గోదాంలు, గతంలో పౌల్ట్రీలు, ఇతర వ్యాపారాలు నియోజకవర్గ పరిధిలోనే ఉండటంతో వారి కుటుంబానికి మేడ్చల్‌కు చాలా రోజులుగా సత్సంబంధాలు ఉన్నాయి. జమున నివాసం పూడూర్ పరిధిలో ఉండటంతో పాటు స్థానిక నాయకులతో పరిచయాలు ఉన్నాయి. ఈటలకు అర్థ బలం పరిపుష్టిగా ఉండటం, టికెట్ ఆశిస్తున్న మిగతావారికి ఆ బలం లేకపోవడం, రాజేందర్ బీసీ అయినా జమున రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారు కావడం, ఆ సామాజికవర్గ పెత్తనం మేడ్చల్‌లో ఎక్కువగా ఉండటంతో ఆమె అభ్యర్థి త్వం తమకు కలిసి వస్తుందని బీజేపీ అధిష్టానం ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం. ఈ మేరకు బీజేపీ మేడ్చల్ టికెట్ తన భార్య జమునకు కేటా యించాలని ఎమ్మెల్యే ఈటల రాజెందర్ అధిష్టానా న్ని కోరినట్లు ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.

# హైదరాబాద్ ఇన్‌చార్జి సీపీగా విక్రమ్‌సింగ్ మాన్

హైదరాబాద్: హైదరాబాద్ ఇన్‌చార్జి పోలీస్ కమిషనర్‌గా విక్రమ్‌సింగ్ మాన్ నియమితులయ్యారు. వచ్చే నెలలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న ఐదు రాష్ట్రాల్లో సీనియర్ అధికారులను కేంద్ర ఎన్నికల కమిషన్ బదిలీ చేసింది. బదిలీ అయినవారిలో తొమ్మిది మంది జిల్లా కలెక్టర్లు, 25 మంది పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు, అదనపు ఎస్పీలు ఉన్నారు. ఇందులో తెలంగాణలో రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, నిర్మల్ జిల్లాల కలెక్టర్లతోపాటు 13 మంది పోలీసు అధికారులు ఉన్నారు. వీరి స్థానంలో కొత్తవారిని నియమించాలని, రి స్థానాల్లో ఇతర అధికారుల నియామకం కోసం ఒక్కో పోస్టుకు ముగ్గురు చొప్పన అధికారుల పేర్లతో అవసరమైన జాబితాను అందించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో బదిలీ అయినవారి స్థానంలో ఇన్‌చార్జిలను నియమిస్తూ డీజీపీ అంజనీ కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. హైదరాబాద్ సీపీగా విక్రమ్‌సింగ్ మాన్, వరంగల్ సీపీగా డీ.మురళీధర్, నిజామాబాద్ సీపీగా ఎస్.జయరాంను నియమించారు. సూర్యాపేట ఎస్పీగా ఎం.నాగేశ్వర్‌రావు, సంగారెడ్డి ఎస్పీగా పీ.అశోక్, కామారెడ్డి ఎస్పీగా కే.నరసింహారెడ్డి, జగిత్యాల ఎస్పీగా ఆర్.ప్రభాకర్‌రావు, మహబూబ్‌నగర్ ఎస్పీగా అందెరాములు, నాగర్‌కర్నూల్ ఎస్పీగా సీహెచ్.రామేశ్వర్, గద్వాల ఎస్పీగా ఎన్ వి, మహబూబాబాద్ ఎస్పీగా జే.చెన్నయ్య, నారాయణ్‌పేట ఎస్పీగా కే.సత్యనారాయణ, భూపాలపల్లి ఎస్పీగా ఏ.రాములును నియమించారు.

**ఎవరెవరు బదిలీ అయ్యారంటే..** తెలంగాణలో 20 మంది అధికారుల బదిలీ తెలంగాణలో మొత్తం 20 మంది అధికారులను ట్రాన్స్‌ఫర్ చేస్తూ ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీచేసింది. బదిలీ అయిన వారిలో 13 మంది పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు, నలుగురు కలెక్టర్లు, ముగ్గురు ఇతర శాఖల ఉన్నతాధికారులు ఉన్నారు. వీరిలో రవాణాశాఖ కార్యదర్శి శ్రీనివాసరాజు, ఎక్సైజ్ డైరెక్టర్ ముషారఫ్ అలీ, వాణిజ్య పన్నులశాఖ కమిషనర్ శ్రీదేవి ఉన్నారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ హరీశ్, మేడ్చల్ కలెక్టర్ అమోయ్‌కుమార్, యాదాద్రి కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, నిర్మల్ కలెక్టర్ వరుణ్‌రెడ్డితోపాటు హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్ పోలీస్ కమిషనర్లు సీవీ ఆనంద్, రంగనాథ సత్యనారాయణ.. సంగారెడ్డి, కామారెడ్డి, జగిత్యాల, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల్, మహబూబాబాద్, భూపాలపల్లి, నారాయణపేట, సూర్యాపేట ఎస్పీలు రమణకుమార్, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, కే నర్సింహ, మనోహర్, సృజన, చంద్రమోహన్, కరుణాకర్, వెంకటేశ్వర్లు, రాజేంద్రప్రసాద్‌ను బదిలీ చేసింది.




గుండ్ల సింగారం: హనుమకొండ జిల్లా గుండ్ల సింగారంలోని ఇంద్రా కాలనీలో దారుణం జరిగింది. ఆర్థిక లావాదేవీలు, కుటుంబ కలహాలతో అత్తను అల్లుడు కాల్చి చంపాడు. నిందితుడు కానిస్టేబుల్ ప్రసాద్ కోటపల్లి పీఎస్‌లో పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

రక్తపు మడుగులో ఉన్న మృతురాలు కమలమ్మను పోస్టుమార్టం నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఈ మేరకు ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.




తమ దేశంలోకి చొరబడి మారణహోమానికి పాల్పడిన హమాస్‌ను భూస్థాపితం చేసేందుకు ఇజ్రాయెల్ సిద్ధమైంది. హమాస్‌ను పురుగులా నలిపేస్తామని, దాని ఉనికే లేకుండా చేస్తామని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. మరోవైపు, ఇజ్రాయెల్ పౌరులపై హమాస్ పాల్పడిన అకృత్యాలు ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్నాయి. చిన్నారులు, మహిళల చేతులకు సంకెళ్లు వేసి మరీ కాల్చి చంపారు. ఆ దృశ్యాలు జాంబీ సినిమా సీన్లను తలపిస్తున్నాయంటే హమాస్ ఉగ్రవాదులు ఎంతటి నరమేధానికి పాల్పడ్డారో అర్థం చేసుకోవచ్చు..! గత శనివారం దేశంలోకి చొరబడిన హమాస్ ఉగ్రవాదులు.. ఇజ్రాయెల్ పౌరులపై భీకర దాడులు చేసిన విషయం తెలిసిందే. వందల మందిని బందీలుగా చేసుకుని వారిని అతి దారుణంగా చంపేశారని ఐడీఎఫ్ (ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్) ప్రకటించింది. "చిన్నారుల తలలు తెగనరికారు. మహిళలు, పిల్లల చేతికి సంకెళ్లు వేసి వారి నుదిటిపై కాల్పులు జరిపి చంపేశారు. ప్రతి హమాస్ మిలిటెంట్ ఇలాంటి ఘోరమైన అకృత్యానికి పాల్పడ్డాడని మేం నమ్మలేకపోయాం. కానీ, ప్రత్యక్ష సాక్షులు, అధికారులు ఆ దారుణాలను స్వయంగా చూసి చెప్పారు. చిన్నారుల తలలు నరికి చంపినట్లు మా వద్ద ఆధారాలున్నాయి. హమాస్ దాడులకు పాల్పడిన ప్రాంతాలకు ఇజ్రాయెల్ బలగాలు వెళ్లి చూస్తే అక్కడ జాంబీ సినిమాలాంటి భయానక దృశ్యాలు కన్పించాయి" ఐడీఎఫ్ అధికార ప్రతినిధి జొనాథన్ కాన్రికస్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం హమాస్ ఉగ్రవాదుల చెరలో దాదాపు 150 మంది ఇజ్రాయెల్, ఇతర దేశాల పౌరులు బందీలుగా ఉన్నట్లు సమాచారం.

**ప్రతి హమాస్ సభ్యుడు మూల్యం చెల్లించాల్సిందే: నెతన్యాహు –** మరోవైపు, హమాస్ ఉగ్రవాదులకు కేంద్రమైన గాజాలో దాడులు మరింత తీవ్రం చేసేందుకు ఇజ్రాయెల్ సర్కారు సిద్ధమైంది. ఇందుకోసం ప్రత్యేకంగా యుద్ధకాల అత్యవసర సమైక్య ప్రభుత్వం ఏర్పాటుకు పార్టీల ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా ప్రధాని నెతన్యాహు బుధవారం రాత్రి దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ హమాస్‌కు గట్టి హెచ్చరికలు చేశారు. "హమాస్ అనేక అకృత్యాలకు పాల్పడింది. అమ్మాయిలపై అత్యాచారాలు చేసి చంపేశారు. మహిళలు, పురుషులను సజీవ సమాధి చేశారు. సైనికుల తలలు నరికి చంపారు. గాజాలో అతిత్వరలో క్షేత్రస్థాయిలో దాడులు చేపడతాం. హమాస్ గ్రూప్ ఉనికి ఈ భూమిపైనే లేకుండా చేస్తాం.

ప్రతి హమాస్ సభ్యుడు మూల్యం చెల్లించాల్సిందే. వారు అసలు మనుషులు కాదు. వారిని నలిపేస్తాం. ఆ గ్రూప్‌ను నాశనం చేస్తాం" అని నెతన్యాహు హెచ్చరించారు. ఇక గాజాలో హమాస్ టన్నెల్, బంకర్ నెట్‌వర్క్‌లపై ఇజ్రాయెల్ గురిపెట్టింది. ఆ నెట్‌వర్క్‌ను ధ్వంసం చేసేలా వైమానిక దాడులు చేపడుతోంది. దీంతో గాజాలో అనేక భవనాలు క్షణాల్లో నేలమట్టమవుతున్నాయి. ఇదిలా ఉండగా.. ఇజ్రాయెల్‌పై లెబనాన్, సిరియా దాడులు మొదలుపెట్టింది. దీంతో యుద్ధం మరింత విస్తరించే అవకాశాలు కన్పిస్తున్నాయి.

# అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ నంబర్ వన్: మంత్రి జగదీశ్ రెడ్డి



సూర్యాపేట: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ నంబర్ వన్ అని మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. దళితుల ఆర్థికాభివృద్ధికి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం దేశంలో ఎక్కడా లేదని చెప్పారు. ఏ పార్టీ వల్ల తమ బ్రతుకులు బాగుపడ్డాయో ప్రజలు ఆలోచించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మంత్రి జగదీశ్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ.. 2014లో బీఆర్ఎస్‌కు వేసిన ఓటు రూ.7500 కోట్ల విలువైన నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు తీసుకొచ్చిందన్నారు. ఇప్పటివరకు సూర్యాపేటలో జరిగిన అభివృద్ధి కేవలం ఆరంభం మాత్రమేనని, ఇంకా చేయవలసింది చాలా ఉందని చెప్పారు. పార్టీలకు అతీతంగా రాబోయే రోజుల్లో బీఆర్ఎస్‌కు అండగా ఉండి అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. జడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన చేరికల్లో బచ్చలకూరి శేఖర్, ఇరుగు నవీన్, బచ్చలకూరి కరుణాకర్, బచ్చలకూరి అరవింద్, గుర్రాల రాంబాబుతోపాటు 25 దళిత కుటుంబాలు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు.

# అన్నవరం సత్యనారాయణ స్వామి వారిని దర్శించుకున్న మంత్రి ఎర్రబెల్లి

హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్‌లోని అన్నవరం శ్రీ సత్యనారాయణ స్వామి వారిని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు దర్శించుకున్నారు. గురువారం ఉదయం సతీసమేతంగా అన్నవరం ఆలయానికి చేరుకున్న మంత్రి ఎర్రబెల్లి.. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారిని ఆయల పండింతులు స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించాలని కోరుకున్నట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం, ప్రజలు సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ఆ భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు. బీఆర్ఎస్ జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.



# మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి మాతృవియోగం



హైదరాబాద్: రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి మాతృవియోగం కలిగింది. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న వేముల తల్లి మంజులమ్మ హైదరాబాద్‌లోని ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ కాసేపటి క్రితమే తుదిశ్వాస విడిచారు. తల్లి మరణంతో మంత్రి వేముల శోకసంద్రంలో మునిగిపోయారు. రేపు (శుక్రవారం) వారి స్వగ్రామం వేల్పూర్‌లో అంత్యక్రియలు జరుగనున్నాయి. మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాతృమూర్తి మంజులమ్మ మరణం పట్ల ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు సంతాపం ప్రకటించారు. తల్లి మరణంతో శోకతప్తులైన మంత్రి వేములకు, వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మంజులమ్మ మరణం పట్ల స్పీకర్ పోచారం శ్రీనివాస రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. మంత్రి ప్రశాంత్ రెడ్డి కుటుంబ సభ్యులకు స్పీకర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com